www.andhrajyothy.com
పేజీలు: 14
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 6.50
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 222
గురువారం 27-11-2025
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి రా.12.30 తదుపరి అష్టమి, నక్షత్రం: ధనిష్ఠ రా.2.32 తదుపరి శతభిషం, వర్జ్యం: శేషం ఉ. 7.22, దుర్ముహూర్తం: ఉ.10.12-ఉ.10.56, మ.2.37-3.22, అమృతఘడియలు: మ.3.42-5.22, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.30, సూర్యాస్తమయం: 5.34
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అహ్మదాబాద్‌లో 2030 కామన్వెల్త్ క్రీడలు

10

ఆతిథ్య హక్కులు దక్కించుకున్న భారత్
క్రీడల ఏజీఎంలో అధికారిక ఆమోదం
సుమారు 17 క్రీడాంశాల్లో పోటీలు

చంద్రబాబుపై 'ఫైబర్' కేసు క్లోజ్

అక్రమాలు జరగలేదని సీఐడీ నిర్ధారణ



ఆర్థిక నష్టాల్లేవని తేల్చిన సంస్థ
ఏకీభవించిన నాటి, నేటి ఎండీలు
కేసు మూసివేతకు కోర్టులో అంగీకారం 14
నాడు కక్ష సాధింపులో భాగంగా జగన్ కేసులు

సెస్సులు వేసి రోడ్లు!

సర్కారుకు ఆర్‌అండ్‌బీ ప్రతిపాదన

1,500 కి.మీ. స్టేట్ హైవేల అభివృద్ధికి నిర్ణయం

మూడేళ్లలో పనులు పూర్తి చేయాలన్న లక్ష్యం
వ్యయంలో ప్రభుత్వ వాటా రూ.4 వేల కోట్లు
నిధుల కోసం పెట్రోలు, డీజిల్, గనులు, రిజిస్ట్రేషన్లపై సెస్సు!
కాంట్రాక్టు సంస్థ వ్యయం 16 ఏళ్లలో తిరిగి చెల్లింపు
టోల్‌కూ అనుమతించాలన్న ఆర్‌అండ్‌బీ





ఆర్‌అండ్‌బీ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు, ఆ శాఖ ఉన్నతాధికారులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో 1500 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి/పునర్నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. హైబ్రిడ్ పద్ధతిలో చేపట్టే ఈ పనులకు 19 ఏళ్ల వ్యవధిలో రూ.22,826 కోట్లు ఖర్చుకానుంది. ఈ నిధుల కోసం రహదారి అభివృద్ధి సంస్థ (ఆర్డీసీ)కు చెందిన ఆస్తులను వాణిజ్య అవసరాలకు లీజులకు ఇవ్వడంతోపాటు పెట్రోలు, డీజిల్, ఆస్తుల రిజిస్ట్రేషన్, వాహన పన్నులపై సెస్సు విధించాలని ఆర్‌అండ్‌బీ శాఖ ప్రతిపాదించింది. బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద జరిగిన సమావేశంలో ఈ అంశంపై కీలక చర్చ జరిగింది. ఆర్‌అండ్‌బీ నివేదికలో ఏముందంటే... హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్) పద్ధతిలో 1500 కిలోమీటర్ల స్టేట్ హైవేల అభివృద్ధి/పునర్నిర్మాణ పనులను చేపడతారు. దీనికోసం ప్రభుత్వ నిధులతో పాటు కాంట్రాక్టర్లూ ఖర్చు పెడతారు. ఈ ప్రాజెక్టు కాల వ్యవధి 19 సంవత్సరాలు. తొలి ఏడాది 600 కిలోమీటర్లు, రెండో ఏడాది 600 కిలోమీటర్లు, మూడో ఏడాది 300 కిలోమీటర్ల చొప్పున రహదారులను నిర్మిస్తారు. ఇందులో 40 శాతం వాటా... రూ.4వేల కోట్ల వరకు ప్రభుత్వం భరిస్తుంది. భూ సేకరణ, పునరావాసం, ఇంకా ఇతర ఖర్చులు కూడా ఇందులో కలిపే ఉంటాయి. మిగిలిన 60 శాతం రూ.7761 కోట్ల ఖర్చును కాంట్రాక్టు సంస్థ భరిస్తుంది. ఆ ఖర్చును ప్రభుత్వం ఏటా దశల వారీగా వడ్డీతో కలిపి 16 సంవత్సరాలలో చెల్లిస్తుంది. రహదారి పనులు పూర్తయిన తర్వాత కాంట్రాక్టరు టోల్ వసూలుకు కూడా అనుమతి లభిస్తుంది. ఇదంతా కలిపి... మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.22,826 కోట్లకు చేరుతుందని అంచనా!

నిధుల సేకరణ ఇలా...

'హైబ్రిడ్' రహదారి ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు ప్రభుత్వానికి రూ.4వేల కోట్లు అవసరం. దీనికి నిధుల సమీకరణ కోసం భిన్న మార్గాలను యోచిస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ పేర్కొంది. అందులో... ఆర్డీసీకి చెందిన భూములు, స్థిరాస్తులను లీజుకు ఇవ్వడం కూడా ఒకటి. ఇంకా... పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు ఒక రూపాయి చొప్పున సెస్సు విధించాలని ప్రతిపాదించారు. దీనిద్వారా ఏటా రూ.732 కోట్లు వస్తాయని అంచనా వేశారు. అలాగే... ఖనిజాలు, గనుల నుంచి 10 శాతం సెస్సు వసూలు చేస్తే

మిగతా 10వ పేజీలో...

ఈ ఏడాది 6,433 మంది బలి


ఇప్పటివరకు 15,462 రోడ్డు ప్రమాదాలు
ఇకపై ప్రతి రోడ్డు ప్రమాదంపై ఆడిట్ చేయాలి
కారణాలు తెలుసుకుని చర్యలు తీసుకోవాలి
వేగ నియంత్రణకు స్పీడ్ గవర్నర్లు తప్పనిసరి
హెచ్చరికలను ఉల్లంఘిస్తే వాహనాలు సీజ్
ప్రతి అర కి.మీ.కు సీసీ కెమెరా ఏర్పాటు చేసి ఆర్టీజీఎస్‌తో అనుసంధానించాలి
యుద్ధ ప్రాతిపదికన రోడ్లపై గుంతలు పూడ్చాలి
రహదారి ప్రమాదాలు, ఆర్‌అండ్‌బీపై సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు తగ్గేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని రవాణా, పోలీసు అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రతి రోడ్డు ప్రమాదాన్ని థర్డ్ పార్టీతో ఆడిట్ చేయించాలని, డ్రైవర్ నిర్లక్ష్యం, రోడ్డు బాగాలేకపోవడం, ఇంజనీరింగ్ లోపం, వాహనం ఫిట్నెస్ లేకపోవడం లాంటి ప్రతి ప్రమాద కారణాన్ని తెలుసుకుని చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఇటీవల వరుస రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రోడ్ సేఫ్టీ కౌన్సిల్‌తో

మిగతా 10వ పేజీలో...

'అసెంబ్లీ' అదుర్స్



ప్రతిపక్ష నేతగా సామ్య
స్పీకర్ స్థానంలో స్వాతి
సీఎం పాత్రధారి లీలా గౌతమ్
స్టూడెంట్ అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా కొలువుదీరిన విద్యార్థులు

అధ్యక్షా.. అద్భుతః!

స్టూడెంట్ అసెంబ్లీలో అదరగొట్టిన చిన్నారులు

స్పీకర్ ఎన్నికతో పాటు ప్రశ్నోత్తరాలు, జీరో అవర్

రెండు బిల్లులపై ఆసక్తికర చర్చ.. ఆమోదం
సభను అడ్డుకున్న వారిని ఎత్తుకెళ్లిన మార్షల్స్
విద్యార్థులను టెర్రరిస్టులని ఎలా అంటారు?
మీటర్లు లేకుండా సోలార్ ప్యానెళ్లు పెడితే ఉపయోగం ఉండదని మీకు తెలియదా?
5జీ అంటున్నా.. మీ ప్రభుత్వం 2జీలో బఫరింగ్
సమస్యలపై పాలక పక్షాన్ని నిలదీసిన ప్రతిపక్షం
డ్రగ్స్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం
బడి పిల్లల బ్యాగుల బరువు తగ్గించాం
సమాధానాలతో దీటుగా తిప్పికొట్టిన ప్రభుత్వం
వీక్షించిన సీఎం చంద్రబాబు, స్పీకర్, మంత్రులు

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఎక్కడా తడబాటు లేదు. సీఎం, స్పీకర్ అక్కడే ఉన్నారన్న బెరుకు వారిలో కనిపించలేదు. తాము మాట్లాడాలనుకున్నది స్పష్టంగా మాట్లాడారు. ఇది అసలు అసెంబ్లీనేమో అనే స్థాయిలో స్టూడెంట్ అసెంబ్లీ అత్యంత ఆసక్తికరంగా సాగింది. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతో కూటమి ప్రభుత్వం అసెంబ్లీ ఆవరణలో బుధవారం స్టూడెంట్ అసెంబ్లీ నిర్వహించింది. 175 నియోజకవర్గాల

మిగతా 13వ పేజీలో...

విద్యార్థులు అదరగొట్టారు: సీఎం చంద్రబాబు
సమాజంలో మార్పు విద్యార్థులతోనే సాధ్యం
మహిళలను కించపరిచే పదాలొద్దు: లోకేశ్

భారతదేశ డేటా క్యాపిటల్‌గా విశాఖ 14

98 వేల కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్.. ఎక్స్‌లో బాబు, లోకేశ్



2

బలమైన ప్రజాస్వామ్యానికి పునాది..

రాజ్యాంగ బాధ్యతలే

బాధ్యతల నుంచే హక్కులన్న గాంధీజీ మాటలు మరవొద్దు
పౌరులంతా కచ్చితంగా ఓటు వేయాలి: ప్రధాని మోదీ
రాజ్యాంగ దినోత్సవాన లేఖ



2

ఇమ్రాన్ మృతి?

జైలులో హత్యకు గురయ్యారంటూ సోషల్ మీడియాలో ప్రచారం
ఇమ్రాన్‌ను చూసేందుకు వెళ్లిన చెల్లెళ్లపై జైలులోనే పోలీసుల దాడి
శ్రేణుల్లో కలవరం.. జైలు ముట్టడి

ఆర్మీలోకి లక్ష మంది అగ్నివీర్‌లు 2


ఏటా నియమించాలని యోచన

నాడు రోడ్లన్నీ గుంతలు..

ప్రశ్నిస్తే కేసులు

గత ప్రభుత్వం అంటే గుర్తొచ్చేవి ఇవే
ఏపీకి వైసీపీ మిగిల్చింది అప్పులే
2029లో జగన్ అధికారంలోకి రాడు
15 ఏళ్లు కూటమికి అండగా ఉండండి
యువతకు డిప్యూటీ సీఎం పిలుపు
కోనసీమ జిల్లా శివకోడులో పల్లె పండగ 2.0కు శ్రీకారం
13,326 పంచాయతీల్లో రూ.6,787 కోట్ల వ్యయంతో 53,382 పనులు చేపడతామన్న పవన్
కొబ్బరి రైతు సమస్యలపై విస్పష్ట హామీ





కోనసీమ జిల్లా కేశనపల్లిలో సముద్ర నీటి కారణంగా తలలు వాల్చేసిన కొబ్బరి చెట్ల పరిస్థితిని, శంకరగుప్తం డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్

14

మా నీళ్లను లాక్కుపోతే

మేం అడుక్కు తినాలా?

వందేళ్ల నాటి కేటాయింపులను ఎలా కుదిస్తారు?
కృష్ణా ట్రైబ్యునల్-2లో నిలదీసిన ఆంధ్రప్రదేశ్
విభజన తర్వాత మాకు వ్యవసాయమే ఆధారం
తెలంగాణకు హైదరాబాద్, ఐటీ కంపెనీలు ఉన్నాయి
మాకు రాజధానీ లేదు.. పరిశ్రమలూ లేవు.. ఏపీ వాదన

12

రాష్ట్ర ప్రయోజనాలపై రాజీ లేదు!

కృష్ణా జలాల కేటాయింపులపై పునఃసమీక్షకు ఒప్పుకోం: సీఎం

మీకు తెలిసే రాజీ జరిగిందా?

అయిపోయాక తెలిసిందా.. ఎవరు ఒత్తిడి చేశారు?

టీటీడీ పరకామణి చోరీ కేసులో.. నాటి ఈవో ధర్మారెడ్డికి సీఐడీ ప్రశ్నలు
ఎక్కువ రెట్లు డబ్బు ఇస్తానంటే దొంగతనం చేసిన వ్యక్తిని వదిలేయొచ్చా?
టీటీడీ నిబంధనలు ఏం చెబుతున్నాయ్?.. మాజీ ఈవోను అడిగిన సీఐడీ
బోర్డు ఎజెండాలో పెట్టాకే చర్యలు తీసుకున్నామన్న ధర్మారెడ్డి? 14
నాటి విజిలెన్స్ చీఫ్ నరసింహకూ అధికారుల ప్రశ్నలు.. నేడు వైవీ వంతు



రఘురామపై టార్చర్ కేసులో కదలిక!



ఏ-1 సునీల్‌కుమార్‌కు నోటీసులు 14
4న గుంటూరు సీసీఎస్ కార్యాలయానికి రావాలని వాట్సాప్ సందేశం.. నేడు అందజేత

హెచ్‌ఆర్88బీ888నంబరుకు 1.17 కోట్లు

» వేలంపాటలో సొంతం చేసుకున్న హరియాణా వ్యక్తి

» దేశంలో అత్యధిక ధర పలికిన వాహన నంబరు ఇదే

న్యూఢిల్లీ, నవంబరు 26: ఓ యాభై లక్షల రూపాయలు మనవి కావు అనుకుంటే ఓ చక్కని విలాసవంతమైన కారు సొంతం చేసుకొని రయ్ అంటూ రోడ్ల మీద దూసుకెళ్లొచ్చు! మరి.. ఆ వ్యక్తి ఏం చేశాడో తెలుసా? కారు కోసం కాదు.. దాని నంబరు కోసమే ఏకంగా రూ.1.17 కోట్లు వెచ్చించాడు! హెచ్‌ఆర్88బీ8888 అనే సూపర్ ఫ్యాన్సీ నంబరు కోసం అతడు ఇంత ధర పెట్టాడు. దేశంలో ఇప్పటివరకు వాహనాల నంబర్ల వేలంపాటలో ఓ వాహన నంబరుకు పలికిన అత్యధిక ధర ఇదే! హరియాణాలో ఆ రాష్ట్ర రవాణా శాఖ అధికారులు వాహన నంబర్ల వేలంను శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి సోమవారం ఉదయం తొమ్మిదింటి దాకా నిర్వహించారు. హెచ్‌ఆర్88బీ8888 నంబరుకు ప్రాథమిక ధరను రూ.50వేలుగా ఖరారు చేయగా అనూహ్యంగా రూ.1.17కోట్లు పలికింది. గతవారం ఆ రాష్ట్రంలోనే నిర్వహించిన వేలం పాటలో హెచ్‌ఆర్22డబ్ల్యూ2222 అనే నంబరు రూ.37.91 లక్షలు పలికింది.

గవర్నర్ అహంకారాన్ని అణచివేస్తాం: స్టాలిన్

చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడుల్లో ప్రజల ప్రాణాలను కాపాడలేని బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వాన్ని అదేపనిగా ప్రశంసిస్తూ, శాంతికి నిలయమైన తమిళనాడు రాష్ట్రాన్ని ఉగ్రవాద రాష్ట్రంగా పేర్కొంటున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి అహంకారాన్ని అణచివేస్తామని సీఎం స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడులో శాంతి భద్రతల సమస్యలు అధికంగా ఉన్నాయని, రాష్ట్రం ఉగ్రవాద ధోరణితో ఉందని గవర్నర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. "పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి, ఢిల్లీ ఎర్రకోట వద్ద పేలుడు, మణిపూర్ మండుతూనే ఉందన్న విషయం ఎరుకలేదా? అని గవర్నర్‌ను ప్రశ్నించారు. బీజేపీకి ఓటువేయని ప్రతి ఒక్కరూ ఉగ్రవాదులేనన్న ధోరణితో గవర్నర్ మాటలు ఉన్నాయని, ఇవి ఆయన బాధ్యతలకు పూర్తిగా విరుద్ధమైనవని ధ్వజమెత్తారు.

గుండెపోటు బాధితులకు ఉచితంగా 50 వేల విలువైన ఇంజెక్షన్

» యూపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

లఖ్‌నవూ, నవంబరు 26: గుండెపోటు బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఓ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు.. రూ. 40-50 వేల విలువైన టెనెక్టెప్లేస్/స్ట్రెప్టోకినేస్ అనే ఇంజెక్షన్‌ను ఇకపై రాష్ట్రంలోని అన్ని జిల్లా ఆస్పత్రులు, వైద్య కళాశాలలతో పాటు ప్రధాన కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో(సీహెచ్‌సీ) ఉచితంగా అందించనున్నారు. గుండెపోటు వచ్చిన తక్షణమే రక్తం గడ్డ కట్టడాన్ని నివారించడంలో ఈ ఇంజెక్షన్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇప్పటికే ఈ సౌకర్యాన్ని కొన్ని అగ్రశ్రేణి వైద్య సంస్థలలో 'హబ్-అండ్-స్పోక్' విధానంలో ప్రభుత్వం అమలు చేస్తోంది.

మోసకారి జగన్‌ను ప్రజలు నమ్మరు!

» అరటి తోటల సందర్శన పెద్ద నాటకం

» ఉనికి కోసమే చంద్రబాబుపై విమర్శలు: బీటెక్ రవి



కడప మారుతీనగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడమే కాకుండా ప్రజల్లో భయాందోళనలు కలిగించి, శాంతిభద్రతలే లేకుండా చేసిన వైసీపీ అధ్యక్షుడు జగన్ మోసకారి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితులు లేవని టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అన్నారు. బుధవారం కడపలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో విధ్వంసాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు. జగన్ మూడుసార్లు భూమిపూజ చేసినా స్టీల్ ఫ్యాక్టరీ మొదలు కాలేదని, అదే స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి చంద్రబాబు సారధ్యంలోని ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని తెలిపారు. జగన్ పాలనలో కడప జిల్లాకు ఏం చేశారో చెప్పేందుకు ఒక్కటంటే ఒక్క అంశమైనా ఉందా అని ప్రశ్నించారు. పులివెందులలోని పైడిపాలెం, చిత్రావతికి నీరు ఇచ్చింది తెలుగుదేశం పాలనలోనే అన్నారు. గిట్టుబాటు ధర లేదంటూ పులివెందులలో అరటి తోటలను జగన్ సందర్శించడం పెద్ద నాటకమని విమర్శించారు. ఉనికి కోసం అరటి రైతుల పరామర్శ పేరుతో చంద్రబాబును తిట్టేందుకే జగన్ అరటి తోటల సందర్శన పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు.

సర్కారీ కొలువులకు గౌరవప్రదమైన పేర్లు

» పేరు మార్చాల్సిన పోస్టులు వందల్లోనే

» నెలలో పూర్తిచేయాలని సీఎస్ ఆదేశాలు.. జీవో జారీ

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్యూన్, వాచ్‌మన్, అటెండర్, ప్లంబర్, స్కావెంజర్, ఫిట్టర్, చౌకీదార్ తదితర వందలాది పోస్టులకు గౌరవప్రదమైన పేర్లు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అక్టోబరు 18న సీఎం చంద్రబాబుతో ఉద్యోగ సంఘాలు భేటీ అయిన సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ బుధవారం జీవో జారీ చేసింది. ఈ పోస్టులు, పేర్ల పరిధిలోకి వచ్చే సాధారణ సర్వీసు రూల్స్, ప్రత్యేక సర్వీస్ రూల్స్‌ను కొన్ని దశాబ్దాల క్రితం తయారుచేశారు. ఇందులో కొన్నింటిని 1991లో వన్‌మ్యాన్ కమిషన్ కంటే ముందుగా సిఫారసు చేశారు. అప్పటి నుంచి ప్రభుత్వంలోని వివిధ పోస్టుల పేర్లను పునఃసమీక్షించలేదు. ప్రభుత్వంతోపాటు, స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీలు, బోర్డులు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో పాత పేర్లే కొనసాగుతున్నాయి. ఇందులో చాలా పోస్టుల పేర్లు గౌరవప్రదంగా లేవని ప్రభుత్వం భావిస్తోంది. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వాన్ని, గౌరవంగా బతికే హక్కును కల్పిస్తోంది. డిగ్నిటీ ఆఫ్ లేబర్ ప్రతి పౌరుడి హక్కు. దీన్ని పునరుద్ఘాటిస్తూ సుప్రీంకోర్టు గతంలో తీర్పులు కూడా వెలువరించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, ప్రభుత్వ రంగంలోని సంస్థల పాలనా యంత్రాంగంలో ఉన్న పోస్టులన్నింటికీ గౌరవప్రదమైన పేర్లు ఉండాలని, దీనికి అనుగుణంగా కొన్ని పోస్టుల పేర్లు మార్చాలని తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. పేర్లు మార్చాల్సిన అవసరం ఉన్న కొన్ని వందల పోస్టులను గుర్తించింది. 20 శాఖల్లో పేర్లు మార్చాల్సిన పోస్టుల జాబితాను సాధారణ పరిపాలన శాఖ సిద్ధం చేసింది. పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ, సాధారణ పరిపాలనా శాఖల్లో పేర్లు మార్చాల్సిన పోస్టులు అత్యధికంగా ఉన్నాయి. ఆ పోస్టులకు గౌరవప్రదమైన పేర్లు పెట్టేందుకు అన్ని శాఖల కార్యదర్శులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ జీవోలో సీఎస్ విజయానంద్ ఆదేశించారు. అలాగే, ప్రభుత్వం రూపొందించిన జాబితాలో లేని, పేర్లు మార్చాల్సిన పోస్టులేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అన్ని శాఖల కార్యదర్శులు తమ శాఖాధిపతుల నుంచి పేర్లు మార్చదగిన పోస్టులు, వాటికి పెట్టాల్సిన గౌరవప్రదమైన పేర్ల జాబితాను ఏడు రోజుల్లోగా సాధారణ పరిపాలనా శాఖకు సమర్పించాలని ఆ జీవోలో సీఎస్ ఆదేశించారు. తర్వాత 3 వారాల్లోగా పేర్లు పెట్టడంపై ఆదేశాలు వెలువరించాలని చెప్పారు.

ఆర్మీలోకి లక్ష మంది అగ్నివీర్‌లు

న్యూఢిల్లీ, నవంబరు 26: అగ్నివీర్‌లను భారీఎత్తున సైన్యంలోకి తీసుకునేందుకు రక్షణ శాఖ సిద్ధమవుతోంది. అగ్నిపథ్ విధానంలో ఇకపై ఏడాదికి లక్ష మందికి పైగా అగ్నివీర్‌లను భర్తీ చేసుకోవాలని భావిస్తోంది. 2020కి ముందు భర్తీ అయిన జవాన్లు ఏడాదికి దాదాపు 60 వేల మంది చొప్పున ప్రతి సంవత్సరం పదవీవిరమణ చేయనున్నారు. కొవిడ్ రెండేళ్ల కాలం సైన్యంలోకి భర్తీలు నిలిచిపోయాయి. దానివల్ల రానున్న సంవత్సరాల్లో పదవీవిరమణల కారణంగా తీవ్ర సిబ్బంది కొరతను సైన్యం ఎదుర్కోనుంది. దాదాపు 1.80 లక్షల పోస్టులు ఖాళీ అవుతాయని అంచనా. దానికితోడు నాలుగేళ్ల కోసం భర్తీ చేసుకున్న అగ్నివీర్‌ల పదవీకాలం కూడా వచ్చే ఏడాది చివరికి పూర్తి కానుంది. 2022 మధ్యలో అగ్నిపథ్ పథకం తెచ్చేనాటికి త్రివిధ దళాల్లో 46 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఆర్మీలోనే 40 వేల మంది కొరత ఉంది. అగ్నిపథ్ కింద గరిష్ఠంగా మొత్తం 1.75 లక్షల మందిని మిలిటరీలోకి, దాదాపు 28,700 మందిని వాయుసేవ, నేవీలోకి భర్తీ చేసుకోవాలని అప్పట్లో భావించారు. అయితే, రెగ్యులర్ ఆర్మీ, అగ్నివీర్‌ల నుంచి రిటైర్‌మెంట్లు పెరగనున్న దరిమిలా ఏటా లక్షకుపైగా పోస్టులు సైన్యంలో ఖాళీ అవుతాయని తాజాగా అంచనా వేస్తున్నారు.

రాజ్యాంగ బాధ్యతలే పునాది

బాధ్యతల నుంచే హక్కులు వస్తాయన్న మహాత్మాగాంధీ మాటలు గుర్తుంచుకోవాలి

» పౌరులంతా కచ్చితంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, నవంబరు 26: దేశంలో బలమైన ప్రజాస్వామ్యానికి రాజ్యాంగ బాధ్యతలే బలమైన పునాది అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రజలంతా రాజ్యాంగ బాధ్యతలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవం నేపథ్యంలో దేశ ప్రజలకు ప్రధాని ఒక లేఖ రాశారు. ఒక బలహీన, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబానికి చెందిన తాను 24 ఏళ్లుగా ప్రభుత్వాధినేతగా ఉండగలగడం మన రాజ్యాంగం శక్తికి నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ఓటు హక్కును వినియోగించుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. బాధ్యతల నిర్వహణ నుంచే హక్కులు వస్తాయన్న మహాత్మా గాంధీ మాటలను మోదీ గుర్తు చేశారు. బాధ్యతలను నెరవేర్చడం దేశ సామాజిక, ఆర్థిక పురోగతికి అవసరమన్నారు. రాజ్యాంగ నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన బాబూ రాజేంద్ర ప్రసాద్, అంబేడ్కర్‌లతోపాటు స్వాతంత్ర్య పోరాటంలో ముందుండి నిలిచారంటూ మహాత్మా గాంధీ, బిర్సా ముండా, వల్లభ్‌భాయ్ పటేల్‌ల కృషిని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తు తరాల జీవితాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. వికసిత భారత్ దిశగా దూసుకెళ్తున్న మన దేశంలో ప్రతి పౌరుడు తన బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. కొత్తగా 18 ఏళ్లు నిండి ఓటు హక్కు వచ్చిన వారి కోసం ఏటా నవంబర్ 26న పాఠశాలలు, కాలేజీలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రాజ్యాంగం మన దేశానికి ప్రత్యేక గుర్తింపు అని, మనకు గర్వకారణమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. వలసవాద మనస్తత్వాన్ని విడిచిపెట్టి జాతీయ వాద భావన వైపు మళ్లేందుకు దారిచూపే మార్గనిర్దేశకం రాజ్యామని చెప్పారు. పాత పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ దేశం కూడా గొప్పగా మారలేదని.. వికసిత భారత్ లక్ష్యం దిశగా పౌరులంతా కలసి నడవాలని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. కాగా, ఈ కార్యక్రమంలో తెలుగు, మళయాలం, మరాఠీ, నేపాలీ, పంజాబీ, బోడో, కశ్మీరీ, ఒడియా, అస్సామీ భాషల్లో రాజ్యాంగ డిజిటల్ ప్రతులను రాష్ట్రపతి విడుదల చేశారు. మరోవైపు సుప్రీంకోర్టులో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో జస్టిస్ సూర్యకాంత్‌తోపాటు భూటాన్, కెన్యా, మారిషస్, శ్రీలంక దేశాల సుప్రీంకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు పాల్గొన్నారు. భారత్‌లో ప్రజాస్వామ్యాన్ని, న్యాయవ్యవస్థను ప్రశంసించారు.

రాజ్యాంగ సూత్రాలను మోదీ, షా దెబ్బతీస్తున్నారు: కాంగ్రెస్

భారత రాజ్యాంగాన్ని బలహీనం చేసేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ సూత్రాలను ఉద్దేశపూర్వకంగా ఒక ప్రణాళిక ప్రచారం దెబ్బతీస్తున్నారని మండిపడింది. ప్రస్తుతం బీజేపీ రాజ్యాంగంపై చూపుతున్న ప్రేమ కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఆడుతున్న నాటకం మాత్రమేనని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అది పేదలను, బలహీన వర్గాలను రక్షించే కవచమని.. దానిపై బీజేపీ దాడిని ఎట్టిపరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని రాహుల్ గాంధీ 'ఎక్స్'లో పోస్టుపెట్టారు. ఇక ప్రధాని మోదీ ఎన్నడూ పాటించని రాజ్యాంగ బాధ్యతలను ప్రజలకు ఉపదేశించడం ఏమిటని జైరామ్ రమేశ్ ఎద్దేవా చేశారు.

మత విద్వేషానికి పేరుపొందిన మీరా మాకు చెప్పేది?

మోదీ రామ మందిర ధ్వజారోహణను పాక్ తప్పుబట్టడంపై భారత విదేశాంగ శాఖ

అయోధ్య రామమందిర ధ్వజారోహణ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొనడాన్ని తప్పుబడుతూ పాకిస్థాన్ చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. మత విద్వేషానికి పేరు పొందిన పాకిస్థాన్ ఈ విషయంలో మాట్లాడటం ఏమిటని నిలదీసింది. అయినా భారత అంతర్గత అంశాల్లో జోక్యం చేసుకోవడం ఏమిటని మండిపడింది. ప్రధాని మోదీ అయోధ్య రామమందిరం ధ్వజారోహరణ చేయడాన్ని ప్రస్తావిస్తూ పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయం.. భారత్‌లో మతపరమైన మైనారిటీలు ప్రమాదంలో పడుతున్నారని.. ముస్లిం వారసత్వ ప్రాంతాలకు హిందూ ఉగ్రవాదుల ముప్పు పెరుగుతోందని పేర్కొంది. దీనిపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తీవ్రంగా మండిపడ్డారు. "మైనారిటీలపై వ్యవస్థాగత వివక్షకు పేరుపడిన దేశం పాకిస్థాన్. ముందు మీ దేశంలో మానవ హక్కుల అణచివేతపై, అంతర్గత సమస్యలపై దృష్టిపెట్టుకోవాలి" అని పాకిస్థాన్‌కు సూచించారు.

'ఉరి' హైడ్రో ప్లాంట్లపై దాడికి పాక్ యత్నం!!

» 'సిందూర్' వేళ భగ్నం చేసిన సీఐఎస్ఎఫ్

» 250 మందిని కాపాడిన సిబ్బంది

» 19 మంది జవాన్లకు 'డీజీ డిస్క్' ప్రదానం

న్యూఢిల్లీ, నవంబరు 26: 'ఆపరేషన్ సిందూర్' సమయంలో 'ఉరి'లోని జలవిద్యుత్ కేంద్రంపై దాడికి పాకిస్థాన్ ప్రయత్నించిన సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 19 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఆ యత్నాన్ని భగ్నం చేసి 250 మంది ప్రాణాలను కాపాడారు. వారి అసాధారణ సాహసాన్ని గుర్తించిన సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ రంజన్ మంగళవారం ఢిల్లీలో వారికి 'డీజీ డిస్క్'ను ప్రదానం చేశారు (అంకితభావం, అసాధారణ సాహసం, అద్భుత నైపుణ్యం ప్రదర్శించిన సీఐఎస్ఎఫ్ సిబ్బందికి ఈ అవార్డు అందజేస్తారు). దీంతో పాక్ దుశ్చర్య గురించి బయటి ప్రపంచానికి తెలిసింది. నేషనల్ హైడ్రో-ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) ఆధ్వర్యంలో నడిచే ఉరి హైడ్రో ప్లాంట్లపై పాక్ ఈ ఏడాది మే 6-7 తేదీల్లో తీవ్ర స్థాయిలో షెల్లింగ్‌కు పాల్పడింది. దీంతో పై 19 మంది సిబ్బందీ ఇంటింటికీ తిరిగి మహిళలు, పిల్లలు సహా పౌరులను, ఎన్‌హెచ్‌పీసీ ఉద్యోగులను, వారి కుటుంబాలను ఖాళీచేయించి సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు సీఐఎస్ఎఫ్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఓపక్క శత్రువులు నిర్విరామంగా భారీస్థాయిలో కాల్పులు జరుపుతున్నా, డ్రోన్లను ప్రయోగిస్తున్నా లెక్కచేయకుండా.. కమాండెంట్ రవి యాదవ్ సారథ్యంలోని సీఐఎస్ఎఫ్ బృందం ధైర్యంగా ఎదుర్కొంది. డ్రోన్లను నిర్వీర్యం చేసింది. విద్యుత్కేంద్రాలను, అక్కడి టౌన్‌షిప్‌ను, చివరకు ఆయుధ నిల్వల కేంద్రాలనూ కాపాడింది. పౌరులను, ఉద్యోగులను ఖాళీచేయించడమే గాక.. ఆయుధాలను సైతం సురక్షితంగా వేరేచోటకు తరలించింది. సీఐఎస్ఎఫ్ సిబ్బంది అప్రమత్తత, సన్నద్ధత కారణంగా జాతీయ సంపదను రక్షించుకోగలిగామని సదరు ప్రకటనలో పేర్కొంది.



ఇమ్రాన్‌ఖాన్ మృతి?

» జైలులో హత్యకు గురయ్యారంటూ పాకిస్థాన్‌లో పెద్ద ఎత్తున ప్రచారం

న్యూఢిల్లీ, నవంబరు 26: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైల్లో మరణించారంటూ వదంతులు వ్యాపించడంతో.. ఆయన ఎక్కడున్నారంటూ అడియాలా జైలుపై పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) కార్యకర్తలు, అభిమానులు దాడికి దిగారు. బుధవారం వేలాది మంది జైలు ముందు చేరి ముట్టడించేందుకు యత్నించినట్లు సమాచారం. అవినీతి కేసులో రెండేళ్లుగా ఇమ్రాన్ జైలు శిక్ష అనుభవిస్తున్నారు. అయితే అడియాలా జైలులో ఇమ్రాన్ అనుమానాస్పద స్థితిలో హత్యకు గురయ్యారంటూ పాక్‌తో పాటు బలూచిస్థాన్, అఫ్గానిస్థాన్‌కు చెందిన అనేక సోషల్ మీడియా ఖాతాలు పేర్కొన్నాయి. దీనికి ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్, ఐఎస్ఐ కారణమంటూ ఆరోపించాయి. ఈ నేపథ్యంలోనే గత వారం ఇమ్రాన్‌ను చూసేందుకు ఆయన ముగ్గురు చెల్లెలు జైలుకెళ్లగా.. పోలీసులు నిరాకరించి తమపై అమానుషంగా దాడి చేశారంటూ వారు ఆందోళనకు దిగారు. 'ఇమ్రాన్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు జైలుకెళ్లగా పోలీసులు నిరాకరించారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రయత్నం చేయగా.. వారు పక్కా ప్లాన్‌తో కరెంట్ తీసేసి మాపై దాడి చేశారు. 71 ఏళ్ల వయసున్న నన్ను జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్లి రోడ్డుపై పడేశారు. దీనిపై దర్యాప్తు జరపాలి' అని నోరీన్ నియాజీ పంజాబ్ పోలీస్ చీఫ్‌కు సోమవారం లేఖ రాశారు. ఈ నేపథ్యంలోనే ఆందోళనలు తీవ్రమై తాజాగా జైలును ముట్టడించే వరకు చేరుకున్నాయి. అయితే ఇమ్రాన్ ఆరోగ్య పరిస్థితి, ఆయన ఎక్కడున్నారనే దానిపై ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ ఏడాది జూన్ చివరలో కోర్టుకు హాజరైనప్పుడు 73 ఏళ్ల ఇమ్రాన్ చివరిసారి బహిరంగంగా కనిపించారు. ఇమ్రాన్ ఖాన్‌ను జైల్లోనే చిత్రహింసలు పెట్టి చంపేశారని బలూచిస్థాన్ విదేశాంగ శాఖ పేర్కొంది. ఐఎస్ఐ, ఆసిమ్ మునీరే ఈ కుట్రకు పాల్పడ్డారని ఆరోపించింది.

మార్కుల ఆధారంగా రెన్యువల్

» ఎస్సీ విద్యార్థుల ఉపకార వేతనాలకు నూతన మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ 2024-25 విద్యా సంవత్సరానికి షెడ్యూల్ కులాల విద్యార్థులకు అత్యున్నత స్థాయి ఉపకార వేతన పథకానికి సంబంధించిన తాజా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ నిబంధనలను ఎస్సీ విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని విస్తృతం చేయడంతో పాటు విద్యాసంస్థల బాధ్యతను మరింత బలపరిచేలా రూపొందించారు. దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో చేరే షెడ్యూల్ కులాల విద్యార్థులకు అత్యుత్తమ స్థాయి విద్య అందించేలా దీనికి రూపకల్పన చేశారు. ఈ పథకం కింద విద్యార్థుల పూర్తి ట్యూషన్ ఫీజు, తిరిగి చెల్లించని ఇతర రుసుములను నేరుగా వారి ఖాతాల్లోకి బదిలీ చేస్తారు. ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులకు ఈ మొత్తాన్ని సంవత్సరానికి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు పరిమితం చేశారు. అదనంగా, నివాసం, పుస్తకాలు, ల్యాప్‌టాప్‌లు వంటి అవసరాల కోసం మొదటి సంవత్సరంలో రూ.80 వేలు, తర్వాత ప్రతి సంవత్సరం రూ.41 వేలు చొప్పున అందజేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లను పొందుతున్న విద్యార్థులకు ఈ పథకం వర్తించదు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షల లోపు ఉండి.. ఐఐటీ, ఐఐఎమ్, ఎయిమ్స్, ఎన్ఐటీ, నేషనల్ లా యూనివర్సిటీలు, ఎన్ఐఎఫ్‌టీ, ఎన్ఐడీ, ఐహెచ్ఎమ్ వంటి గుర్తింపు పొందిన సంస్థల్లో ప్రవేశం సాధించిన ఎస్సీ విద్యార్థులు మాత్రమే ఈ పథకానికి అర్హులు. కోర్సు పూర్తయ్యే వరకు ఏటా వారి మార్కుల ఆధారంగా రెన్యువల్ చేస్తారు. అయితే, ఇప్పటికే ఈ పథకంలో లబ్ధి పొందుతున్న విద్యార్థులు కోర్సు పూర్తయ్యే వరకు సహాయం పొందుతారు.

2 కోట్ల ఆధార్ నెంబర్ల రద్దు!

న్యూఢిల్లీ, నవంబరు 25: మరణించిన వ్యక్తుల తాలూకు రెండు కోట్లకుపైగా ఆధార్ నెంబర్లను రద్దు (డీయాక్టివేట్) చేసినట్లుగా 'భారతీయ విశిష్ట గుర్తింపు సాధికార సంస్థ' (యూఐడీఏఐ) బుధవారం తెలిపింది. జాతీయ సమాచార ప్రక్షాళన ప్రక్రియలో భాగంగా గత ఏడాది జనవరిలో ఈ ప్రక్రియ మొదలైందని గుర్తు చేసింది. ఆధార్ వివరాల సమగ్రతను కాపాడటం, దుర్వినియోగాన్ని అరికట్టటం లక్ష్యంగా దీనిని చేపట్టినట్లు పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నుంచి తీసుకున్న సమాచారంతోసరిపోల్చి ఆధార్ నెంబర్ల డీయాక్టివేషన్ జరుపుతున్నట్లు వెల్లడించింది. మరణించిన వ్యక్తి కుటుంబసభ్యులు కూడా.. 'మై ఆధార్' వెబ్‌సైట్‌లో మరణ ధ్రువీకరణపత్రంతో మృతుడి ఆధార్‌ను డీయాక్టివేట్ చేయటానికి దరఖాస్తు చేయవచ్చని యూఐడీఏఐ సూచించింది.

అరుదైన ఖనిజాలకు

7,280 కోట్ల ఊతం

» రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ తయారీకి కేంద్ర ప్రభుత్వం కొత్త పథకం


న్యూఢిల్లీ, నవంబరు 26: అనేక రంగాల్లో వినియోగిస్తున్న అరుదైన భూ అయస్కాంతాల తయారీని ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రూ.7,280 కోట్లతో కొత్త పథకానికి ఆమోదముద్ర వేసింది. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో రేర్ ఎర్త్ పర్మనెంట్ మ్యాగ్నెట్స్ తయారీని ప్రోత్సహించే పథకానికి ఆమోదం లభించింది. దేశంలో వార్షికంగా 6,000 మెట్రిక్ టన్నుల (ఎంటీపీఏ) సామర్థ్యాన్ని ఏర్పాటు చేసే లక్ష్యంతో ఉన్నట్టు కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు తెలిపారు. ప్రధానంగా ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనం, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, వైద్య పరికరాలు, రక్షణ రంగంలో అరుదైన భూ అయస్కాంతాలను వినియోగిస్తున్నారు. ఈ పథకంలో భాగంగా గ్లోబల్ పోటీ బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా మొత్తం సామర్థ్యాన్ని ఐదుగురు తయారీదారులకు కేటాయించనున్నారు. ప్రతి తయారీదారుకు 1,200 ఎంటీపీఏ సామర్థ్యం వరకు కేటాయిస్తారు. ఈ పథకం మొత్తం కాల పరిమితి ఏడేళ్లు. కేటాయించిన తేదీ నుంచి ఇది అమల్లో ఉంటుంది. మొదటి రెండేళ్లు ఇంటిగ్రేటెడ్ రేర్ ఎర్త్ పర్మనెంట్ మ్యాగ్నెట్స్ (ఆర్ఈపీఎం) తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి ఉంటుంది. తర్వాతి ఐదేళ్లు ఆర్ఈపీఎం అమ్మకాలపై ప్రోత్సాహకాల పంపిణీ ఉంటుంది. అరుదైన భూ అయస్కాంత మెటీరియల్స్ ఎగుమతుల నిబంధనలను చైనా కఠినతరం చేస్తున్న నేపథ్యంలో భారత పరిశ్రమలకు సరఫరా పరంగా సవాళ్లు ఎదురుకానున్నాయి. ప్రస్తుతం భారత్ ఆర్ఈపీఎం అవసరాలన్నీ దిగుమతుల ద్వారా తీరుతున్నాయి. 2030 నాటికి డిమాండ్ రెండింతలు పెరిగే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయంగా పటిష్ఠవంతమైన ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం ముందడుగు వేసింది. ఆర్ఈపీఎంలు బలమైన మాగ్నెట్లు. వీటిని ప్రపంచవ్యాప్తంగా విరివిగా వినియోగిస్తున్నారు. వీటిని ఎలక్ట్రిక్ మోటార్లు, విండ్ టర్బైన్లు, డ్రోన్లు, శాటిలైట్లు, వైద్య పరికరాల్లో వాడుతున్నారు. కేంద్రం తీసుకున్న నిర్ణయం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పనతోపాటు పెట్టుబడుల ఆకర్షణకు అవకాశం ఉంటుంది.

9,858 కోట్లతో పుణె మెట్రో విస్తరణకు ఆమోదం

రూ.9,858 కోట్లతో పుణె మెట్రో రైల్ నెట్‌వర్క్ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం బుధవారం ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ ప్రాజెక్టు ఐదేళ్లలో పూర్తికానుంది. ఈ నిధులను కేంద్ర ప్రభుత్వం, మహారాష్ట్ర ప్రభుత్వం, బహుళ ఫండింగ్ ఏజెన్సీలు సంయుక్తంగా సమకూర్చనున్నాయి. కాగా రూ.2,781 కోట్ల విలువైన రెండు రైలు ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. వీటిలో గుజరాత్‌లోని ద్వారకా-కనాలస్ రైల్ లైన్ డబ్లింగ్‌తోపాటు ముంబైలోని బద్లాపూర్, కర్జాత్ మధ్య మూడు, నాలుగో లైన్ల నిర్మాణం ఉన్నాయి.

యుద్ధ విమానాలకు ఇక దేశీ ఇంజన్లు!

» ఐదో తరం ఫైటర్ జెట్ ఆమ్కాకు అవసరమైన ఇంజన్ టెక్నాలజీని 100 శాతం బదిలీ చేసేందుకు సిద్ధమైన ఫ్రెంచ్ సంస్థ శాఫ్రాన్



న్యూఢిల్లీ, నవంబరు 26: భారత దేశం అభివృద్ధి చేస్తున్న ఐదో తరం యుద్ధవిమానం ఆమ్కా (అడ్వాన్స్‌డ్ మల్టీ రోల్ ఎయిర్ క్రాఫ్ట్)కు అవసరమైన 120-140 కిలో న్యూటన్ ఇంజన్ టెక్నాలజీని 100% బదిలీ చేయడానికి ఫ్రెంచ్ ఏరోస్పేస్ దిగ్గజం 'శాఫ్రాన్' అంగీకరించింది. డీఆర్‌డీవోతో కలిసి తాము ఒక సరికొత్త ఇంజిన్‌ను భారత్‌లోనే తయారుచేయబోతున్నామని.. శాఫ్రాన్ సీఈవో ఒలివియర్ ఆండ్రీస్ తెలిపారు. అత్యంత కీలకమైన హాట్ సెక్షన్ సహా.. ఇది పూర్తిస్థాయి టెక్నాలజీ బదిలీ అని, భారత్‌కు మరెవ్వరూ ఇలాంటి ఆఫర్ ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. హాట్ సెక్షన్ అంటే.. విమానం ఇంజన్‌కు హృదయం లాంటిది. డీఆర్‌డీవోకు చెందిన గ్యాస్ టర్బైన్ రిసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (జీటీఆర్ఈ)తో కలిసి ఆ సంస్థ కొత్త ఇంజన్‌ను అభివృద్ధి చేయనుంది. ఇందుకోసం దాదాపు రూ.62,450 కోట్లతో ఒక జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించి భారత ప్రభుత్వం త్వరలోనే ఒక ప్రకటన చేయనుంది. కాగా.. ఆమ్కా ఎం2కేలకే కాక.. భవిష్యత్తులో తయారుచేసే ట్విన్ ఇంజన్ స్టెల్త్ యుద్ధవిమానాలకు సైతం ఉపయోగపడేలా ఈ ఇంజన్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఆమ్కా అభివృద్ధి, ఉత్పత్తిలో భాగం కావడానికి.. టాటా గ్రూప్, ఎల్ అండ్ టీ, అదానీ డిఫెన్స్ ఇప్పటికే ఆసక్తి చూపుతున్నాయి. ప్రస్తుతం మన దేశం వద్ద ఉన్న అన్ని యుద్ధవిమానాలకూ విదేశీ ఇంజన్లనే వినియోగిస్తున్న సంగతి తెలిసిందే. యుద్ధవిమానాల తయారీ, నిర్వహణలో గణనీయమైన ఖర్చు ఇంజన్లకే అవుతుంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బదులు దేశీయంగా అభివృద్ధి చేసుకోగలిగితే ఆ ఖర్చు బాగా తగ్గుతుంది. ఈ నేపథ్యంలోనే.. భారతదేశం 'ప్రాజెక్ట్ కావేరీ' పేరిట సొంతంగా యుద్ధవిమాన ఇంజన్ తయారీకి ప్రయత్నించింది. ఆ ఇంజన్‌ను తేజస్ కోసం డిజైన్ చేశారు. కానీ తేజస్‌కు కావాల్సింది 90 కిలోన్యూటన్ థ్రస్ట్ కాగా.. కావేరీ ఇచ్చింది 70 కిలోన్యూటన్ కంటే తక్కువ థ్రస్ట్ (మిగ్‌కు దాదాపు సమానం). యుద్ధవిమాన ఇంజన్లలో అత్యంత కీలకమైన హాట్ సెక్షన్‌లో గాలి ఉష్ణోగ్రత 1600 డిగ్రీల నుంచి 1900 డిగ్రీల సెల్సియస్ దాకా ఉంటుంది. ఆ వేడిని తట్టుకునే టెక్నాలజీలు మనవద్ద లేకపోవడంతో కావేరీ ఇంజన్లు తగినంత థ్రస్ట్ ఇవ్వలేకపోయాయి. అందుకే తేజస్ తయారీకి జీఈ ఇంజన్లను వాడుతున్నారు (కావేరీ ఇంజన్లను మానవరహిత విమానాలకు వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం). ఇప్పుడు శాఫ్రాన్ సంస్థ ఈ హాట్ సెక్షన్‌కు సంబంధించిన టెక్నాలజీల స్వింటిసీ పూర్తిగా ఇస్తానంటోంది. కేవలం టెక్నాలజీ బదిలీయే కాక.. జీటీఆర్ఈతో కలిసి 100 శాతం భారత్‌లోనే ఉత్పత్తి చేయనున్నట్లు ఆండ్రీస్ వెల్లడించారు.

ఎయిర్ టు గ్రౌండ్ ఆయుధాల తయారీకి బెల్‌తో జాయింట్ వెంచర్

విమానం నుంచి నేలపై ఉన్న లక్ష్యాలను ఛేదించే 'ఎయిర్ టు గ్రౌండ్' ఆయుధాల తయారీకి తాము భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్)తో జాయింట్ వెంచర్ చేపట్టనున్నట్టు శాఫ్రాన్ సీఈవో ఆండ్రీస్ బుధవారం ప్రకటించారు. తమ వాణిజ్య విమాన కార్యక్రమానికి భారత్ ప్రధాన ప్రాంతంగా మారుతోందని ఆయన పేర్కొన్నారు. కొవిడ్ వంటి విపత్తులు, జియోపాలిటిక్స్ వల్ల సరఫరా చైన్లలో అంతరాయాల వంటి సమస్యల నుంచి, మానుఫ్యాక్చరింగ్ రిస్క్ నుంచి తప్పించుకోవడానికే భారత్‌ను తమ ప్రధాన హబ్‌గా మార్చుకోవాలని ఆ సంస్థ భావిస్తోంది. ఈ క్రమంలోనే ఆ సంస్థ.. ఎయిర్‌బస్ 320, బోయింగ్ 737 మ్యాక్స్ వంటి విమానాల్లో వాడే లీప్ ఇంజన్ల నిర్వహణ, మరమ్మతుల కోసం ఒక ప్లాంట్‌ను ప్రారంభించింది. భారత్‌లో ఇండిగో, ఎయిరిండియా, ఆకాశ వంటి విమానయాన సంస్థలు చాలావరకూ లీప్ ఇంజన్లున్న విమానాలనే వినియోగిస్తాయి. గతంలో ఆయా విమానాలకు మరమ్మతులు వస్తే విదేశాలకు పంపాల్సి వచ్చేది.



దాత రామలింగరాజుతో కలిసి వివరాలు వెల్లడిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, పక్కన అదనపు ఈవో వెంకయ్య చౌదరి

టీటీడీకి రూ.9 కోట్ల భారీ విరాళం

- పీఏసీల ఆధునికీకరణకు అందజేసిన మంతెన రామలింగరాజు

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): టీటీడీకి బుధవారం రూ.9 కోట్ల భారీ విరాళం అందింది. అమెరికాలో నివాసముంటున్న మంతెన రామలింగరాజు తన కుమార్తె మంతెన నేత్ర, అల్లుడు వంశీ గాదిరాజు పేరుపై ఈ విరాళాన్ని అందజేశారు. తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయాల (పీఏసీలు) ఆధునికీకరణకు ఈ మొత్తం వినియోగిస్తారు. తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో దాతతో కలిసి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఎంపీ అప్పలనాయుడు మీడియాకు ఈ వివరాలు తెలిపారు. 2012లో కూడా టీటీడీకి మంతెన రామలింగరాజు రూ.16.06 కోట్లు విరాళంగా ఇచ్చారని తెలిపారు. రామలింగరాజు మాట్లాడుతూ, తిరుమలతో తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన ఇద్దరు తాతలతో పాటు చిన్నాన్న కనుమూరి బాపిరాజు టీటీడీ బోర్డు చైర్మన్లుగా పనిచేశారని చెప్పారు.

శ్రీవారి సేవలో జస్టిస్ గోపాలకృష్ణారావు

తిరుమల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ గోపాలకృష్ణారావు



కొనుగోళ్లకు విపత్తి!

దిగుమతి సుంకం నిలిపివేత ఎఫెక్ట్!.. దేశీయ పత్తి కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం

- ముందుకురాని వస్త్ర వ్యాపారులు, సీసీఐ
- తక్కువ ధరకు లభిస్తున్న విదేశీ పత్తి
- సీసీఐ నిబంధనలతో కొనుగోళ్లు అంతంతమాత్రం
- పత్తి వైపు కన్నెత్తి చూడని సీసీఐ బయ్యర్లు
- రైతులకు మద్దతు ధర ప్రశ్నార్థకం
- ఎకరాకు 30 వేలకు పైగా నష్టం

విజయవాడ (కంచికచర్ల), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపై సుంకం నిలిపివేయటంతో కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం పడింది. విదేశీ పత్తి తక్కువ ధరకు లభిస్తుండటంతో వస్త్ర వ్యాపారులు దేశీయ పత్తి కొనుగోళ్లకు ముందుకు రావటం లేదు. గతంలో మాదిరిగా పత్తి కొన్నట్లయితే నష్టపోవాల్సి వస్తుందన్న కారణంగా భారత పత్తి సంస్థ (సీసీఐ) కూడా నిబంధనలు విధించి పెద్దగా కొనుగోలు చేయటం లేదు. దీంతో పత్తి రైతులకు మద్దతు ధర లభించటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఒక్క గుంటూరు జిల్లాలోనే 80 వేల ఎకరాలకు పైగా రైతులు పత్తి సాగు చేశారు. ఎకరానికి సగటున రూ.50 వేలు పెట్టుబడి పెట్టారు. భారీ వర్షాల వల్ల తొలికాపు దెబ్బతిన్నది. చెట్టు అడుగు భాగంలో గాలి తగలక, తేమ ఆరక పక్వానికి వచ్చిన కాయలు బూజు పట్టి నల్లగా మారాయి. చేలు మాత్రం పూత, పిందెలతో కళగానే ఉన్నాయి. పోనీ.. మధ్య, చివరి కాపులు చేతికి అందుతాయని రైతులు ఆశించినా.. ఇటీవలి మొంథా తుఫాన్ నిలువునా ముంచింది. తుఫాన్ దెబ్బకు చేలు మెత్తదనం కోల్పోయి, పత్తిగూళ్లు గిడస బారాయి. అప్పటిదాకా ఉన్న కాపంతా దెబ్బతిన్నది. సాధారణంగా డిసెంబరు, జనవరి నెలల్లో పత్తి తీతలు పూర్తవుతాయి. అలాంటిది ఈ నెలాఖరు నాటికే పత్తి తీతలు ఎక్కువగా పూర్తికానున్నాయి. ఇప్పటికే పలువురు రైతులు చేలు తొలగించి, రబీ పంటల సాగుకు సిద్ధపడుతున్నారు.

దిగుమతులపై 11 శాతం సుంకం

దేశీయ పత్తి ఉత్పత్తి తగ్గడంతో మార్కెట్లో ధరలు బాగా పెరుగుతున్నాయని, వస్త్ర పరిశ్రమ ఖర్చులు కూడా బాగా పెరిగినందున దిగుమతులపై సుంకాన్ని ఎత్తివేయాలని వస్త్ర పరిశ్రమ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో 11 శాతం దిగుమతి సుంకాన్ని ఈ ఏడాది ఆగస్టు 19 నుంచి సెప్టెంబరు 30 వరకు నిలిపివేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా సుంకం నిలిపివేత ఉత్తర్వులను డిసెంబరు 31 వరకు పొడిగించింది. ఈ ఉత్తర్వులు వస్త్ర వ్యాపారులకు మేలు చేకూర్చగా, దేశీయ పత్తి మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడింది. విదేశాల నుంచి పత్తి తక్కువ ధరకు వస్తుండటంతో వస్త్ర వ్యాపారులు దిగుమతుల వైపు మొగ్గుచూపుతున్నారు తప్పితే దేశీయ పత్తిని కొనేందుకు పెద్దగా ఆసక్తి చూపటం లేదు. సుంకం నిలిపివేత కారణంగానే సీసీఐ కూడా గతంలో మాదిరిగా చురుకుగా కొనటం లేదు. పలు రకాల నిబంధనలతో పెద్దగా పత్తి కొనుగోలు చేయటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. రైతుల నుంచి కొన్న పత్తి సీసీఐ జిన్నింగ్ చేసిన తర్వాత మార్కెట్లో అమ్మాల్సిందే. మద్దతు ధరకు రైతుల నుంచి కొన్న పత్తిని మార్కెట్లో ఆ ధరకు అమ్మటం చాలా కష్టం. తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్న భయంతో సీసీఐ కొనుగోళ్లు బాగా తగ్గించేందుకు పలు నిబంధనలతో ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా నాణ్యత లేదంటూ కొనటం లేదు. రాష్ట్ర పాలకులు ఒత్తిడి తీసుకువస్తున్నప్పటికీ సీసీఐ ససేమిరా అంటోందే తప్ప.. ముందుకు రావటం లేదు. ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న పత్తి వైపు సీసీఐ బయ్యర్లు కన్నెత్తి కూడా చూడటం లేదు.

అగాధంలో రైతులు!

ఒకవైపు భారీ వర్షాలు, మరోవైపు తుఫాన్ విలవిల్లాడుతున్న రైతులు, సుంకం నిలిపివేతతో అగాధంలో కూరుకుపోయారు. వరుసగా దెబ్బ మీద దెబ్బ పడటంతో నిలువునా కుంగిపోయారు. ఎకరానికి సగటున ఐదు క్వింటాళ్లకు మించి పత్తి రావటం లేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ.8,110. ఎనిమిది శాతం లోపు తేమ ఉంటేనే సీసీఐ మద్దతు ధర ఇస్తుంది. 12 శాతం మించితే కొనదు. 8 నుంచి 12 శాతం మధ్య ఒక్కొక్క శాతానికి రూ.81.10ల వంతున ధరలో కోత పెడుతుంది. రైతులు ఇందుకు అంగీకరించినప్పటికీ సీసీఐ కొనే పరిస్థితి కనుచూపు మేరలో కనిపించటం లేదు. దీంతో రైతులు గత్యంతరం లేక ప్రైవేట్ వ్యాపారులకు, దళారులకు క్వింటా రూ.4వేల నుంచి రూ.6వేల లోపు అమ్ముకుంటున్నారు. మద్దతు ధర లభించినట్లయితే రైతులకు కాస్త ఊరట లభించేది. కానీ ఇప్పుడు ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు నష్టపోవాల్సి వస్తోందని రైతులు లబోదిబోమంటున్నారు.

పత్తి అమ్మకాలకు ప్రత్యేక హెల్ప్‌లైన్

వాట్సాప్‌లో మెసేజ్ చేస్తే సీసీఐ స్పందిస్తుంది!!

తేమ శాతం 8 కంటే తక్కువుంటే పూర్తి మద్దతు ధర

గుంటూరు సిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పత్తి రైతుల సమస్యల పరిష్కారం, అమ్మకాల్లో సౌలభ్యం కోసం సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పత్తి అమ్మకాల్లో రైతులకు ఏ విధమైన సమస్యలు తలెత్తినా 76599 54529 నంబరుకు వాట్సాప్‌లో మెసేజ్ చేస్తే స్పందించి చర్యలు తీసుకుంటామని సీసీఐ మేనేజర్ శనివారం వెల్లడించారు. రాష్ట్రంలో 30 పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని, ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీఎం యాప్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న నంబర్ ఓటీపీ ద్వారా లాగిన్ కావాలని సూచించారు. లాగిన్ అయిన తర్వాత సమీపంలోని సీసీఐ కేంద్రానికి వెళ్లి పత్తి అమ్ముకోవడానికి వీలుగా స్లాట్ బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. పత్తిలో తేమ శాతం 8 కంటే తక్కువ ఉంటే కేంద్రం ప్రకటించిన మద్దతు ధర పూర్తిగా లభిస్తుందని సీసీఐ మేనేజర్ తెలిపారు. ఒక వేళ తేమ శాతం 8 కంటే మించి 12 వరకు ఉంటే నిబంధనలకు లోబడి మద్దతు ధరలో కోత ఉంటుందని స్పష్టం చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆరబెట్టిన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు.

'సుధా సోమానీ'లో పేలిన ట్యాంకర్

- ఇద్దరు కార్మికుల దుర్మరణం

శ్రీకాళహస్తి, (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం వెలంపాడు గ్రామ పరిధిలోని సుధా సోమానీ సిరామిక్స్ టైల్స్ పరిశ్రమలో ఆమ్లం నిల్వచేసే ట్యాం కరు బుధవారం ఉదయం పేలిం ది. ఈ ప్రమాదంలో చీరాలకు చెందిన పో తురాజు(31), ఒడిశాకు చెందిన అరబింద పాండే(25) మృతి చెందా రు. తిరుపతి జిల్లా చంద్రగిరికి చెందిన బాలాజీ, ఒడిశాకు చెందిన సౌభాగ్యనాయక్ గాయపడ్డారు.

నేటి నుంచి వైకుంఠద్వార దర్శనాలకు ఈ-డిప్ రిజిస్ట్రేషన్

- వెబ్‌సైట్, మొబైల్ యాప్‌తో పాటు వాట్సాప్ గవర్నెన్స్ 95523 00009 ద్వారా నమోదుకు చాన్స్

తిరుమల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు జరుగనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి తొలి మూడురోజుల స్లాటెడ్ సర్వదర్శన (ఎస్ఎస్‌డీ) టోకెన్ల ఈ-డిప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం నుంచి ఐదురోజుల పాటు జరుగనుంది. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, జనవరి 1వ తేదీలకు సంబంధించిన టోకెన్ల కోసం భక్తులు ఆన్‌లైన్‌లో గురువారం ఉదయం 10 గంటల నుంచి డిసెంబరు 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఆ తర్వాత డిసెంబరు 2వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు డిప్ ద్వారా ఎంపికైన భక్తులకు టోకెన్ల సమాచారాన్ని టీటీడీ పంపనుంది. రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు టీటీడీ వెబ్‌సైట్ ttdevasthanams. ap.gov.in, మొబైల్ యాప్ apps. apple. com/in/ app/ ttdevasthan am/, వాట్సాప్ గవర్నెన్స్ 95523 00009 ద్వారా అవకాశం కల్పించారు.

ఎంతమంది వచ్చినా దర్శనం

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

వైకుంఠద్వార దర్శనాలు జరిగే పది రోజులూ సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యం ఉంటుందని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమలలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు భక్తులు ఎలాంటి టికెట్లు, టోకెన్లు లేకపోయినా నేరుగా తిరుమలకు వచ్చి వైకుంఠద్వార దర్శనాలు చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎంతమంది భక్తులు వచ్చినా ఆ ఏడు రోజులు దర్శనాలు చేయిస్తామన్నారు. మొదటి మూడురోజులు మాత్రం టోకెన్లు ఉన్న భక్తులకే దర్శనం ఉంటుందని స్పష్టంచేశారు.

కృష్ణపట్నం ఇన్‌ఫ్రాటెక్‌కు భూకేటాయింపులు రద్దు చేయండి

- హైకోర్టులో పిల్.. ప్రభుత్వానికి నోటీసులు

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలోని వివిధ గ్రామాల పరిధిలో మల్టీ ప్రొడక్ట్ స్పెషల్ ఎకనామిక్ జోన్(సెజ్) పారిశ్రామిక పార్కు అభివృద్ధికి కృష్ణపట్నం ఇన్‌ఫ్రాటెక్ సంస్థకు చేసిన భూకేటాయింపులను రద్దుచేయాలని హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. ఆ సంస్థకు సేల్ డీడ్ ద్వారా మొత్తం 4,731 ఎకరాలు కేటాయించారని, పారిశ్రామిక పార్కు అభివృద్ధిలో ఆ సంస్థ విఫలమైనందున భూకేటాయింపును రద్దు చేసి.. భూమిని తిరిగి స్వాధీనం చేసుకొనేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ గూడూరుకు చెందిన ఎన్.మునీంద్ర రెడ్డి దీనిని దాఖలు చేశారు. బుధవారం జరిగిన విచారణలో ఆయన తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. దీనిపై ప్రభుత్వానికి కోర్టు నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది.

మా హయాంలో వ్యవసాయమంటే పండగ

- అన్ని రకాలుగా రైతులను ఆదుకున్నాం: జగన్



పులివెందుల సమీపంలోని బ్రాహ్మణపల్లెలో అరటి తోటల్లో కాయలను పరిశీలిస్తున్న జగన్

పులివెందుల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రైతులు అనేక ఇబ్బందుల్లో ఉన్నా ఆదుకోవాల్సిన ప్రభుత్వమే పట్టించుకోవడం లేదని మాజీ సీఎం జగన్ విమర్శించారు. ఉచిత పంటల బీమాను ఈ ప్రభుత్వం గాలికి వదిలేసిందని, తమ హయాంలో వ్యవసాయం అంటే పండగలా ఉండేదని అన్నారు. మూడురోజుల పర్యటనలో భాగంగా పులివెందులకు వచ్చిన ఆయన రెండో రోజు బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పులివెందుల సమీపంలోని బ్రాహ్మణపల్లెలో అరటి తోటలను పరిశీలించారు. అక్కడున్న రైతులతో మాట్లాడి.. పంట పరిస్థితిపై ఆరా తీశారు. కొన్ని నెలలుగా అరటి ధరలు పూర్తిగా పడిపోయాయని ఒక రైతు చెప్పారు. అనంతరం జగన్ అక్కడే విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకుండా అన్ని రకాలుగా ఆదుకున్నామన్నారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పులివెందులలో 2024 మార్చిలో కోల్డ్ స్టోరేజీని ప్రారంభించామని, దానిని వినియోగంలోకి తీసుకురాకుండా ఈ ప్రభుత్వం గాలికి వదిలేసిందని అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన 18 నెలల కాలంలో అతివృష్టి, అనావృష్టి, ప్రకృతి వైపరీత్యాల కారణంతో 11 సార్లు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని, కానీ ఒక్కసారి కూడా చెల్లించలేదని అన్నారు. ఇప్పటికే రూ.1100 కోట్లు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో కనీవినీ ఎరుగనిరీతిలో ఉల్లి రైతులు కూడా పంట సాగుచేసి ఇప్పుడు రోడ్లపై పారబోసిన పరిస్థితిని చూశామన్నారు.

మార్కెట్ ఇంటర్వెన్షన్‌పై చర్చకు సిద్ధం

- రూ.7700 కోట్లు ఏ రైతు కోసం వెచ్చించారో చెప్పాలి
- జగన్‌కు మంత్రి అచ్చెన్న సవాల్

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మార్కెట్ ఇంటర్వెన్షన్ అంటే ఏమిటో తెలియని జగన్.. మద్దతు ధరల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. రైతుల కోసం రూ.7,700 కోట్లు ఖర్చు చేశామంటున్న జగన్.. ఆ సొమ్మును ఎక్కడ ఏ పంటకు, ఏ రైతులకు ఇచ్చారో లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. 16 నెలల్లో రూ.వెయ్యి కోట్లు పంట ఉత్పత్తుల సేకరణకు వెచ్చించాం. వాటి వివరాలు తమ వద్ద ఉన్నాయని, దమ్ముంటే జగన్ హయాంలో ఖర్చు చేసిన రూ.7,700కోట్లపై బహిరంగ చర్చకు రావాలని అచ్చెన్న బుధవారం ఒక ప్రకటనలో సవాల్ చేశారు. కడప జిల్లాలో అరటి రైతుల పేరుతో జగన్ అబద్ధాలు చెబుతూ రైతుల్ని మోసం చేస్తున్నారని అచ్చెన్న మండిపడ్డారు. అరటి ధర తగ్గడానికి అధిక వర్షాలతో నాణ్యత తగ్గడం, ఉత్తరాది రాష్ట్రాల్లో సాగు పెరగడం, రెండో కోత పంట ఎగుమతికి అనువుగా లేకపోవడం వంటి కారణాలున్నాయని, అయితే, ఇవన్నీ చూడకుండా కూటమి ప్రభుత్వంపై జగన్ రాజకీయంగా దాడులు చేయడం ఉద్దేశపూర్వకంగా రైతుల్ని తప్పుదారి పట్టించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పాలనలో 3లక్షల టన్నులు ఎగుమతి చేశామని జగన్ చెప్పడం అబద్ధమని, కేంద్రం నుంచి అవార్డులు తెచ్చామన్న మాటకు ఎలాంటి రికార్డు లేదని అచ్చెన్న స్పష్టంచేశారు. ఐదేళ్ల పాటు వ్యవసాయ రంగాన్ని అధ్వాన స్థితికి తీసుకెళ్లిన జగన్ ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని, ఆయన పాలనలో అరటి, టమాటా, ఉల్లి పంటలకు గిట్టుబాటు ధర లేక ఉత్పత్తుల్ని రోడ్ల పక్కన పారబోసిన విషయాన్ని మరిచిపోయారా? అని అచ్చెన్న ప్రశ్నించారు.

ఎంపీ సీఎం రమేశ్‌కు మాతృవియోగం

- ప్రజాప్రతినిధులు, ప్రముఖుల నివాళులు



చింతకుంట రత్నమ్మ

ఎర్రగుంట్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ, రైల్వేబోర్డు స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేశ్ మాతృమూర్తి చింతకుంట రత్నమ్మ(83) బుధవారం తెల్లవారుజామున 3.39 గంటలకు స్వర్గస్థులయ్యారు. అనారోగ్యానికి గురైన ఆమె వారం రోజులుగా హైదరాబాదులో చికిత్స పొందారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలంలోని స్వగ్రామం పోట్లదుర్తికి తీసుకొచ్చారు. బుధవారం తెల్లవారుజామున ఆమె తుదిశ్వాస విడిచారు. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, అధికారులు, ప్రజలు పెద్దఎత్తున పోట్లదుర్తికి వచ్చి రత్నమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సీఎం రమేశ్‌కు ఫోన్‌చేసి పరామర్శించారు. రమేశ్ తల్లి మృతి పట్ల ఆయన సంతాపం తెలిపారు. రాష్ట్ర హోం మంత్రి అనిత ఫోన్‌లో సీఎం రమేశ్‌ను పరామర్శించారు. రత్నమ్మ అంత్యక్రియలు గురువారం ఉదయం 11 గంటలకు పోట్లదుర్తిలో పెన్నానది తీరాన జరగనున్నాయి.

చంద్రబాబు సంతాపం

అమరావతి, (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తల్లి రత్నమ్మ మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. రత్నమ్మ మృతి బాధాకరమని, ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. రమేశ్ కుటుంబానికి చంద్రబాబు తన సానుభూతి తెలిపారు.

చింతలపాలెంలో టీడీపీ నేత దారుణ హత్య

జలదంకి, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి మండలం చింతలపాలెం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు టీడీపీ నాయకుడు గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు(58)ను బుధవారం దారుణంగా హత్య చేశారు. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని తన కోళ్లఫారంలో ప్రసాద్ నాయుడు ఉండగా ఉదయం ఇద్దరు వ్యక్తులు వచ్చి 5 కిలోల కోళ్లు కావాలని అడిగి ఇప్పుడే వస్తామని వెళ్లిపోయారు. రైసుమిల్లు నుంచి వడ్లపొట్టు తీసుకురావడం కోసం ట్రాక్టర్ డ్రైవర్ గంగాధర్ 12 గంటల ప్రాంతంలో కోళ్లఫారం వద్దకు వచ్చాడు. ఫోన్ చేసినా తీయకపోవడంతో లోపలకు వెళ్లిచూడగా, ప్రసాద్ నాయుడు రక్తపు మడుగులో కనిపించారు. కావలి డీఎస్పీ శ్రీధర్, కలిగిరి సీఐ వెంకటనారాయణ, జలదంకి ఎస్ఐ లతీఫున్నీసా ఘటనాస్థలిని పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతోనే ప్రసాద్ నాయుడు హత్య జరిగిందని భావిస్తున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'గాలి' రాజకీయం

భయానకమైన కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఢిల్లీని రక్షించాలంటూ ఇండియాగేట్ దగ్గర సోమవారం నిరసన నిర్వహించి, అరెస్టయిన వారిని ఢిల్లీకోర్టు మూడురోజుల పోలీసు కస్టడీకి అప్పగించింది. ఈ కాలుష్య వ్యతిరేక ప్రదర్శనలో హిడ్మా ఫోటో ప్రదర్శన, పోలీసులపై దాడి ఇత్యాది పలు చర్యలకు వీరంతా పాల్పడినందున, వారి పుట్టుపూర్వోత్తరాలతో సహా సర్వమూ తవ్వితీయాలని ఢిల్లీ పోలీసులు నిర్ణయించుకున్నారు. భారత న్యాయ సంహితలో కొత్తగా చేరిన 197వ సెక్షన్ సైతం ప్రయోగించడం ద్వారా హిడ్మా అనుకూల నినాదాలు చేయడమంటే దేశభద్రత, సమగ్రత, సమైక్యతలకు విఘాతం కలిగించడమేనని పోలీసులు చాటిచెప్పదల్చారు. ఢిల్లీ కాలుష్య తీవ్రతను ఎత్తిపడుతున్న, ప్రభుత్వాల వైఫల్యాన్ని ప్రశ్నిస్తున్న నినాదాలు, చిత్రాలు అనేకం ఆ ప్రదర్శనలో ఉన్నప్పటికీ, హిడ్మా రేఖాచిత్రం మాత్రమే పాలకులనూ పోలీసులనూ కదిలించింది. బిర్సాముండా నుంచి హిడ్మా వరకూ అడవులు, పర్యావరణ పరిరక్షణకోసం నిరంతరంగా పోరాటం సాగుతూనే ఉందనీ, పర్యావరణ అనుకూల అభివృద్ధి విధానాలు కావాలనీ నిరసనకారులు నినదించారు. కాస్తంత కట్టు తప్పినప్పటికీ, కాలుష్యాన్ని నియంత్రించలేని పాలకుల అసమర్థతను ఈ ప్రదర్శన గట్టిగానే ప్రశ్నించింది.

మాకు ఊపిరాడడం లేదు, మమ్మల్ని బతకనివ్వండి, గొంతులో విషం పోయకండి వంటి నినాదాలతో ఒక ప్రధాన ప్రజా సమస్యనూ, పరిష్కారంలో పాలకుల వైఫల్యాన్ని గుర్తుచేస్తున్న ఈ ప్రదర్శనను పోలీసులు తీవ్రంగా తీసుకోవడం విచిత్రం. నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారడానికి ఎవరు కారకులన్న ప్రశ్నకు అటు పోలీసులూ, ఇటు ప్రదర్శనకారుల దగ్గర కావాల్సినన్ని జవాబులున్నాయి. ఆరోపణలు, ప్రత్యారోపణలను అటుంచితే, ప్రజాగ్రహాన్ని శాంతిభద్రతల సమస్యగా పోలీసులు మార్చివేసిన మాట వాస్తవం. పోలీసులు ఎంత రాక్షసంగా వ్యవహరించారో ఆ దృశ్యాలు తెలియచెబుతాయి. ప్రదర్శనను విచ్ఛిన్నం చేయడంతో సరిపెట్టకుండా, అరెస్టులు, నిర్బంధాలు, కఠిన చట్టాలతో దానిని కొనసాగించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. స్వచ్ఛమైన గాలిని కోరుతున్నవారిని సైతం దేశద్రోహులుగా చిత్రీకరిస్తారా అనీ, జీవించే హక్కును కాపాడుకోవడమూ నేరమేనా? అనీ విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

నిత్యం కాలుష్యాన్ని దిగమింగుతున్న ఢిల్లీ వాసుల పక్షాన ఈ యువత వీధుల్లోకి వచ్చింది. దీనిప్రభావమే కాబోలు, ప్రధానమంత్రి కార్యాలయం రంగంలోకి దిగి, విద్యుత్ వాహనాల వినియోగం స్థాయి, సౌకర్యాలు ఇత్యాది కాలుష్యనియంత్రణ చర్యలను సమీక్షించి, సకలవ్యవస్థలనూ హెచ్చరించింది. ఎక్యూఐ నాలుగు వందలు దాటిపోయిన స్థితిలో, ఊపిరాడని ఢిల్లీవాసులను నేరుగా ప్రధాని కార్యాలయమే రక్షించబూనుకుంది కనుక, పరిస్థితులు మెరుగుపడవచ్చు. ఇప్పటికే, గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్)ను సవరించి, స్థాయిని పెంచి, తదనుగుణమైన చర్యలు అమలవుతున్నాయి. స్కూళ్ళకు విడతలవారీ సెలవులు, ఉద్యోగుల వర్క్‌ఫ్రమ్ హోమ్ వంటివి మొదలైనాయి. దశాబ్దాలుగా ఉన్న సమస్యే కనుక, ఇప్పటికే ఏర్పడిన నిర్దిష్టమైన విధానాలను తూచ తప్పకుండా అమలు చేస్తే సరిపోతుంది. కాలుష్యం వేగంగా హెచ్చుతున్న స్థితిలోనే ఢిల్లీ ప్రభుత్వం, కేంద్రం కలిసికట్టుగా సుప్రీంకోర్టులో పోరాడి దీపావళి టపాసుల విక్రయం, వినియోగంమీద సానుకూల తీర్పు సాధించిన విషయం తెలిసిందే. ఆమ్‌ఆద్మీపార్టీ ఏలుబడిలో, సుప్రీంకోర్టు చొరవతో దీపావళి టపాసులపై వచ్చిన పూర్తిస్థాయి నిషేధాన్ని డబుల్ ఇంజన్ సర్కార్ తన రాజకీయప్రయోజనాలకోసం వమ్ముచేసింది. గ్రీన్‌క్రాకర్స్, అవీ కొద్దిగంటలు కాల్చడానికి మాత్రమే సుప్రీంకోర్టు అనుమతించినా, నియంత్రణలేమీ లేక ఢిల్లీ కాలుష్యమయమైపోయింది. ప్రధాని వెనుక ఎయిర్‌ప్యూరిఫైర్‌లు అమర్చివున్న చిత్రాలు అప్పట్లో మాధ్యమాల్లో చక్కెర్లు కొట్టాయి. ఆమ్‌ఆద్మీపార్టీ అధికారంలో ఉన్నంతకాలం కాలుష్యాన్ని సైతం రాజకీయంగా వాడుకున్న బీజేపీ నుంచి ఢిల్లీ ప్రజలు శాశ్వత పరిష్కారాలు ఆశిస్తున్నారు. ఢిల్లీలోనే కాదు, ఇరుగుపొరుగు రాష్ట్రాల్లోనూ అదే పార్టీ అధికారంలో ఉన్నందున, నేరం నాది కాదంటూ వేరొకరి మీదకు నెట్టేయడం కష్టం. ప్రపంచంలో అత్యంత కాలుష్యమయమైన రాజధానికి కాస్తంత ఆక్సిజన్ అందించడం పాలకుల విధి.

రేపటి భారత్‌కు ఒక భావయోధుని బాట

ఇరవయో శతాబ్ది నవంబర్ 19, 2025న ముగిసింది. సోషలిస్టు భావజాలానికి చిరిగిపోయిన జెండా చిహ్నం లాంటి సచ్చిదానంద్ సిన్హా ఆ రోజున కన్నుమూశారు. ఆయన మరణం ఇరవయో శతాబ్దికి ముగింపు అని నేను సునిశ్చితంగా విశ్వసిస్తున్నాను. అవును, ఒక శకం ముగిసింది. పట్టభద్రుడు కూడా కాని సచ్చిదా జీ మేధా దిగ్గజంగా ప్రభవించారు. మానవుడు నిర్మించిన, నిర్మిస్తోన్న సమస్త చరిత్రను సాధికారంగా వివరించగల వివేకశీలి, అంతఃప్రేరణతో ఒక సమున్నత లక్ష్య సాధనకు అంకితమైన ఆలోచనాశీలి సచ్చిదా జీ. తాను విశ్వసించిన భావజాలానికి విశేష గౌరవాన్ని సమకూర్చి, ప్రజామోదాన్ని సాధించిన సోషలిస్టు ఆలోచనా యోధుడు సచ్చిదానంద్ సిన్హా. ఆయన నిష్క్రమణతో సోషలిస్టు భావజాల సంప్రదాయం కాలంలోకి జారిపోయింది. నాకు తెలిసిన సోషలిస్టు భావజాల ప్రాభవం అంతరించింది.




■ యోగేంద్ర యాదవ్

సచ్చిదానంద్ సిన్హా లాంటి ఆలోచనా యోధుడి మరణాన్ని మేధా ప్రపంచం పట్టించుకోకపోవడం ఈ కాలం లక్షణమేమో?! విద్యా ప్రపంచంలో ఇప్పుడు ప్రభావశీలురుగా ఉన్నవారెవరూ బహుశా, సచ్చిదా జీ గురించి విని ఉండకపోవచ్చు. ఇక మీడియా ప్రతినిధులు కూడా అందుకు భిన్నమైనవారు కాదు. పట్నా నుంచి వెలువడే హిందీ దినపత్రిక 'ప్రభాత్ ఖబర్', న్యూఢిల్లీ నుంచి వెలువడే 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో మాత్రమే ఆయన మరణ వార్త వచ్చింది. సమాజం బాగు కోసం శ్రమించిన కొంతమంది ఆలోచనాపరులను విస్మృతులను చేసిన కారణాలు సచ్చిదా జీ విషయంలో వర్తించవు. చాలా మంది క్రియాశీలురు అయిన ఆలోచనాపరుల వలే కాకుండా సచ్చిదా జీ విస్తృతంగా రచనా వ్యాసంగం చేశారు. ఆరు దశాబ్దాల ప్రజా జీవితంలో ఆయన రెండు డజన్లకు పైగా పుస్తకాలు, వందలాది వ్యాసాలు రాశారు. చాలా మంది సోషలిస్టుల వలే సచ్చిదా జీ కూడా ఆంగ్ల భాషను వ్యతిరేకించలేదు. తన రచనా వ్యాసంగం తొలి కాలంలో చాలా పుస్తకాలు, వ్యాసాలు ఇంగ్లీష్‌లోనే రాశారు. 'సోషలిజం అండ్ పవర్', 'ది ఇంటర్నల్ కాలనీ', 'ది బిటర్ హార్వెస్ట్', 'ది క్యాస్ట్ సిస్టమ్' 'కేయాస్ అండ్ క్రియేషన్' మొదలైన ఆయన ఆంగ్ల రచనలు భారతీయ సోషలిస్టు భావ జగత్తులో సుప్రసిద్ధమైనవి. ఆయన ప్రతి పుస్తకమూ సంబంధిత అంశాన్ని లోతుగా పరిశోధించి, స్థిరపడిన నమ్మకాలను నిశితంగా ప్రశ్నించింది. కొత్త ఆలోచనలను ప్రేరేపించింది. ఎనిమిది సంపుటాల 'సచ్చిదానంద్ సిన్హా రచనావళి' పేరిట ఆయన రచనలు ఇప్పుడు మనకు అందుబాటులో ఉన్నాయి. ఆయన మౌలిక చింతకుడు. అసంపూర్ణంగా మిగిలిపోయిన మార్క్స్ 'పెట్టుబడి' గ్రంథం నాల్గవ భాగం గురించి 1950ల్లోనే సచ్చిదా జీ చాలా నిశితంగా, విపులంగా రాశారు. సమాజ భావి పునర్నిర్మాణానికి ఒక ప్రణాళికను ఆయన వెలయించారు. సౌందర్య శాస్త్రంలో కొత్త భావాలను ప్రతిపాదించారు. ఆయన వలే విస్తృతంగా వివిధ అంశాలపై రాసిన వ్యక్తి మరెవరైనా విద్యా ప్రపంచంలో ప్రముఖుడుగా వెలుగొందేవారు. అయితే సచ్చిదా జీకి అటువంటి ప్రఖ్యాతి లభించలేదు.

ఆ అనామకత్వానికి పాక్షిక కారణం ఆయన అసాధారణ జీవనయానమే. బిహార్‌లో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబంలో సచ్చిదా జీ జన్మించారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో ఆయన రాజకీయ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొన్నారు. ఆ క్రియాశీలత ఆయన్ను సోషలిస్టు ఉద్యమంలోకి తీసుకువెళ్లింది. ఫలితంగా ఆయన తన కళాశాల విద్యాభ్యాసానికి స్వస్తి చెప్పవలసి వచ్చింది. బీఎస్సీ మొదటి సంవత్సరంలోనే ఆయన తన చదువును నిలిపివేశారు. ఇప్పుడు జార్ఖండ్ రాష్ట్రంగా ఉన్న ప్రాంతాలలోని గని కార్మికుల మధ్య పనిచేయాలని సోషలిస్టు పార్టీ సచ్చిదా జీని ఆదేశించింది. అక్కడ ఆయన కార్యదక్షతను గమనించిన పార్టీ నాయకత్వం ముంబైలో రైల్వే, ఓడరేవు కార్మికులను సంఘటితం చేసే బాధ్యతను అప్పగించింది (బిహార్ రాష్ట్ర ప్రభుత్వంలో సొంత తాతయ్య మంత్రిగా ఉండగా సచ్చిదానంద్ సిన్హా ముంబైలో రైల్వే కార్మికుడుగా ఉన్నారు). ప్రథమ సార్వత్రిక ఎన్నికల (1952)లో ముంబైలో డాక్టర్ అంబేడ్కర్ తరఫున ఎన్నికల ప్రచారంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. ముంబైలో ఆయన రాజకీయ విద్యాభ్యాసం పరిపూర్ణమయింది. పార్టీ కార్యాలయంలోని గ్రంథాలయాన్ని అందుకు ఆయన పూర్తిగా వినియోగించుకున్నారు. సాయంకాలం అధ్యయన శిబిరాలలో పాల్గొనేవారు. ఫ్రెంచ్, జర్మన్ భాషలను కూడా నేర్చుకున్నారు. సచ్చిదా జీ తొలి వ్యాసాలలోని మేధా నైశిత్యాన్ని గమనించిన రామ్‌మనోహర్ లోహియా తన మ్యాగజైన్ 'మ్యాన్ కైండ్' సంపాదక వర్గంలో చేరాలని సచ్చిదా జీని ఆహ్వానించారు.

మేధావి అయిన సచ్చిదా జీ రాజకీయ కార్యకర్తగానే ఉండిపోయారు. పార్టీ పదవులకు సైతం ఆరాటపడలేదు. భావాలనే తన రాజకీయాలకు ప్రధాన అలంబనగా చేసుకున్నారు. ఢిల్లీలో రెండు దశాబ్దాలు గడిపిన అనంతరం స్వస్థలమైన ముజాఫర్‌నగర్ జిల్లాలోని మనికా గ్రామానికి తిరిగివచ్చి తన జీవితంలో చివరి నాలుగు దశాబ్దాలు అక్కడే ఉండిపోయారు. పదవులు, అవార్డులు, ఫెలోషిప్‌లకు ఆయన ఆరాటపడలేదు. చాలా కొద్ది మంది సోషలిస్టు కార్యకర్తలు, హిందీ రచయితలకు మినహా సచ్చిదాజీ మేధా ప్రపంచానికి బయటి మనిషిగానే ఉండిపోయారు. విశ్వవిద్యాలయాలలో కమ్యూనిస్టులకు ఉన్నట్టుగా సోషలిస్టులకు పలుకుబడి లేదు ఈ కారణంగానే ఆయన మేధా కృషి గుర్తింపునకు నోచుకోలేకపోయింది. తనకు రావలసిన పేరు ప్రఖ్యాతులు రానందుకు సచ్చిదా జీకి ఎటువంటి పట్టింపూ లేదు. అయితే ఆలోచనల ప్రపంచానికి ఆయన భావాల ఉపయుక్తత అపారంగా ఉన్నది. ఈ సత్యాన్ని గుర్తించడమే సచ్చిదా జీకి సముచిత నివాళి అవుతుంది.



సామాజిక ఒంటరితనం (భావసారూప్యత ఉన్న వ్యక్తుల నుంచి కూడా వేరుగా ఉండవలసిరావడం) కంటే కూడా మేధోపరమైన ఒంటరితనమే (ఆలోచనాశీలుర ప్రపంచపు ఆచారాలు, ఆనవాయితీలు అనుసరించేందుకు అచంచలమైన విముఖత చూపడంతో ఎదురైన ప్రతికూలతలు) సచ్చిదా జీ ఉపేక్షితుడై విస్మృతుడు అయ్యేందుకు దారితీసింది. నిర్దిష్ట, ప్రత్యేక ఆసక్తులు, నైపుణ్యాల ఆధారిత విద్యా ప్రపంచ క్రమశిక్షణ సరిహద్దులకు కట్టుబడి ఉండేందుకు ఆయన నిరాకరించారు. మానవీయ, సామాజిక శాస్త్రాలలోనే కాదు, భాషా సాహిత్యాలు, లలిత కళలలో కూడా ఆయనకు అపారమైన ఆసక్తి ఉన్నది. పలు విషయాలను ప్రగాఢంగా అధ్యయనం చేశారు. రాజకీయ ప్రాథమ్యాల ప్రాతిపదికన వివిధ విషయాలను లోతుగా పరిశోధించారు. ఆయన మేధో కృషి పుస్తకాలు, వ్యాసాల రచనకే పరిమితం కాదు. రాజకీయ కార్యకర్తల శిక్షణకు కరపత్రాలు, చిన్న పుస్తకాలు రాశారు. పార్టీ దైనందిన కార్యకలాపాలకు సంబంధించిన పత్రికా ప్రకటనలు కూడా ఆయనే రాసేవారు. బాలల కోసం పాటలు కూడా రాసిన సాహిత్యకుడు సచ్చిదానంద్ సిన్హా. ఆయన రచనలు సమగ్రమైన అవగాహనతో ఉంటాయి. నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించే అంతఃప్రేరణతో ఉంటాయి. ఆయన వచనం సరళంగా, సుబోధకంగా ఉంటుంది. ప్రత్యేక పరిభాష, ఊత పదాలను ఆయన ఉపయోగించరు. సందేశం సూటిగా, స్పష్టంగా ఉంటుంది. రాజకీయ కార్యకర్తలు, వివేచనాశీలురు అయిన పౌరులే సచ్చిదాజీ రచనల ప్రధాన పాఠకులు. ఆలోచన–ఆచరణ మధ్య వారధి నిర్మించేందుకు ఆయన రచనలు స్ఫూర్తినిస్తాయి.

సచ్చిదా జీ తన సొంత మేధా అజెండాను నిర్దేశించుకుని దానికి నిబద్ధమయ్యారు. అయితేనేం తన సమకాలికులను అమితంగా ప్రభావితం చేసిన మేధా చర్చల ప్రధాన అంశాలను ఆయన ముందుగానే సూచించారు. 'అంతర్గత వలసవాదం' (ఇంటర్నల్ కలోనియలిజం)పై ఆయన సిద్ధాంతం 1960లలో లాటిన్ అమెరికాలో ప్రభవించిన 'పరాధీన' (డిపెండెన్సీ) ఆలోచనా విధానాన్ని (సంపన్న, పేద దేశాల మధ్య అంతరాన్ని తగ్గించడంలో రెండవ ప్రపంచ యుద్ధానంతరం అనుసరించిన అభివృద్ధి నమూనాల వైఫల్యానికి ప్రతిస్పందనగా ఇది మొదలయింది) ప్రతిపాదించింది. 1990ల్లో సంకీర్ణ ప్రభుత్వాలు అధికారానికి రాకపూర్వమే అధికార పీఠాల స్వరూపంగా రాజకీయ పార్టీల సంకీర్ణాలను ఆయన సమర్థించారు. కులం, రిజర్వేషన్లు విద్యా జగత్తులో అధ్యయన, పరిశోధనాంశాలుగా ప్రాధాన్యం పొందకముందే సచ్చిదా జీ ఆ విషయాలపై తన దృష్టిని కేంద్రీకరించారు. అభివృద్ధికి పరిమితులు ఉన్నాయని, పర్యావరణ విధ్వంసానికి అది దారితీస్తుందనే సత్యాలను ప్రపంచం గ్రహించకముందే ఆయన వాటి గురించి విస్పష్టంగా మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాహిత మేధావులు ప్రభావశీలంగా చర్చిస్తున్న వివిధ అశాలపై తాను ప్రతిస్పందించవలసిన అవసరముందని ఆయన భావించలేదు. వర్తమాన భారతదేశానికి అవసరమైన వినూత్న రాజకీయ చింతనాపరులకు సచ్చిదా జీ నిస్సందేహంగా ఒక ఆదర్శప్రాయుడు.

'సాదా జీవన్, ఉచ్చ విచార్' (నిరాడంబర జీవనం, ఉన్నత ఆలోచనలు) అన్న నీతివాక్యం గురించి పాఠశాల విద్యాభ్యాసంలో మేము నేర్చుకున్నాము. ఆ సమున్నత ఆదర్శానికి ప్రతినిధులుగా జీవించిన సచ్చిదానంద్ సిన్హా జీ, కిషన్ పట్నాయక్ జీ, అశోక్ శెక్సారియా జీ లను కలుసుకోవడం నా జీవిత మహద్భాగ్యంగా భావిస్తున్నాను. సచ్చిదా జీ ఒక సాధువుగా జీవించారు. భౌతిక సౌఖ్యాల పట్ల పూర్తి ఉదాసీనత చూపారు. రాజకీయ అధికారాన్ని కోరుకోలేదు. ప్రజాదరణ పొందాలనే దృష్టి లేదు. గుర్తింపు కోసం ప్రాకులాడలేదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఒక సమున్నత ఆశయ సాధనకు కట్టుబడి తనను తాను పట్టించుకోని నిస్వార్థజీవి సచ్చిదా జీ. తనను తాను ప్రముఖుడుగా భావించుకోని మహోన్నతుడు ఆయన. తన ఆలోచనలను వ్యతిరేకిస్తున్న వారి భావాలనూ ఆయన గౌరవించారు. రాజకీయ నిబద్ధతలపై రాజీపడలేదు. మేధా చిత్తశుద్ధిని వీడలేదు. వర్తమాన భారతదేశంలో రాజకీయ వివేచనా శూన్యతను తొలగించి, సమ్మిళిత, వినూత్న ఆలోచనలను పెంపొందించదలుచుకున్నవారు తొలుత సచ్చిదానంద్ సిన్హా రచనలను అధ్యయనం చేయాలి.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

> రాజకీయ నిబద్ధతలపై రాజీపడని సోషలిస్టు భావజాల దిగ్గజం సచ్చిదానంద్ సిన్హా. (1928–2025). వర్తమాన భారతదేశంలో రాజకీయ వివేచనా శూన్యతను తొలగించి, సమ్మిళిత, వినూత్న ఆలోచనలను పెంపొందించదలుచుకున్నవారు ఆయన రచనలను అధ్యయనం చేయాలి.



దుబాయి ఏయిర్ షోలో తేజస్ విమానం విఫలమై
భారత ఏయిర్‌ఫోర్స్ పైలట్ మరణించిన ఘటనపై
తన దేశంలో కొందరు చేస్తున్న వ్యాఖ్యలను తప్పుబడుతూ,
పాకిస్థాన్ వైమానికదళ అధికారి అర్పించిన నివాళి ఇది.

ఆకాశయోధులకు వెక్కిరింతల నివాళా!

ఇండియన్ ఏయిర్‌ఫోర్స్‌కు చెందిన తేజస్ యుద్ధవిమానం దుబాయి ఏయిర్ షోలో కుప్పకూలటం పత్రికల పతాక శీర్షికలకు అతీతమైన విషాదం. విమానాలు ఆవిరిజాడలతో ఆకాశంలో రాసే కవిత్వం ఈ వైమానిక విన్యాసాలు. ఈ విన్యాసాల్లో నైపుణ్యమే ప్రార్థన, ధైర్యమే నివేదన. ఇవి కెమెరాల కోసం జరిగే ప్రదర్శనలు కావు; మానవ కౌశలానికి అత్యున్నత తార్కాణాలు. ఈ వీరులు భూమ్యాకర్షణశక్తికీ తమ అదృష్టానికీ మధ్య ఒక ప్రమాదకరమైన అంగీకారంతో విమానాలు నడుపుతారు. తమ దేశ జెండా తరఫున ప్రాణాలు ఒడ్డేందుకు సిద్ధపడతారు.

భారత వైమానికదళానికీ, సముద్రమంత విషాదంలో తల్లడిల్లుతున్న ఆ కుటుంబానికీ నేను నా సంతాపాన్ని తెలియజేస్తున్నాను. ఈ బాధ ఎలాంటిదో రెక్కల మీద ఎగిరే తోటి యోధులకే పూర్తిగా అర్థమవుతుంది. ఇక్కడ నేలకొరిగింది ఒక పైలట్ కాదు. ఊహకందని ఎత్తుల్లో పహారా కాసే ఆకాశ సంరక్షకుడు. ఈ రాత్రి ఎక్కడో ఒక యూనిఫామ్ ఖాళీగా వేలాడుతుంది. ఎవరో ఒక పిల్లాడు 'నాన్న ఎప్పుడు వస్తాడు?' అని అడుగుతాడు. మొత్తం ఆకాశమే మరింత ఖాళీ అయినట్టు కనిపిస్తుంది.

ఈ దుర్ఘటనకు మించి, ఈ విషాదానికి మించి, నన్ను బాధపెడుతున్నది సరిహద్దుకు ఇటువైపు మా దేశం నుంచి పొంగుతున్న వెక్కిరింతల విషం. దేశ సరిహద్దు అయినా సరే, గగన వీరుల సహోదరత్వాన్ని విడదీయకూడదు. ఇలాంటి ప్రవర్తన దివాలాకోరుతనమే తప్ప దేశభక్తి అనిపించుకోదు. మనం అవతలివారి సిద్ధాంతాలనూ, వ్యూహాలనూ, విధానాలనూ ఎంతయినా ప్రశ్నించవచ్చు, తప్పు లేదు. కానీ, మర్యాదకు విలువ ఉండే ప్రపంచంలో బతికే ఎవ్వరూ కూడా, ఆకాశపుటంచుల్లో విధులు నిర్వహించే యోధుడి సాహసాన్ని వెక్కిరించకూడదు. ఆ యోధుడు చప్పట్ల కోసం కాదు, దేశంపై ప్రేమతో ఎగిరాడు, మన దేశ యోధుల్లాగానే. అందుకు మనం ఇవ్వాల్సింది మర్యాద. కుళ్లిపోయిన దేశాభిమానాన్ని ముసుగు వేసుకుని వెక్కిరించటం కాదు.

> గగనతలంలో యుద్ధవిమానం హఠాత్తుగా నిశ్శబ్దంలోకి జారుకున్నప్పుడు– ఇక అక్కడ దేశ పౌరసత్వాలు లేవు, జాతీయ గీతాలు లేవు, జెండాలు లేవు. అక్కడ మిగిలేదల్లా అందరికీ సమానమైన విషాదమే! మేఘాల్లో కలిసిపోయిన వారి ఫొటోలను తడిమి రోదించే కుటుంబాలే!

ఇలాంటి విషాద నీరవంలోకే మన యోధులెందరో మాయమవటాన్ని నేను చూశాను. ఫ్లైట్ లెఫ్టినెంట్ ఆలందార్, స్క్వాడ్రన్ లీడర్ హసంత్ ఇలాంటివారే. వీరంతా దేవతలు ఊపిరిబిగబట్టి చూసేంత ఎత్తుల్లో విహరించారు. ఆకాశం ఎంతో తెగింపును కోరుతుందనీ, బదులుగా ఎలాంటి భద్రతనూ హామీ ఇవ్వదనీ వారు అర్థం చేసుకున్నారు.

గగనతలంలో యుద్ధవిమానం హఠాత్తుగా నిశ్శబ్దంలోకి జారుకున్నప్పుడు– ఇక అక్కడ దేశ పౌరసత్వాలు లేవు, జాతీయ గీతాలు లేవు, జెండాలు లేవు. అక్కడ మిగిలేదల్లా అందరికీ సమానమైన విషాదమే! మేఘాల్లో కలిసిపోయిన వారి ఫొటోలను తడిమి రోదించే కుటుంబాలే!

నిజమైన ప్రొఫెషనల్, తోటి ప్రొఫెషనల్‌ను ఎన్ని అడ్డుగోడల అవతలనుంచైనా గుర్తుపడతాడు. నిజమైన యోధుడు తోటి యోధుడి ధైర్యానికి– అది వేరే రంగు యూనిఫామ్ తొడుక్కున్నా, వేరే రంగు జెండా కింద ఎగిరినా, వేరే భాష మాట్లాడినా– సెల్యూట్ కొడతాడు.

అంతకంటే ఏ మాత్రం తక్కువ స్థాయిలో వ్యవహరించినా అది వారికి కాదు, మనకే అప్రతిష్ఠ. మన వెక్కిరింత మన రెక్కలకే మరకలాగా అంటుకుంటుంది, నేలకొరిగిన మన యోధుల గౌరవాన్నే మంటగలుపుతుంది, మన వీరాలాపాలనే డొల్లచప్పుళ్లుగా మారుస్తుంది.

ధైర్యానికి పాస్‌పోర్టులు ఉండవు. బలిదానానికి సరిహద్దు విభజనలు తెలియవు. దేశ ప్రతిష్ఠ కోసం తన యుద్ధ విమానాన్ని గగనతల అవధుల్లోకి దూకించే పైలట్ మన మర్యాదకు పాత్రుడు– అతను కాషాయ, తెలుపు, పచ్చ జెండా తరఫున ఎగిరినా; లేక పచ్చ, తెలుపుజెండా తరఫున ఎగిరినా!

నిష్క్రమించిన ఆ వైమానిక యోధుడు ఇక విమానాలు విఫలం కాని, ఏ కల్లోలాలూ లేని ఆకాశాలకు చేరుకోవాలని ఆశిస్తున్నాను. అతని కుటుంబం తమ వియోగాన్ని మానవుని సాహసికాంశకు ఉత్కృష్ట తార్కాణంగా అర్థం చేసుకుంటారనీ భావిస్తున్నాను.

ఇక మనం– రక్తంతో గీసిన సరిహద్దులకు ఇరువైపులా ఉన్న మనం– మర్యాద ఇవ్వాల్సిన దానికి మర్యాద ఇచ్చే పెద్దరికాన్నీ, బాధపడాల్సిన వాటికి బాధపడే పరిణతినీ సాధిస్తామని తలుస్తాను. వేర్వేరు దేశాలకు పౌరులుగా మారే కంటే ముందే మనమంతా ఆకాశదేశానికి పౌరులం. ఏదో రోజు నశించిపోయే మనమంతా, శాశ్వతమైనది ఏదో అందుకునే ప్రయత్నంలో పైకి ఎగిరేవాళ్లమే, భూమ్యాకర్షణ వెనక్కు లాక్కునేలోగా.

ఆకాశం సరిహద్దులకు అతీతంగా దుఃఖిస్తుంది!
మనమూ అదే మర్యాదను పాటిద్దాం!

● ఏయిర్ కమొడోర్ పెర్వెజ్ అక్తర్‌ఖాన్

అమరావతిలో భవనాలపై తెలుగు అక్షరాలుండాలి

అమరావతి నగరంలో శరవేగంగా నిర్మాణాలు జరగడం ఆనందకరం. సీఆర్‌డీఏ భవనం మీద ఆంగ్ల అక్షరం 'ఏ'ను నిలబెట్టారు. శిలాఫలకాలూ ఆంగ్లంలోనే ఉంటున్నాయి. ఇది తెలుగుదేశం. తెలుగువారి రాజధాని. ఇక్కడ నిర్మించబోయే ప్రభుత్వ, ప్రైవేటు భవనాల మీద తెలుగు అక్షరాల నామ ఫలకాలు ఉండాలి. తెలుగు లేకుండా కేవలం ఆంగ్ల అక్షరాలు మాత్రమే కొలువుదీరితే... భూములు ఇచ్చిన రైతులకే కాదు, ప్రతి ఆంధ్రుడికీ 'ఇది మన రాజధాని' అనే భావన, తృప్తి కలుగదు. మన పొరుగు రాష్ట్రాలవారు తమ మాతృ భాషకే ప్రాధాన్యం ఇస్తున్నారు. అన్ని కార్యాలయాల మీద వారి భాషనే ఉపయోగిస్తున్నారు. అమరావతిలోని ప్రతి కార్యాలయ నామఫలకం తెలుగులో ఉండాలి. అప్పుడే తెలుగుదేశం పేరు సార్థకం అవుతుంది.

– సరస్వతుల రామ నరసింహం(సరసి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

సంక్షేమ సాధనలో నిశ్శబ్ద కృషీవలుడు

> దేశాభిమానం, సేవానురక్తితో అమెరికా నుంచి తిరిగి వచ్చిన ఒక అణుశాస్త్రవేత్త ఉత్తరాంధ్ర కుగ్రామాలలో విద్యా చైతన్యాన్ని పురిగొల్పారు. గ్రామీణుల ఆర్థిక జీవనంలో కొత్త వెలుగులు సాధించారు. పేదలకు గృహనిర్మాణాలు సాధ్యం చేశారు. కబ్జా అయిన భూముల్ని పేదలకు తిరిగి వచ్చేలా చేశారు. ఈ అపూర్వ నిష్కామకర్మ చేసిన ఉదాత్తుడే డా. పెమ్మరాజు దుర్గా కామేశ్వరరావు.

అణుభౌతిక శాస్త్రంలో డాక్టరేట్ చేసిన ఒక శాస్త్రవేత్త... అమెరికాలోని బోస్టన్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు... అన్నీ వదిలేసి అప్పటి శ్రీకాకుళం జిల్లా, ఇప్పటి విజయనగరం జిల్లా చీపురుపల్లికి వచ్చి, ప్రజల కోసం జీవితమంతా పనిచేశారు. ఆయన ఎటువంటి అవార్డులు, గుర్తింపు ఆశించకుండా నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుంటూ పోయారు. ఆయనే డా. పెమ్మరాజు దుర్గా కామేశ్వరరావు. తెలిసిన వారందరూ పీడీకే రావు అంటారు.

1940 డిసెంబర్ 29న వెంకాయమ్మ, వెంకట సత్యనారాయణలకు జన్మించారు కామేశ్వరరావు. వీరి స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట దగ్గర ఉన్న వల్లూరు. కామేశ్వరరావుకు పాఠశాల స్థాయిలోనే భౌతికశాస్త్రం పట్ల అమితమైన ఆకర్షణ. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ చేసిన తర్వాత, అణు భౌతికశాస్త్రంలో పరిశోధన చేయడానికి 1965లో అమెరికా వెళ్లారు. డాక్టరేట్ పొందిన తర్వాత బోస్టన్ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా చేరారు.

అదే సమయంలో అమెరికాలో నల్లజాతీయులు హక్కుల కోసం, వివక్ష నుంచి విముక్తి కోసం పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తున్నారు. దీనిపట్ల ఆకర్షితుడైన కామేశ్వరరావు, 'ఇండియన్ ఫర్ డెమోక్రసీ' పేరుతో భారతీయులు చేస్తున్న నల్లజాతీయుల సంఘీభావ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. దాంతో ఆయనకు పౌరుల హక్కుల పట్ల, పాలకవర్గాల స్వభావాల పట్ల సంపూర్ణమైన అవగాహన కలిగింది. విశ్వవిద్యాలయంలో అణు భౌతికశాస్త్ర పాఠాలు చెబుతున్నప్పటికీ, ఆయనలో ఒక అలజడి ప్రారంభమైంది. 'నా దేశం కోసం నేనేమి చేయగలను?' అనే ఆలోచన ఆయన మనసును తొలచసాగింది. దానితో తాను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి భారత్‌కు తిరిగి వచ్చారు. అప్పుడు ఇక్కడ ఎమర్జెన్సీ నడుస్తోంది.

జయప్రకాశ్ నారాయణ్, వినోబాభావేలను కలిసి కామేశ్వరరావు తన కార్యాచరణను రూపొందించుకున్నారు. అప్పటి ఐఏఎస్ అధికారి మోహన్ కందా మార్గదర్శకత్వంలో, చీపురుపల్లి దగ్గర ఉన్న అప్పన్నవలస గ్రామాన్ని తన కార్యక్షేత్రంగా ఎంచుకున్నారు. దళితులు, పేదవారు, నిరక్షరాస్యులు ఎక్కువగా ఉన్న ఆ గ్రామంలో దోపిడీకి గురవుతున్న వారికి తన ఆపన్న హస్తం అందించారు.

సమాజంలోని సకల రోగాలకు కారణం నిరక్షరాస్యత అని, దానిని రూపుమాపితే తప్ప అభివృద్ధి సాధించలేమనే ఉద్దేశంతో నిరక్షరాస్యత మీద తన తొలి బాణాన్ని ఎక్కుపెట్టారు కామేశ్వరరావు. 1979 జూలై 1న అప్పన్నవలసలో ప్రారంభమైన రాత్రిబడి తరువాతి కాలంలో కాపుశంభాం, గరివిడి, మెరకముడిదం, పొందూరు మండలాలలోని అనేక గ్రామాలకు విస్తరించింది. రాత్రి బడులలో అక్షరాస్యతతో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న అనేక పథకాల పట్ల అవగాహన కల్పించారాయన. యువజన సంఘాలు ఏర్పాటు చేయించారు. వీటివల్ల ప్రజలలో చైతన్యం పెరిగి దుర్మార్గాలను, అక్రమాలను ఎదిరించే స్థాయికి ఎదిగారు. గ్రామీణులకు దాచుకోవడం తెలియదు. కష్టపడి సంపాదించిన ప్రతి రూపాయి ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియదు. అందువల్ల ఎప్పుడూ అప్పుల ఊబిలో కూరుకుపోయేవారు. దీని నుంచి బయటపడాలంటే పొదుపే మార్గమని భావించిన కామేశ్వరరావు, అప్పన్నవలసలో పొదుపు సంఘాలకు శ్రీకారం చుట్టారు. కూలి పనులకు వెళుతున్న మహిళలను సంఘాలుగా ఏర్పరిచి నిధిని ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించారు. 1984 నాటికి 200 పొదుపు సంఘాలు ఆ ప్రాంతంలో ఏర్పాటయ్యాయి. ఆయన ఇచ్చిన స్ఫూర్తి నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిపుచ్చుకొని, డ్వాక్రా లాంటి అనేక సంఘాల ఏర్పాటుకు పూనుకున్నాయి.


అక్షర చైతన్యంలోను, పొదుపు సంఘంలోను విజయం సాధించిన కామేశ్వరరావు క్రమంగా పేదలకు సొంత ఇంటి వైపు దృష్టి సారించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను కాంట్రాక్టర్లు నాసిరకంగా నిర్మించేవారు. అందువల్ల అవి నివాస యోగ్యంగా ఉండేవి కావు. ఆ గృహాలను తామే తమ సంఘాల ద్వారా నిర్మించుకుంటామని, అందుకు అవసరమైన ముందస్తు పెట్టుబడిని పొదుపు సంఘాల ద్వారా సమకూర్చుకుంటామని ప్రభుత్వ అధికారులను ఒప్పించారు కామేశ్వరరావు. అలా ప్రారంభమైన నిర్మాణాల నాణ్యత పటిష్ఠంగా ఉండేది. వాటికి ఆయన 'విజయ కాలనీ' అని పేరు పెట్టారు. అప్పన్నవలసలో మొదలైన ఈ కాలనీలు కాపుశంభం, కొండశంభం, బాగువలస, పెనుబర్తి, ఆకులపేట, దుమ్మెద, కోనూరు, వంగపల్లిపేట మొదలైన గ్రామాలకు విస్తరించాయి. ఇదే క్రమంలో అప్పటి కలెక్టర్ ఎస్.ఆర్ శంకరన్ సహాయ సహకారాలతో రిక్షా కార్మికులకు కూడా గృహ సముదాయాలు నిర్మింపజేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పేదలకు ప్రభుత్వం భూములు పంచిపెట్టింది. అయితే వాటిని భూస్వాములు లాగేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కామేశ్వరరావు, రైతులకు మద్దతుగా నాలుగేళ్ల పాటు పోరాటం చేశారు. మోహన్ కందా, శంకరన్ వంటి అధికారుల సహాయంతో భూమిని పోగొట్టుకున్న రైతుల వివరాలు తెలుసుకొని, వారికి భూమి తిరిగి వచ్చేలా చేశారు. అనంతర కాలంలో పిల్లలకు విద్య పట్ల దృష్టి పెట్టారు కామేశ్వరరావు. ఇందుకోసం బాలబడి పేరుతో పాఠశాలలు నెలకొల్పారు. ప్రభుత్వ పాఠశాలలు ఉన్నా, అవి విద్యార్థులను ఆకర్షించడంలో విఫలమయ్యాయి. 'చదువు అంటే శిక్ష' అనే ధోరణిని రూపుమాపి, పిల్లలు ఇష్టంగా చదువుకునే విధంగా దేశదేశాల విద్యా విధానాలను పరిశీలించి, ఒక కొత్త విధానాన్ని బాలబడిలో అమలుచేశారు. ప్రభుత్వం ఈ విధానాన్ని అంగన్‌వాడీ పాఠశాలల్లో అమలు చేసేలా చర్యలు తీసుకుందంటే ఇది పిల్లలకు ఎంత ఉపయోగకరమో తెలుస్తోంది. తన జీవితాన్నే పణంగా పెట్టి, ఇంత కృషిచేసిన ఈ మహనీయుడు నిశ్శబ్ద కృషీవలుడు.



భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా 'తెనాలి ప్రచురణలు' సంస్థ 'భారత జ్యోతి' పురస్కారంతో డాక్టర్ పీడీకే రావును నేడు సత్కరించనున్నది. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రం, తెనాలిలో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సభలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, న్యాయవాది కె.ఇంద్రనీల్ బాబు, వోలేటి పార్వతీశం, నల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొంటారు.

■ బండ్ల మాధవరావు





మంచు కురిసే వేళలో..

చలిపులి పంజా విసురుతోంది. బారెడు పొద్దెక్కినా పొగమంచు తొలగిపోనంటోంది. మంచు పరదాల్లో నగర అందాలు కనువిందు చేస్తుండగా, కొండపల్లి కొత్తందాలతో హొయలొలుకుతోంది. అభయారణ్యంతో పాటు ఖిల్లా ఘాట్‌రోడ్డు, కోట లోపల అందాలు, ట్రెక్కింగ్ ప్రదేశాలు కనువిందు చేస్తున్నాయి. ఈ అందాల్లో యూ ట్యూబర్స్ రీల్స్ చేస్తూ సందడి చేస్తుండగా, జలపాతాల వద్ద ఫొటో షూట్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి.- ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం



● ప్రకాశం బ్యారేజీ సోయగాలు



నమో కార్తికేయ

దుర్గగుడిలో ఘనంగా సుబ్రహ్మణ్య కల్యాణం

సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీక్షించారు.

సార్.. నిధులు మంజూరు చేయండి..!

● సీఎంను కలిసిన ఎంపీ చిన్ని, ఎమ్మెల్యేలు తాతయ్య, సౌమ్య

8



సివిల్ సప్లయిస్-డీఎం కార్యాలయంలో ఆయనో కాంట్రాక్టు ఉద్యోగి. ఆయన వ్యవహారమంతా 'నేనే రాజు.. నేనే మంత్రి' అన్నట్టుగా ఉంటుంది. లెక్కలు చూడాల్సిన ఆ కాంట్రాక్టు ఉద్యోగి ధాన్యం కొనుగోలు వ్యవహారాలు చూస్తాడు. పర్మినెంట్ ఉద్యోగులు, సీనియర్లు చాలామందే ఉన్నా.. అందరినీ కాదని ఆ కాంట్రాక్టు ఉద్యోగికే 'ప్రాధాన్యం' ఇస్తారు. సీనియర్ ఉద్యోగులు ప్రోత్సహిస్తారు. దీంతో ఆ ఉద్యోగి చక్కబెట్టే వ్యవహారాలపై అనేక ఆరోపణలు వస్తున్నాయి.

సివిల్ సప్లయిస్‌లో అవినీతి రాజు



డీఎం-సివిల్ సప్లయిస్‌లో కాంట్రాక్టు ఉద్యోగి హవా

- కార్యాలయంలో ఉద్యోగుల సపోర్టుతో వ్యవహారాలు
- ధాన్యం కొనుగోళ్ల నుంచి కస్టమ్ మిల్లింగ్ వరకు..
- రైస్‌మిల్లుల యాజమాన్యాలకు ఆత్మీయుడు
- ఎంపిక చేసిన మిల్లులకే నాణ్యమైన ధాన్యం రవాణా
- ప్రైవేట్ వ్యాపారులకు అండ.. రైతుల నెత్తిన బండ
- రైతు సేవా కేంద్రాలన్నీ ఆయన గుప్పెట్లోనే..
- ఎన్నో ఆరోపణలు ఉన్నా చర్యలు శూన్యం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ కార్యాలయంలో ఆ కాంట్రాక్టు ఉద్యోగిదే హవా. జిల్లా మేనేజర్‌గా ఎవరొచ్చినా క్షణాల్లో తన మాయలో పడేస్తాడు. అతని హవా నిలబెట్టడానికి ఆఫీసులో పనిచేసే కొందరు ఉద్యోగులు తెగ ఆరాట పడుతుంటారు. ప్రభుత్వ ఉద్యోగిగా తప్పులు చేసినప్పుడు దొరికిపోతే క్రమశిక్షణా చర్యలకు గురి కావాలి. అదే కాంట్రాక్టు ఉద్యోగికి అప్పగిస్తే నెపం అతనిపై పడుతుంది. కాంట్రాక్టు ఉద్యోగిని ఉద్యోగం నుంచి తొలగించ గలరు. అంతకుమించి చర్యలుండవని ఉద్యోగులే అతనికి సహకరిస్తున్నారు.

మిల్లుల్లో మాయ

ధాన్యం ఆడించటానికి ఏదైనా మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద గుర్తింపు ఇవ్వాలన్నా.. తీసేయాలన్నా ఆ కాంట్రాక్టు ఉద్యోగి ఇష్టమే. తనకు నచ్చిన వారిని కస్టమ్ మిల్లింగ్‌కు ఎంపిక చేస్తాడు. ఆయనకు నచ్చాలంటే.. మిల్లుల యాజమాన్యాలు కొన్ని అవసరాలు తీర్చాలి. లేకపోతే చుక్కలు చూపిస్తాడు. తనకు నచ్చిన మిల్లులకు క్వాలిటీ ధాన్యాన్ని తరలించే బాధ్యతలను కూడా ఆ కాంట్రాక్టు ఉద్యోగే తీసుకుంటాడు. దీనికోసం ఆయన జిల్లావ్యాప్తంగా రైతు సేవా కేంద్రాలను గుప్పెట్లో పెట్టుకున్నాడు. రైతు సేవా కేంద్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వాలన్నా సరే.. డీఎం సివిల్ సప్లయిస్ ఆఫీసు నుంచి ఆయనే ఇస్తుంటాడు. దీంతో రైతు సేవా కేంద్రాల సిబ్బంది అంతా ఆ కాంట్రాక్టు ఉద్యోగి చెప్పినట్టు నడుచుకుంటారు. ధాన్యం కొనుగోలు వ్యవహారాలను మిగతా 6లో..

రైళ్ల రాకపోకల్లో మార్పులు

8

వీడని చిక్కుముడి



నాడు వైసీపీ ప్రభుత్వం ఉమ్మడి కృష్ణాజిల్లాను ఎన్టీఆర్, కృష్ణాగా విభజించి పలు చిక్కుముడులు వేసింది. నేటి కూటమి ప్రభుత్వమైనా ఆ చిక్కుముడులను విప్పాలని ప్రజలు చాలారోజుల నుంచి కోరుకుంటున్నారు. కానీ, ఆ సమస్యలేమీ పట్టించుకోకుండా, జిల్లాలో మార్పులేమీ లేకుండా యథాతథంగా వదిలేయడంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.
- విజయవాడ, ఆంధ్రజ్యోతి

జిల్లాల మార్పుల్లో ఉమ్మడి కృష్ణా ఆశలపై నీళ్లు

గన్నవరం, పెనమలూరు, నూజివీడులో అసంతృప్తి

మార్పులు చేర్పుల్లో స్థానం కల్పించకపోవడంపై ఆగ్రహం

గ్రేటర్ విలీన గ్రామాలనూ దృష్టిలో పెట్టుకోలేదు..!

నూజివీడులో న్యాయవాదుల నిరసన



నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలంటూ నూజివీడు పట్టణంలో న్యాయవాదుల నిరసన

● నూజివీడులో నిరసనలు

నూజివీడును ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి కాకుండా ఏలూరు జిల్లాలోనే కొనసాగించడంపై నూజివీడు నియోజకవర్గ ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. బుధవారం పలువురు న్యాయవాదులు నిరసన చేపట్టారు. ఆ తర్వాత డాక్టర్లు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు వరుస క్రమంలో పోరాటానికి సిద్ధమవుతున్నారు. తమను ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని ఎప్పటినుంచో నూజివీడు ప్రజలు కోరుతున్నారు. చంద్రబాబు ఎన్నికల ప్రచారానికి వచ్చిన సందర్భంలో తమ మనసులో మాట చెప్పారు. అధికారంలోకి వచ్చాక తప్పకుండా న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఇటీవల క్యాబినెట్ సబ్ కమిటీని నియమించటంతో తమ కల ఫలిస్తుందని భావించారు. తాజాగా తాత్కాలికంగా ఈ అంశాన్ని పక్కన పెట్టడంతో అసంతృప్తి రాజుకుంది.

● పెనమలూరు కోసమేనా?

పెనమలూరు నియోజకవర్గం విజయవాడను ఆనుకుని ఉంటుంది. దీంతో తమ నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. కంకిపాడు, పెనమలూరు గ్రామాలు గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత జాబితాలో ఉన్నాయి. రాజకీయ నేతలు మాత్రం పెనమలూరును కృష్ణాలోనే ఉంచాలని పట్టుబడుతున్నారు. ఈ వ్యవహారంపై సీఎం చంద్రబాబు కూడా మంత్రుల సమావేశంలో అసహనం వ్యక్తం చేశారు. పెనమలూరు 'పంచాయితీ' కారణంగానే ఉమ్మడి కృష్ణాజిల్లా అంశాన్ని తాను చూసుకుంటానని, తనకు వదిలేయమని సీఎం పేర్కొన్నారు. దీంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో మార్పులు, చేర్పులు జరగలేదు.

● గన్నవరంలో పెల్లుబికిన అసంతృప్తి

గన్నవరం నియోజకవర్గ ప్రజలకు విజయవాడతో ఎక్కువ సంబంధాలు ఉంటాయి. విద్య, ఉపాధి, ఉద్యోగ తదితర లావాదేవీలు జరుగుతాయి. విజయవాడకు సమీపంలోని ప్రాంతం ఇది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం ఇక్కడే ఉంది. అయితే, ఈ నియోజకవర్గం కృష్ణాజిల్లాలో ఉండటం వల్ల సమస్యలు వస్తున్నాయి. గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత గ్రామాల జాబితాలో కూడా గన్నవరం మండలంలోని చాలా గ్రామాలు ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వం పంచాయతీల తీర్మానం కోరగా, అన్ని పంచాయతీలు విలీనానికి ఒప్పుకొన్నాయి. గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండలం ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లాలో ఉంది. మిగిలిన మిగతా 6లో..

పెనమలూరు ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతుంది



పెనమలూరు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి. పెనమలూరు ప్రజలు ఏ జిల్లా అధికారిని కలవాలన్నా మచిలీపట్నం వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల ఖర్చుతో పాటు కాలం కూడా వృథా అవుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో కలిస్తే ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతుంది.

- ప్రొఫెసర్ దూళిపాళ్ల వెంకట్రావు, సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ, కానూరు



దేశ సమైక్యతకు స్ఫూర్తి పటేల్

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- ఆర్టికల్ 360 రద్దుతో సంపూర్ణ భారతావని
- రైతుల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న కృష్ణామిల్క్ యూనియన్
- పాల ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్‌ది ప్రథమస్థానం

6

సేంద్రియ సాగుతో మేలు

- వాతావరణ ప్రతికూలతలను తట్టుకుంటున్న వరి
- బాపులపాడు మండలం వైకుంఠలక్ష్మీపురంలో నిరూపించిన రైతు

8

చెట్టూ.. దర్జాగా దోచేట్టు..

జలవనరుల శాఖలో చెట్లు మాయమవుతున్నాయి. కాల్వగట్లపై ఇరిగేషన్ స్థలాల్లో ఎదిగిన భారీచెట్లను నరుక్కుపోతున్నారు. విషయం తెలుసుకుని దొంగలు ఎవరో పట్టుకోండి.. అని ఫిర్యాదు చేసిన అధికారులకు మాత్రం షోకాజ్ నోటీసులు ఇస్తున్నారు. నెల రోజులుగా జరుగుతున్న ఈ పరిణామాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

జలవనరుల శాఖలో చెట్లు మాయం

- కాల్వగట్లపై ఎదిగిన వృక్షాల నరికివేత
- జొన్నపాడు పరిధిలో 22 సుబాబుల్ చెట్లు హాంఫట్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారికి షోకాజ్, బదిలీ



నరికేసిన చెట్ల మొదళ్లను పరిశీలిస్తున్న అధికారి →

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఉమ్మడి జిల్లాలో జలవనరుల శాఖకు వేలాది ఎకరాల్లో భూములున్నాయి. ఈ భూముల్లో ఉన్న చెట్ల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. చెట్టుపై కన్ను పడిన మర్నాడే మోడుగా మారిపోతోంది. ప్రకాశం బ్యారేజీ దిగువన నాలుగు కాల్వలు ఉన్నాయి. బందరు, ఏలూరు, రైవస్, బుడమేరు కాల్వలు దిగువకు వెళ్లే కొద్దీ వేర్వేరు ప్రదేశాల్లో కలుస్తాయి. ఒక్క ఏలూరు కాల్వ మాత్రమే నేరుగా ఏలూరు నగరంలోకి వెళ్తుంది. ఇందులో బుడమేరు స్పెషల్ డివిజన్ పరిధిలో ఉంటుంది. మిగిలిన కాల్వలన్నీ ఇరిగేషన్ పరిధిలోనే ఉంటాయి. దిగువకు వెళ్లే కొద్దీ ఈ కాల్వలకు అనుబంధంగా పిల్ల కాల్వలు, డ్రెయినేజీలు ఉంటాయి. సాగునీటి కాల్వలన్నీ ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోకి వస్తాయి. ఈ కాల్వలకు రెండు వైపులా గట్లపై నిద్ర గన్నేరు, సుబాబుల్ చెట్లు ఉన్నాయి. కొద్దినెలలుగా ఈ చెట్లు ఒక్కొక్కటిగా మాయమవుతున్నాయి. కనిపించిన చెట్టును నచ్చిన వాళ్లు నరుక్కుపోతున్నారు. ఈ విషయం తెలిసినా జలవనరుల శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఆయా గ్రామీణ ప్రాంత ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

నందివాడలో చెట్లు మాయం

నందివాడ మండలంలో నూతులపాడు గ్రామం పరిధిలో జొన్నపాడు కాల్వ ప్రవహిస్తోంది. దీనికి బ్రాంచ్ కెనాల్‌గా ఉన్న నూతులపాడు కాల్వగట్లపై కొన్నేళ్లుగా నిద్ర గన్నేరు, సుబాబుల్ చెట్లు పెరిగాయి. ఒక్కో చెట్టు 2.50 అడుగుల చుట్టుకొలత నుంచి మూడు అడుగుల చుట్టు కొలతల పరిమాణంలో ఎదిగాయి. సుబాబుల్ చెట్లను గ్రామంలో కొంతమంది వారి పెరట్లలో పెంచుకున్నారు. మిగతా 6లో..

గుండె సమస్య మోకీలుకు ఆపరేషన్

నకిలీ బిల్లులతో గుడివాడలో ఈవీఆర్ ఆస్పత్రి దందా!

గుడివాడలో ఈవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ముసుగులో జరుగుతున్న ఘరానా మోసం బయటపడింది. ఉచిత వైద్య శిబిరాల పేరుతో ప్రజలను రప్పించి.. వారికి శస్త్ర చికిత్సలు జరిగినట్టు నకిలీ బిల్లులు సృష్టించి ప్రభుత్వం నుంచి భారీగా దోచుకుంటున్నారు. విషయం తెలుసుకుని ఓ బాధితురాలు ఆస్పత్రి యాజమాన్యాన్ని నిలదీస్తే దురుసుగా ప్రవర్తించడం చర్చనీయాంశంగా మారింది.

- యాంజియోగ్రామ్ చేయించుకుంటే.. మోకాలికి ఆపరేషన్ జరిగినట్లు బిల్లులు
- అవాక్కైన బాధితురాలు, బంధువులు
- ఇదేంటని ప్రశ్నిస్తే దురుసు సమాధానం



తన కాళ్లకు ఆపరేషన్ జరగలేదని చూపుతున్న సావిత్రి

గుడివాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గుడివాడలో నడుస్తున్న ఈవీఆర్ ఆస్పత్రి తీరుపై అనేక విమర్శలు వస్తున్నాయి. ఆస్పత్రిలో ఈ నెల మొదటి వారంలో ఈవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో ఉచిత వైద్య శిబిరం మూడు రోజుల పాటు నిర్వహించారు. గుడివాడ మండలం మల్లాయిపాలెం శివారు శ్రీకాళహస్తి కాలనీకి చెందిన యాళ్ల సావిత్రి ఈ శిబిరానికి వెళ్లి గుండెకు సంబంధించి యాంజియోగ్రామ్ పరీక్షలు చేయించుకున్నారు. ఆ సమయంలో సావిత్రితో హడావిడిగా ఖాళీ పత్రాలపై సంతకాలను ఆస్పత్రి సిబ్బంది తీసుకున్నట్టు తెలిసింది. ఈ నెల 18వ తేదీన ఈవీఆర్ ఆస్పత్రిలో సావిత్రి చేరినట్లు, 19వ తేదీన శస్త్రచికిత్స చేసినట్లు, 20వ తేదీన ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు మెడికల్ రికార్డు సృష్టించారు. దీనికి సంబంధించిన ఓ పత్రం సావిత్రి ఇంటికి చేరింది. చూసిన బాధితురాలు సావిత్రి, ఆమె కుటుంబ సభ్యులు అవాక్కైయ్యారు. గుండె సమస్యపై ఆస్పత్రికి వెళ్తే మోకాలుకు ఆపరేషన్ చేసినట్టు ఉండటం చూసి వెంటనే ఆస్పత్రికి వెళ్లి యాజమాన్యాన్ని నిలదీశారు. ఈ విషయంపై మీకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని, చేతనైంది చేసుకోవాలని దురుసుగా ప్రవర్తించారు. దీంతో బాధితురాలు మిగతా 6లో..

దేశ సమైక్యతకు స్ఫూర్తి పటేల్

» మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య
» ఆర్టికల్ 360 రద్దుతో సంపూర్ణ భారతావని
» రైతుల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న కృష్ణామిల్క్ యూనియన్
» పాల ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్‌ది ప్రథమస్థానం


సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న వెంకయ్య, ప్రాజెక్ట్ కామధేనులో పాల ఉత్పత్తుల తయారీని వెంకయ్యానాయుడుకు వివరిస్తున్న కృష్ణామిల్క్ చైర్మన్ చలసాని , ఎండీ కొల్లి ఈశ్వరబాబు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ సమైక్యత కోసం ఎనలేని కృషిచేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. వీరవల్లి ప్రాజెక్ట్ కామధేను (విజయ పాల ఫ్యాక్టరీ) ఆవరణలో బుధవారం సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 565 సంస్థానాలను నయానా, భయానా విలీనం చేసి దేశ సమైక్యతకు బీజం వేయడంతో పాటు రైతులను సంఘటితం చేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్‌పటేల్ అన్నారు. కాశ్మీరు సమస్యను పటేల్‌కు అప్పగించి ఉంటే ఇలాంటి పరిస్థితి ఉండేది కాదన్నారు. అనేక సంవత్సరాల తరువాత ప్రధాని మోదీ చొరవతో ఆర్టికల్ 360 రద్దు చేసి చూపారని, ఆ సమయంలో రాజ్యసభ చైర్మన్‌గా తాను విధులు నిర్వహించడం గర్వకారణంగా భావిస్తున్నానన్నారు. 'ఏక్ దేశ్‌మే దో విధాన్, దో జెండా నహీ రహేగా' అంటూ చిన్ననాటి నుంచి నినాదాలు చేశామన్నారు. అదే స్ఫూర్తితో రాజ్యసభ చైర్మన్‌గా అప్పుడు జరిగిన సన్నివేశాలను, ప్రధాని మోదీ సహకారంతో చేసిన పనుల గురించి వివరించారు. ఓటింగ్ జరిగేటప్పుడు, రాజ్యాంగాన్ని గౌరవించడంలో అప్రజాస్వామికంగా వ్యవహరించిన వారిపై కఠినంగా వ్యవహరించానన్నారు. భారత ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ చైర్మన్‌గా తన జీవితంలో అది ముఖ్యమైన ఘటనగా ఆయన అభివర్ణించారు.

రాజకీయాలకతీతంగా సహకారంగం వర్ధిల్లాలి

వాతావరణ పరిస్థితుల వల్ల రైతులకు నష్టం వాటిల్లుతోందని, పాడి పరిశ్రమపై ఆధార పడిన రైతులు ఇంతవరకూ నష్టపోయిన దాఖలాలు లేవని వెంకయ్యనాయుడు అన్నారు. వీరవల్లిలోని ప్రాజెక్ట్ కామధేనులో(కృష్ణామిల్క్ యూనియన్)పాలఉత్పత్తుల తయారీ, ల్యాబ్ తదితర విషయాలను పరిశీలించి నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ పవర్‌ను ప్రారంభించారు. అనంతరం రైతులకు ముందస్తు బోనస్ చెక్కును వెంకయ్యనాయుడు చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, పాలే కాకుండా పాల ఉత్పత్తుల ద్వారా గణనీయంగా ఆదాయం పెంచుకుంటూ రైతులకు పంచుతూ అభివృద్ధిచెందాలని అకాంక్షించారు.

13నెలల వయస్సులో తల్లిని కోల్పోయిన తనకు కాఫీ, టీ లాంటివి తెలయదన్నారు. తన జీవితంలో చాలా సంవత్సరాల తరువాత ఇప్పుడు ప్రాజెక్ట్ కామధేనులో పాలు తాగానని, విజయ పాలు నిజంగా అద్భుతంగా ఉన్నాయని అభినందించారు. చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ, వ్యక్తిత్వం, ఆదర్శం, సేవల్లో మేటి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ముందు మాట్లాడటం కొంచెం భయంగా ఉందన్నారు. రైతు బిడ్డగా ఆయన దేశానికి చేసిన సేవలు, యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేలా సమాజాభివృద్ధికి ఆయన అందించన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. మండవ జానకిరామయ్య లాంటి ఎందరో మహానుభావులు కృష్ణామిల్క్ యూనియన్ అభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఆలపాటి సురేష్, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.


గుడ్లవల్లేరు కేడీసీసీ బ్యాంక్‌లో భోగరాజు పట్టాభి సీతారామయ్య, అడుసుమిల్లి అశ్వర్థనారాయణ మూర్తి విగ్రహాల ఆవిష్కరణ చేసిన నెట్టెం రఘురామ్, వెనిగండ్ల, రావి, పిన్నమనేని తదితరులు

దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి పునాది వేసిన భోగరాజు పట్టాభి, అడుసుమిల్లి

» విగ్రహావిష్కరణలో నెట్టెం రఘురాం

గుడ్లవల్లేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి అవసరమైన సంస్కరణలు చేపట్టి సహకార బ్యాంకింగ్‌ని దూరదృష్టితో ఆలోచించిన మహనీయుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య.. గ్రామీణ ప్రజల సంక్షేమం కోసం భూమి తనఖా బ్యాంక్ స్థాపించి 35 సంవత్సరాలు అధ్యక్షునిగా ఉంటూ రైతాంగానికి సేవలందించిన గ్రామీణ ఆర్థిక నిర్మాణాన్ని బలోపేతం చేసిన మరో మహోన్నత వ్యక్తి అడుసుమిల్లి అశ్వర్థనారాయణ మూర్తి.. వీరిరువురి విగ్రహాలను గుడ్లవల్లేరు కేడీసీసీ బ్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేయడం అభినందనీయమని బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం శ్రీరఘురామ్ అన్నారు. అశ్వర్థనారాయణ మూర్తి 120వ జయంతిని పురస్కరించుకొని బుధవారం స్థానిక కృష్ణాజిల్లా కో-ఆపరేటివ్ బ్యాంక్ ఆవరణలో వీరిరువురి విగ్రహాలను నెట్టెం రఘురామ్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావుల చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ, మహనీయుల ముందు చూపు, సేవానిరతి వల్ల నేడు సహకార బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా రైతులకు రుణాలు అందిస్తున్నాయన్నారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ, అశ్వర్థనారాయణ మూర్తి ఆలోచనల వల్ల గుడ్లవల్లేరులో ఆర్థిక చైతన్యం, విద్యా వ్యాప్తి, సామాజిక ఎదుగుదల సాధ్యమయ్యాయన్నారు. దేశంలోనే తొలి భూమితనఖా బ్యాంక్ గుడ్లవల్లేరుకు తీసుకొచ్చిన మహావ్యక్తిగా కొనియాడారు. ఈ సందర్భంగా నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. వృద్ధులకు వస్త్ర దానం చేశారు. కార్యక్రమంలో వల్లూరుపల్లి రామకృష్ణ, కొడాలి వెంకట కృష్ణారావు, వల్లభనేని సుబ్బారావు, వల్లూరుపల్లి సత్యనారాయణరావు, కొనరాజు బాపయ్యచౌదరి, మనోహర్, పొట్లూరి రవికుమార్, యనిగళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ శివయ్యకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

పెండింగ్ కౌలు వెంటనే చెల్లించాలి

» రైతు నాయకుడు నాయన ప్రభాకరరావు

గన్నవరం నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రైతులకు ఐదేళ్లు కౌలు గడువు పెంచిన విధంగా విమానాశ్రయ విస్తరణకు భూములు ఇచ్చిన రైతులకు కూడా పెంచాలని గన్నవరం విమానాశ్రయ విస్తరణకు భూములు ఇచ్చిన రైతు నాయకుడు నాయన ప్రభాకరరావు ప్రభుత్వాన్ని కోరారు. విమానాశ్రయ విస్తరణకు భూములు ఇచ్చిన రైతుల ఖాతాలలో కౌలు జమ చేయలేదని, వెంటనే పెండింగ్‌లో ఉన్న కౌలును జమచేయాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ కేవీ శివయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ, 2014లో ల్యాండ్ పోలింగ్ ద్వారా భూములు ఇచ్చామన్నారు. ఎకరానికి రూ.50 వేలు కౌలు ఇస్తామన్నారని, ఆ తర్వాతి ఏడాది నుంచి రూ.5వేలు పెంచుతూ పదేళ్ల వరకు ఇస్తామని చెప్పారని తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి పదేళ్ల పూర్తి అయ్యాయని తెలిపారు. ఇప్పటివరకు రైతులకు పూర్తిగా కౌలు జమ చేయలేదన్నారు. ఒకటి నుంచి ఏడేళ్ల వరకు ప్రభుత్వం, ఎనిమిది నుంచి సీఆర్డీఏ అధికారులు ఇచ్చినట్టు చెప్పారు. ఒకటి నుంచి ఏడేళ్ల మధ్యలో చాలామంది రైతులకు బకాయిలు ఉన్నాయన్నారు. కొంతమందికి మాత్రమే జమ చేశారన్నారు. పదో ఏడాది కౌలు పూర్తిగా రావాల్సి ఉందని చెప్పారు. భూములు ఇచ్చిన రైతులను ఆదుకోవాలన్నారు. రైతులు జి.రంజిత్, పువ్వాడ శ్రీహరి, కె.వెంకట్, అక్కినేని విజయకుమార్, మాగంటి రెడ్డియ్యచౌదరి, జి.సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా తిరుమలకుమార్

» ఉమ్మడి కృష్ణా ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు!
» విద్యాసాగర్ సరెండర్‌ను ఆమోదించిన ప్రభుత్వం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగం ఎన్టీఆర్ జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా సీహెచ్ తిరుమల కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి ఎస్ఈ విద్యాసాగర్‌ను కలెక్టర్ లక్ష్మీశ సోమవారం ప్రభుత్వానికి సరెండర్ చేయటంతో.. మంగళవారం ప్రభుత్వం ఆగమేఘాలపై వైద్యారోగ్యశాఖ విభాగంలో డెప్యూటేషన్‌లో పనిచేస్తున్న తిరుమల కుమార్‌ను ఎన్టీఆర్ జిల్లాకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా నియమించింది. ఈఈగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తిరుమల కుమార్ ఉమ్మడి కృష్ణాజిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు చేపట్టనున్నట్టు సమాచారం. మంగళవారం సాయంత్రం కలెక్టర్ మీడియాకు అధికారికంగా సమాచారాన్ని తెలిపారు. తాత్కాలికంగా జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈకి అదనపు బాధ్యతలు అప్పగించారు.

బస్టాండ్‌లో కత్తితో సైకో హల్‌చల్


పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి

తిరువూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బస్‌స్టాండ్‌లో గుర్తుతెలియన వ్యక్తి మద్యం మత్తులో కత్తితో బుధవారం ఉదయం హల్‌చల్ చేశాడు. బస్‌స్టాండ్‌లో తిరుగుతూ చంపుతానంటూ కత్తితో కొందరు వ్యక్తులపైకి దాడికి యత్నించాడు, బస్‌స్టాండ్‌లో బీభత్సం సృష్టిస్తుండటంతో, కొందరు ఆతడ్ని పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పూర్తిమద్యం మత్తులో ఉన్నాడని, తనది నేపాల్ అని చెపుతున్నాడని, పూర్తివివరాలు తెలుసుకుంటున్నట్టు ఎస్సై కెవిజివి సత్యనారాయణ తెలిపారు.

బస్సు డ్రైవర్‌పై దాడి ఘటనపై కేసు నమోదు

జగ్గయ్యపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేట ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్‌పై జరిగిన దాడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాజు తెలిపారు. హైర్‌బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న షేక్ ఖాజా బాషా (26) విజయవాడ నుంచి జగ్గయ్యపేటకు 24వ తేది రాత్రి గం.8ల సమయంలో ఎస్జీఎస్ కళాశాల వద్ద ఆటో డ్రైవర్ బస్సుకు అడ్డం పెట్టి అసభ్యంగా మాట్లాడుతుండగా, బస్టాండు వద్దకు వస్తే మాట్లాడుకుందామని చెప్పి వచ్చేశామన్నారు. డిపోలో బస్సు అప్పగించేందుకు వెళ్లగా అక్కడకు ఆటోలో తన మిత్రులతో కలిసి వచ్చి దాడి చేశారని ఫిర్యాదు చేశాడు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాజు తెలిపారు.


రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్‌లో ప్రథమ బహుమతి సాధించిన కృష్ణాజట్టు బాలికలు, బాలికల సింగిల్స్ ద్వితీయ బహుమతి విజేత రుత్విక (కృష్ణా), బాలుర సింగిల్స్‌లో ద్వితీయ బహుమతి విజేత రుత్విక్ (కృష్ణా), బాలికల సింగిల్స్‌లో తృతీయ బహుమతి విజేత రోషిణి రష్మిత (పశ్చిమగోదావరి)

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ విజేతలు కృష్ణా, నెల్లూరు

మచిలీపట్నం టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో నెల్లూరు జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రోలింగ్ కప్పు సాధించింది. ద్వితీయ బహుమతిని తూర్పుగోదావరి, తృతీయ బహుమతిని విశాఖ, నాలుగవ బహుమతిని పశ్చిమగోదావరి జిల్లా బాలురు గెలుచుకున్నారు. బాలికల బ్యాడ్మింటన్ పోటీల్లో కృష్ణాజిల్లా జట్టు విజేతగా నిలిచారు. నెల్లూరు ద్వితీయ, తూర్పుగోదావరి తృతీయ, అనంతపురం నాలుగో స్థానంలో నిలిచారు. సింగిల్స్‌కు పోటీల్లో నెల్లూరు జిల్లా క్రీడాకారుడు వర్షిత్ 30 పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. విశాఖ క్రీడాకారుడు రుత్విక్ 27 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచాడు. కృష్ణాజిల్లాకు చెందిన కోనేరు మోక్షసాయి తృతీయ, కుందేటి సుహాస్‌లు 4వ స్థానంలో నిలిచారు. బాలికల సింగిల్స్‌లో కర్నూలుకు చెందిన ఎం.కనిష్క 30 పాయింట్లు సాధించి గెలుపొందింది. కృష్ణాజిల్లా కె.రుత్విక 25 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. తృతీయ స్థానంలో పశ్చిమగోదావరి, నాలుగో స్థానంలో నెల్లూరు నిలిచాయి. విజేతలకు కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ బహుమతులతోపాటు బందరు లడ్డూలు అందజేశారు. జాతీయస్థాయిలోనూ ఆంధ్రప్రదేశ్ జెండాను ఎగురవేయాలని కోరారు. జాతీయ పోటీలకు కర్నూలుకు చెందిన ఎం.తనిష్కారెడ్డి, కృష్ణా జిల్లాకు చెందిన కె.రుత్విక, పశ్చిమగోదావరికి చెందిన కె.రోషిణి, నెల్లూరుకు చెందిన జీవీ లతారెడ్డి, ప్రకాశంకు చెందిన బి.ఆషాశ్రీ, కృష్ణాజిల్లాకు చెందిన శ్రీరామ్ కావ్య, కడపకు చెందిన ఎల్.పూర్విజ, తూర్పుగోదావరికి చెందిన బి.దివ్యశ్రీలు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో నెల్లూరుకు చెందిన టి.వర్షిత్, విశాఖకు చెందిన వై.రుత్విక్, కృష్ణాజిల్లాకు చెందిన మోక్షసాయి, సుహాస్, ప్రకాశంకు చెందిన జి.షణ్ముఖ వర్ధన్, విశాఖకు చెందిన బార్గవ్, కడపకు చెందిన ఈశ్వరప్రసాదరెడ్డి, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎం.ఎస్.శ్రీచక్రనివాస్‌లు ఎంపికయినట్టు పరిశీలకులు ప్రకటించారు.

అవినీతి రాజు

(5వ పేజీ తరువాయి)

చూస్తున్న ఆ కాంట్రాక్టు ఉద్యోగి ఏ మిల్లులకు మంచి ధాన్యాన్ని పంపించాలో నిర్దేశిస్తాడు.

రైతు ఇష్టాన్ని కాదని..

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం ఏ మిల్లుకు తోలాలన్నది రైతుల ఇష్టమే. కానీ, కాంట్రాక్టు ఉద్యోగి చెప్పుచేతల్లో ఉండే రైతు సేవా కేంద్రాల్లోని ఉద్యోగులు ఆయన చెప్పినట్టుగా రైతులతో సంబంధం లేకుండా పలు మిల్లులకు ఆర్డర్ కొడతారు. రైతులు ప్రశ్నిస్తే ఫలానా మిల్లు బ్యాంకు గ్యారెంటీ (బీజీ)లు సరిగ్గా ఇవ్వరని, ఇబ్బందులు వస్తాయని చెబుతారు. మేము చెప్పే మిల్లులైతే బీజీలు సక్రమంగా ఇస్తాయని, ఇబ్బంది ఉండదని నమ్మిస్తారు.

ప్రైవేట్ వ్యాపారులకు వెన్నుదన్నుగా..

జిల్లాలో ప్రైవేట్ వ్యాపారులతో కూడా కాంట్రాక్టు ఉద్యోగికి సంబంధాలు ఉన్నాయి. ప్రైవేట్ వ్యాపారులు.. రైతుల దగ్గరకు వెళ్లి ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర కంటే రూ.500-రూ.700 తక్కువగా కొంటారు. తేమశాతంతో పనిలేకుండా ధాన్యాన్ని కొంటామని చెబుతారు. ప్రభుత్వం నిర్దేశించిన తేమశాతం 17 శాతానికి కంటే ఎక్కువగా ఉన్నా ధాన్యాన్ని కొంటారు. కల్లాల్లోనే కొంటారు. దీంతో రైతులు కూడా.. ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముతున్నారు. ఇలా కొన్న ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులు రైతు సేవా కేంద్రాలకు వచ్చి రైతుల పేరుతో ఎంపిక చేసిన మిల్లులకు ధాన్యాన్ని పంపిస్తారు. ప్రభుత్వ మద్దతు ధర రైతుల ఖాతాల్లో జమ అవుతుంది. రైతుల నుంచి ముందుగా డెబిట్ కార్డులు తీసుకుని, డబ్బు పడిన వెంటనే డ్రా చేసుకుంటున్నారు. ఇలాంటి వ్యవహారాలకు కాంట్రాక్టు ఉద్యోగి సహకారం అందిస్తున్నాడన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలి

మచిలీపట్నం టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలంటూ బుధవారం కార్మిక సంఘాల నాయకులు నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ నేతలు బి.సుబ్రహ్మణ్యం, సీహెచ్ జయరావు, ఎం.వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకుడు జమలయ్య, అంగన్వాడీ వర్కర్ల సంఘ జిల్లా కార్యదర్శి ఎ.రమాదేవి, కాంగ్రెస్ నాయకుడు అబ్దుల్ మతీన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి. నాగేశ్వరరావు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శీలం నారాయణ రావు పాల్గొన్నారు.

టైపిస్ట్ పరీక్షల సమయం కుదించడం దారుణం

» వీసీఐఏ సెక్రటరీ కృష్ణారావు

విజయవాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : టైపిస్టులకు నిర్వహించే పరీక్షల సమయం కుదించడం దారుణమని విజయవాడ కమర్షియల్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్ సెక్రటరీ దాకినేడి కృష్ణారావు అన్నారు. బుధవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలుపుతూ టైప్ నేర్చుకునే వారికి రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి 6 నెలలకు ఒకసారి నిర్వహించే పోటీ పరీక్షలు నిర్వహిస్తుందన్నారు. రోజుకు 5 బ్యాచ్‌ల చొప్పున 2 రోజులకు 8 బ్యాచ్‌లుగా నిర్వహించేవారన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో 400లకు పైగా ఇన్స్టిట్యూట్‌లు ఉపాధి పొందుతున్నాయన్నారు. ప్రభుత్వం తమకు ఎటువంటి సహాయ సహకారాలు అందించకపోయినా పరీక్షల నిర్వహించే రోజులు కుదించడం బాధాకరమన్నారు. కనీసం రోజుకు రెండు పరీక్షలు నిర్వహించకుండా ఒకే పరీక్ష నిర్వహించడం దారుణమన్నారు. పరీక్షల సమయం కుదించడం వల్ల బ్యాచ్‌లకు మిషన్స్ మార్చుకోవడానికి సమయం సరిపోదన్నారు. దీనితో పాటు విద్యార్థులపై ఒత్తిడి పెరిగి పరీక్షల్లో ఫెయిలయ్యే అవకాశముందన్నారు. ప్రభుత్వం తక్షణమే నిర్ణయాన్ని ఉపసంహరించుకుని యథావిధిగా 2 రోజులు పరీక్షలు నిర్వహించాలని బోర్డును కోరారు.


సమావేశంలో పాల్గొన్న చలసాని శ్రీనివాస్, తదితర నేతలు

రాజ్యాంగంపై అవగాహన కల్పించాలి

గాంధీనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నేటి యువతకు భారత రాజ్యాంగంపై అవగాహన లేకపోవడం దురదృష్టకరమని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి రాజ్యాంగంపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు, యువత రాజకీయంగా ఎదగాలన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏపీ గెజిటెడ్ ఆఫీసర్స్ జేఏసీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో బుధవారం సాయంత్రం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మేధావుల ఫోరం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జీ ఈశ్వరయ్య మాట్లాడుతూ విద్యార్థులకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించాలన్నారు. విద్యా వ్యవస్థలో రాజ్యాంగ అంశాలు పొందుపరచాలని డిమాండ్ చేశారు. ఏపీ గెజిటెడ్ ఆఫీసర్స్ జేఏసీ చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ, విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు ఏడాది పాటు పాఠశాలలు, కళాశాలల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. తులసీరామ్ యాదవ్ రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. జేఏసీ నేతలు అజయ్ మేడిపల్లి, వరలక్ష్మీ, పూర్ణచంద్రరావు, కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

చిక్కుముడి

(5వ పేజీ తరువాయి)

3 మండలాలను కూడా ఎన్టీఆర్‌లో కలపాలని ప్రజలు కోరారు. క్యాబినెట్ సబ్ కమిటీకి తమ అభిప్రాయాలు తెలిపారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కూడా ప్రతిపాదనలు ఇచ్చారు. కానీ, ఈ ప్రతిపాదనలను బుట్టదాఖలు చేయడంపై స్థానికంగా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

గన్నవరాన్ని ఎన్టీఆర్‌లోనే కలపాలి

గన్నవరాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాల్సిన అవసరం ఉంది. గన్నవరం మండలం విజయవాడకు అతి దగ్గర. విజయవాడ అభివృద్ధి అంతా గన్నవరంవైపు జరుగుతుంది. ఎన్టీఆర్ జిల్లాలో కలిపితే మంచి అవకాశంగా భావించవచ్చు. జిల్లా హెడ్ క్వార్టర్ మచిలీపట్నం చాలా దూరంగా ఉంది. అంతర్జాతీయ విమానాశ్రయానికి విజయవాడ పేరు ఉంది. వీఐపీలు వచ్చినప్పుడు ప్రొటోకాల్ కోసం రావాలన్న అధికారులు మచిలీపట్నం నుంచి రావాలి. నియోజకవర్గ పునర్విభజనకు అవకాశం కనిపించట్లేదు. మరింత అభివృద్ధి చెందాలంటే ఎన్టీఆర్ జిల్లాలో గన్నవరం ఉంటేనే బాగుంటుంది. కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ మంచే ఎక్కువ జరుగుతుంది.

\- గన్నె వెంకట్రావు, ఆర్థిక విశ్లేషకుడు, గన్నవరం

జిల్లా కేంద్రం చాలా దూరం



బాపులపాడు మండలాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలిపాలి. నేను చదువుకుని వ్యవసాయం చేస్తూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాను. గ్రామంలో పొలం పనులు చూసుకుంటూ అవసరార్థం జిల్లా ప్రధాన కార్యాలయానికి వెళ్లాలంటే 60 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల అటు పొలం పనులు, ఇటు ఉద్యోగ విధినిర్వహణకు సమయం చాలక ఇబ్బంది పడుతున్నాను.

\- గొరిపర్తి గణేశ్, మడిచర్ల, యువత. బాపులపాడు మండలం

సమస్యలను సరిదిద్దాలి



ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఉన్నప్పుడు వ్యక్తిగత పనులకు అధికారులను కలిసేందుకు అరగంటలో వెళ్లేవాళ్లం. ఇప్పుడు 60 కిలోమీటర్ల దూరంలోని మచిలీపట్నానికి వెళ్లడం వల్ల సమయం చాలట్లేదు. అధికారులు కూడా క్షేత్రస్థాయి పర్యటనల్లో బిజీగా ఉండటంతో సమస్యలు విన్నవించేందుకే రెండు, మూడు సార్లు తిరగాల్సి వస్తోంది. గత ప్రభుత్వం చేసిన ఇబ్బందికర పరిణామాలను సరిదిద్దకుండా ఉండటం సరికాదు.

\- చింతా మానస, ఉంగుటూరు మండలం

చెట్టూ.. దర్జాగా దోచేట్టు..

(5వ పేజీ తరువాయి)

వాటిని కొనుగోలుదారులకు విక్రయించారు. గడచిన నెలలో గ్రామంలో ఇళ్ల ఆవరణలో పెంచుకున్న సుబాబుల్ చెట్లను కొంతమంది అమ్మేశారు. వాటిని నరుక్కోడానికి వచ్చిన వారికి ఇరిగేషన్ కాల్వగట్లపై ఉన్న సుబాబుల్, నిద్ర గన్నేరు చెట్లు కనిపించాయి. ఇళ్ల ఆవరణలో ఉన్న చెట్లను నరుక్కున్న కొనుగోలుదారులు పనిలో పనిగా కాల్వగట్లపై ఉన్న సుబాబుల్, నిద్రగన్నేరు చెట్లను నరుక్కుని కలపను తరలించుకుపోయారు. దీనిపై గ్రామస్తులు.. జలవనరుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మొత్తం 22 సుబాబుల్ చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరుక్కుని తీసుకెళ్లినట్టు గుర్తించారు. ఒక్కో చెట్టు మార్కెట్ విలువ రూ.7 వేల నుంచి రూ.8వేలు ఉంటుందని అంచనా.

ఫిర్యాదు చేసినందుకు బదిలీ

ఇరిగేషన్ జొన్నపాడు సెక్షన్ ఏఈ, లాక్ సూపరింటెండెంట్లు, గుమస్తాలు కాల్వగట్లను పరిశీలించారు. ఎక్కడెక్కడ ఎంతెంత మందం ఉన్న చెట్లను నరికారో గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ప్రక్రియ జరిగిన కొన్నిరోజులకు ఆ ఏఈకి ఊహించని పరిణామం ఎదురైంది. ఈ విషయంలో పోలీసులకు ఎవరు ఫిర్యాదు చేయమన్నారంటూ అధికారులు ఆయనకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఆ తర్వాత అక్కడి నుంచి బదిలీ చేశారు. దీనివెనుక ఒక డీఈ స్థాయి అధికారి ఉన్నారని గ్రామాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. జోగి రమేశ్ పెడన ఎమ్మెల్యేగా ఉంటూ, మంత్రిగా పని చేసిన సమయంలో జలవనరుల శాఖలో చక్రం తిప్పిన అధికారే ఇప్పుడూ అదే విధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీన్ని పాలకులు, ఉన్నతాధికారులు కట్టడి చేస్తారా, కొనసాగిస్తారా చూడాలి.

గుండె సమస్య..

(5వ పేజీ తరువాయి)

మీడియాకు వివరాలు వెల్లడించారు. శస్త్రచికిత్స జరిగితే గాట్లు ఏవని, తనకు అసలు శస్త్రచికిత్స జరగలేదని తన కాళ్లను చూపించారు.

నకిలీ బిల్లులతో భారీ దోపిడీ!


సావిత్రికి శస్త్రచికిత్స జరిగినట్టు తయారు చేసిన ధ్రువీకరణ పత్రం

ఈవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో నకిలీ మెడికల్ రికార్డులను సృష్టించి భారీగా దోపిడీకి పాల్పడుతున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ఉచిత వైద్య శిబిరాల పేరుతో ప్రజలను రప్పించి, పరీక్షల రిపోర్టుల అడిగితే వేలాది రూపాయలు వసూలు చేశారని రోగులు ఆరోపిస్తున్నారు. యాంజియోగ్రామ్ చేయించుకునేందుకు వెళ్లిన మహిళకు ఏకంగా మోకాలుకు శస్త్రచికిత్స నిర్వహించినట్లు రికార్డులు సృష్టించి ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని పక్కదారి పట్టించారని తెలిసింది. ఈ విధంగా ఎన్ని నకిలీ మెడికల్ రికార్డులను తయారు చేసి మోసాలకు పాల్పడుతున్నారోనని ప్రజాసంఘాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, ఈవీఆర్ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

ఆది నుంచి వివాదాస్పదమే!

గుడివాడలో ఈవీఆర్ ఆస్పత్రి ఏర్పాటు చేసిన నాటి నుంచి వివాదాలకు కేంద్రంగా మారిందని విమర్శలు ఉన్నాయి. 2020-21 కరోనా సమయంలో జరిగిన దారుణాలు అన్నీ ఇన్నీ కావని స్థానికులు చెప్పుకుంటున్నారు. కరోనా నిర్ధారణ పరీక్షల పేరుతో సాగించిన దోపిడీ, కరోనా చికిత్స పేరుతో లక్షలాది రూపాయల వసూలు, కరోనా రోగి కుటుంబసభ్యులు నగదు చెల్లించలేని స్థితిలో ఉండటంతో వారి లారీని బలవంతంగా హస్తగతం చేసుకున్న ఘటనలు అప్పట్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రతి కరోనా నిర్ధారణ పరీక్షకు రూ.1,500 వసూలు చేశారు. కరోనా పరీక్షలు చేయించుకున్నవారు మెడికల్ ఇన్సూరెన్స్ క్లయిమ్ చేసుకునేందుకు కరోనా పాజిటివ్ రిపోర్టులను అడిగితే ఇచ్చేందుకు నిరాకరించిన సందర్భాలున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. రాజకీయ పలుకుబడి మెండుగా ఉండటంతో ఇలాంటి ఘటనలు బయటకు రావడంలేదని సమాచారం.

4 నుంచి పైడమ్మ జాతర

పెడన, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 4 నుంచి 14 వ రకు జరగనున్న పైడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల ప్రచార పోస్టర్‌ను దేవ స్థానం ప్రాంగణంలో ట్రస్టు బోర్డు సభ్యులతో కలిసి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆవిష్కరించారు. ఈవో జి.వి.కృష్ణారావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నా రు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్ 122,131, 142
చికెన్ విత్ స్కిన్ 232
చికెన్ స్కిన్‌లెస్ 242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

జూడో విజేత భావనకు అభినందనలు



విజయవాడ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో ఈ నెల 20 నుంచి 24 వరకు జరిగిన సీనియర్ స్టేట్ టోర్నమెంట్ జూడో - 2025లో శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థిని భావన గోల్డ్ మెడల్ సాధించింది. సీనియర్ ఇంటర్ చదువుతున్న బి.భావనను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

త్రిశక్తిపీఠంలో మహాలక్ష్మీ వ్రతం

కృష్ణలంక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): త్రిశక్తిపీఠంలోని కాళీమాత ఆలయంలో మార్గశిర మాసంలో నాలుగు గురువారాల పాటు మహాలక్ష్మీ అమ్మవారికి అభిషేకాలు నిర్వహించనున్నట్లు, డిసెంబరు 4న మార్గశిర మహాలక్ష్మి వ్రతం కూడా జరపదలచినట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్ బుధవారం తెలిపారు. ఈనెల 27, డిసెంబరు 4, 11, 18 తేదీల్లో మహాలక్ష్మి అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగు గురువారాలకు కలిపి అభిషేక రుసుము రూ.500గా నిర్ణయించినట్లు, అభిషేకంలో పాల్గొనదలచిన భక్తులు దేవస్థానం కార్యాలయంలో రుసుము చెల్లించి రశీదు పొందాలని వారు కోరారు. 4న వ్రతంలో పాల్గొనదలచిన భక్తులు ముందుగా తమ గోత్రనామాలను టికెట్ కౌంటర్‌లో నమోదు చేసుకోవాలని వారు తెలిపారు.



మెడికల్ కాలేజీ విద్యార్థుల ర్యాలీ

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఎథికోస్ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బోడే శశిధర్

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎథికోస్ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బోడే శశిధర్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై నగరంలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తమ సంస్థ నిత్యం ప్రజలకు అవగాహన కల్పిస్తోందన్నారు. అనంతరం ప్లాస్టిక్ నిరోధించి పర్యావరణానికి పాటుపడతామని వైద్య, నర్సింగ్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ జక్కుల పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పునరంకితం కావాలి



డాక్టర్ బ్రహ్మాజీరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ తదితరులు

విజయవాడ కల్చరల్ : పీబీ సిద్ధార్థ కళాశాల రసాయన శాస్త్ర విభాగం సెమినార్ హాలులో బుధవారం పర్యావరణం సుస్థిర అభివృద్ధి అనే అంశంపై కార్యక్రమం జరిగింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్ర విభాగాధిపతి ఆచార్య పి.బ్రహ్మాజీరావు మాట్లాడుతూ కేజీ నుంచి పీజీ వరకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పునరంకితం కావాలన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మాజీరావును ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మనోరంజని, సహాయ ఆచార్యులు డాక్టర్ డేవిడ్‌రాజు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పీటీఎస్ఆర్‌కే ప్రసాదరావు, డాక్టర్ ఎ.రామారావు, డాక్టర్ డి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఆర్యవైశ్య నాయకులు, టీడీపీ నాయకులు

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

కృష్ణలంక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెనుగొండ క్షేత్రానికి శ్రీ వాసవి పెనుగొండ అని నామకరణం చేసి ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడంతో కృష్ణలంకలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ సభ్యులు, టీడీపీ నాయకులు కృష్ణలంక మెట్లబజారులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కార్పొరేషన్ అధ్యక్షుడు డూండీ రాకేష్‌కు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు గొంట్ల రామ్మోహన్‌రావు, మట్టా సుబ్బారావు, చీమకుర్తి అప్పారావు, మల్లిఖార్జునరావు, కామేశ్వరప్రసాద్, తడికమళ్ల సురేష్, చక్కా రవి, టీడీపీ నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, వేములపల్లి రంగారావులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వహక ఇంజనీర్ పి.హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ 6, 7, 8 రోడ్లు, వాటర్ ట్యాంక్ రోడ్డు, భారతీనగర్ కాలనీ 10, 12 రోడ్ల పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అన్నదానం

భారతీనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్షల సందర్భంగా అయ్యప్పనగర్ భక్తబృందం (బుజ్జి స్వామి) ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్పనగర్‌లో నిర్వహించిన అన్నదానంలో శ్రీనివాస నగర్ కాలనీ వాసులు, టీడీపీ నేత గల్లా సదాశివరావు, కుమారుడు శేషు కుమారు సహాయార్థం అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ పాల్గొని స్వాములకు అన్నదానం చేశారు.

29 నుంచి అధ్యాపకుల బ్యాడ్మింటన్ టోర్నమెంట్

విజయవాడ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సిద్ధార్థ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవాలలో భాగంగా 50వ ఏపీ కాలేజీ టీచర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఈ నెల 29 నుంచి రెండు రోజుల పాటు మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్స్ డాక్టర్ మేకా రమేష్, సీహెచ్ వెంకటేశ్వర్లు, డైరెక్టర్ వేమూరి బాబూరావు తెలిపారు. బుధవారం ఉదయం కళాశాలలో టోర్నమెంట్ పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల అనుబంధ వైద్య, దంత, ఫార్మా, ఇంజనీరింగ్, వ్యవసాయ, న్యాయ, శారీరక విద్య, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బోధనా సిబ్బందికి ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడాకారులకు అల్పాహారం, ఉచిత భోజనం, ఉచిత వసతి అందిస్తామన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగాధిపతులు డాక్టర్ టీవీబీ కృష్ణారెడ్డి, మార్కండేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో



ఆంధ్రా లయోలా కళాశాలలో..



లబ్బీపేటలోని అల్ మునీర్ ఫౌండేషన్ కార్యాలయంలో



22వ డివిజన్‌లో

సుస్థిరమైనది భారత రాజ్యాంగం

భారతీనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లోని రాజ్యాంగాల్లో భారతరాజ్యాంగం చాలా గొప్పదని, సుస్థిరమైనదని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. బుధవారం తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ మన దేశ రాజ్యాంగం ప్రపంచంలో కెల్లా అత్యుత్తమ రాజ్యాంగమని అన్నారు. రాజ్యాంగాన్ని రాసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దైవ సమానులని తెలిపారు. రాజ్యాంగంలోని హక్కులు, ఆదేశిక సూత్రాలు వల్లనే మనమందరం ఆనందంగా జీవిస్తున్నామని అన్నారు. రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, దాసరి గాబ్రియేల్, నరిహద్దు రవి, పి.రవీంద్ర, పాల్గొన్నారు.

ఆంధ్రా లయోలా కళాశాలలో..

ఆంధ్రా లయోలా కళాశాలలో రాజకీయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ రాజకీయ శాస్త్ర విభాగాధిపతులు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



బెజవాడ బార్ అసోసియేషన్‌లో..

డాక్టర్ విజయ బాబు పాల్గొన్నారు. ఆయనను ప్రిన్సిపాల్ ఫాదర్ మెల్చియర్, విభాగాధిపతులు సన్మానించారు. ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో ఐక్యూఏసీ, ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధ్యాపకులు ఫాదర్ ఇమ్మానుయేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అండ్ డైరెక్టర్ ఫాదర్ జోజిరెడ్డి, విభాగాధిపతులు విజయ కుమార్, డాక్టర్ రాజు, డాక్టర్ శామ్యూల్ దయాకర్, డాక్టర్ ముువ్వా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అల్ మునీర్ ఫౌండేషన్ కార్యాలయంలో..

లబ్బీపేట: అల్ మునీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లబ్బీపేటలోని కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు మునీర్ అహ్మద్, మౌలానా నసీర్ ఉమ్రి, అబ్దుల్ ఖదీర్ షోయబి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణలంక : 22వ డివిజన్‌లోని 109, 110, 111, 112 సచివాలయాల సిబ్బంది రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. టీడీపీ డివిజన్ మాజీ అధ్యక్షుడు పలిశెట్టి అన్నారావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బెజవాడ బార్ అసోసియేషన్‌లో..

విజయవాడ లీగల్: భారత రాజ్యాంగం ప్రపంచ ప్రజాస్వామ్య దేశాలకే దిక్సూచి అని బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా అన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్‌లో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భారత రాజ్యాంగం పుస్తకాన్ని బార్ కౌన్సిల్ మెంబర్ సూరాబత్తుల మల్లేశ్వరరావుకు బార్ అధ్యక్షుడు ఏకే బాషా బహూకరించారు. న్యాయవాదులు సంపర శ్రీనివాసరావు, గంధం శ్రీను, కోటేశ్వరరావు, అరిగెల శివరాంప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పక్కనే కమిషనర్ ధ్యానచంద్ర

వీఎంసీలో రాజ్యాంగ పీఠిక సామూహిక పఠనం

కార్పొరేషన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం నూతన భవనం మీటింగ్ హాల్‌లో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం రాజ్యాంగ పీఠిక సామూహిక పఠనం నిర్వహించారు. రాజ్యాంగ ప్రవేశికను అందరు సామూహికంగా చదివారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ భారత రాజ్యాంగం, భారతీయులందరు తెలుసుకోవాల్సిన ముఖ్యమైన పుస్తకమని, రాజ్యాంగం ద్వారా భారతీయులకు కల్పించిన హక్కులు, విధులను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగ పీఠిక చదవటమే కాకుండా దాని ప్రాముఖ్యత తెలుసుకోవడం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఏ.రవీంద్రరావు, డాక్టర్ డి. చంద్రశేఖర్, సీఎంహెచ్‌వో డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, సీఈ ఇన్‌చార్జి పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య దేశాలన్నింటిలో భారత్ మిన్న

- వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ న్యాయకళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దివాకర్ బాబు



కానూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ఐక్యత, సమగ్రతలకు పెద్దపీట వేస్తూ అనేకమంది మేధావుల కృషి ఫలితంగా రూపం పోసుకున్న భారత రాజ్యాంగం ప్రపంచంలోని పలు ప్రజాస్వామ్య దేశాల కన్నా మిన్న అని వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దివాకర్ బాబు అన్నారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. మత గ్రంథాలు వేరైనా అన్ని మతాలు, వర్గాలకు అనువర్తించే గ్రంథం భారత రాజ్యాంగమని, ఆ రాజ్యాంగ సూత్రాలను స్ఫూర్తిదాయకంగా తీసుకుని వికసిత్ భారత్ దిశగా ఎదగాలని దివాకర్ బాబు పేర్కొన్నారు. న్యాయ విద్యార్థులు రాజ్యాంగ సూత్రాలను అవపోసన పట్టాలని, రాజ్యాంగ స్ఫూర్తిని దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.రమేశ్చంద్ర మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకుని భారత ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి వివిధ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. కేంద్రం వివిధ వర్గాలకు అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడానికి న్యాయ విద్యార్థులు సహకారం అవసరమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ పీఠికను రమేశ్చంద్ర ప్రతిజ్ఞ చేయించారు.



చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం పనులను పరిశీలిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలను నిర్వహించేలా

స్టేడియాలను తీర్చిదిద్దుతాం

- ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):నగరంలోని క్రీడామైదానాలు, ఇండోర్ స్టేడియాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఆటల పోటీలను నిర్వహించేలా తీర్చిదిద్దుతున్నామని ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. బుధవారం తూర్పు పరిధిలోని పటమట హైస్కూల్ రోడ్డులోని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియం ఆధునికీకరణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ అమరావతిలో భాగమైన విజయవాడ నగరంలోని క్రీడా వసతుల కల్పనపై తమ ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. జాతీయస్థాయి క్రీడా పోటీలను వైజాగ్, విజయవాడల్లోనే నిర్వహిస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ డిసెంబరు నెలాఖారులో జూనియర్ బ్యాడ్మింటన్ నేషనల్ లెవల్ పోటీలను నగరంలో నిర్వహించనున్నామని తెలిపారు. దండమూడి రాజగోపాలాచారి ఇండోర్ స్టేడియం, చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఆ పోటీలను నిర్వహించే విధంగా కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్టేడియంలను తీర్చిదిద్దుతున్నామన్నారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతులు ఇక్కడ కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, నాదెళ్ల రాజేష్, కోనేరు రాజేష్, సీఈ సతీష్ కుమార్, ఈఈ స్వామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

ఇంద్రకీలాద్రి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరాలయంలో బుధవారం మాసవారీ ఆర్జిత సేవగా వల్లీ దేవసేన, సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణోత్సవాన్ని వీక్షించారు. ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ దంపతులు, ఈవో శీనానాయక్ కల్యాణ క్రతువులో పాలు పంచుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు, అక్షింతలను అందజేశారు.



వేదఘోషలో పాల్గొన్న పండితులు

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవం

విజయవాడ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : లబ్బీపేట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవం ఘనంగా జరిగింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది ఉదయం 6.30 నుంచి శ్రీ సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. వేదఘోష, శంఖ, మంగళ వాయిద్యనాదాల మధ్య సాయంత్రం శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద విద్యార్థులతో వేద ఘోష నిర్వహించారు. ఈ సందర్భంగా కంచి కామకోటి పీఠం ప్రతినిధి డాక్టర్ సి.రామ్మోహనరావు మాట్లాడుతూ లబ్బీపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు సర్పదోషం, కాలసర్ప దోషం, పితృదోషం వంటి అన్ని జాతక దోషాలు తొలగిపోతాయన్నారు.

ఘాట్‌ల వద్ద ప్రమాదాలు జరగకుండా కంచె ఏర్పాటు చేయాలి

వన్‌టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది ఒడ్డున ఉన్న ఘాట్‌లలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ కోసం కంచెలు ఏర్పాటు చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయం కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ అన్నారు. బుధవారం ప్రత్తిపాటి శ్రీధర్ దుర్గగుడి ఇంజనీరింగ్ అధికారులు, వన్‌టౌన్, భవానీపురం, కృష్ణలంక పోలీసు స్టేషన్ సీఐలు గురుప్రకాష్, ఉమామహేశ్వరరావు, నాగరాజులతో కలిసి వన్‌టౌన్ శనైశ్చరస్వామి ఆలయం సీతమ్మ వారి పాదాల వద్ద ఉన్న ఘాట్‌ను పరిశీలించారు. కృష్ణానదిలో స్నానాలు ఆచరించే వారికి రక్షణగా కంచె ఏర్పాటు చేయాలని శ్రీధర్ దుర్గగుడి ఇంజనీరింగ్ అధికారులు, సీఐలకు సూచించారు. కంచె ఏర్పాటుకు అంచనా వ్యయాన్ని రూపొందించాలని దుర్గగుడి ఇంజనీరింగ్ అధికారులకు శ్రీధర్ సూచించారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి ఏఈ మస్తాన్, డీఈ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులతో సెల్‌ఫోన్లో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి

● మంత్రి కొలుసు పార్థసారథి

పామర్రు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ ప్రభావం వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నియోజకవర్గంలోని తన స్వగ్రామమైన కారకంపాడు నుంచి విజయవాడ వెళ్తున్న ఆయన మార్గమధ్యంలోని పామర్రు-గుడివాడ వెళ్లే ప్రధాన రహదారిపై అన్నదాతలు ఆరబెట్టిన ధాన్యం రాశులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు. రైస్ మిల్లర్లు, అధికారులు సమన్వయ లోపంతో ధాన్యం రవాణా సక్రమంగా జరగటం లేదని, రంగుమారిన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోవడంలేదని వాపోయారు. స్పందించిన మంత్రి పార్థసారథి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ డీకే బాలాజీ, పౌరసరఫరాల శాఖ అధికార్లకు ఫోన్‌లో వివరించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. రైతన్నలకు ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా రాష్ట్రప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్

● కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం విరాజిల్లుతోందని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతలు అందరికీ సమానత్వం, సామ్యవాదం ఏర్పాటు చేశారన్నారు. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మనతో పాటు స్వాతంత్ర్యం వచ్చిన పాకిస్తాన్‌లో ఆశించినంతగా ప్రజాస్వామ్యం వర్ధిల్లలేదన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, కేఆర్‌సీఎస్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, డీఈవో పీవీజే రామారావు, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి చిన్న నరసింహులు, జిల్లా సైన్స్ ఆఫీసర్ జాకిర్‌హుసేన్, కలెక్టరేట్ ఏవో రాధిక పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న ఎంపీ చిన్ని, ఎమ్మెల్యేలు

సార్.. నిధులు మంజూరు చేయండి..!

● సీఎంను కలిసిన ఎంపీ చిన్ని, ఎమ్మెల్యేలు తాతయ్య, సౌమ్య

జగ్గయ్యపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబును విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి నందిగామ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ తంగిరాల సౌమ్య, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సచివాలయంలో కలిసి కోరారు. పోలంపల్లి మునేరు ఆనకట్ట తాత్కాలిక రింగ్ బండ్ ఏర్పాటుకు రూ.71.45 లక్షలు, కంచల-వేదాద్రి ఎత్తిపోతల పథకం అభివృద్ధికి రూ.15 కోట్లు తక్షణం మంజూరు చేయాలని కోరారు. రెండు పనులు యుద్ధప్రాతిపదికన చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. నిధులు మంజూరుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.



రాజ్యాంగ పీఠిక చదువుతున్న సర్పంచ్‌లు

రాజ్యాంగ దినోత్సవానికి ఆహ్వానితులుగా సర్పంచ్‌లు

● కృష్ణాజిల్లా నుంచి ముగ్గురి ఎంపిక

చల్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం జరిగిన రాజ్యాంగ దినోత్సవానికి చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి ఆహ్వానితురాలిగా పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర అవార్డుల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీగా చల్లపల్లి ఎంపికవగా, సీఎం చేతులమీదుగా సర్పంచ్, ఈవోలు అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే. రాజ్యాంగ దినోత్సవానికి పలు పంచాయతీల ఉత్తమ సర్పంచ్‌లను ఎంపికచేసి ఆహ్వానించగా, కృష్ణా జిల్లా నుంచి ఎంపికైన ముగ్గురిలో చల్లపల్లి సర్పంచ్ కృష్ణకుమారి ఒకరు. ఆమెతోపాటు కేసరపల్లి, ఉరివి సర్పంచ్‌లు చేబ్రోలు లక్ష్మీమౌనిక, పంచకర్ల సురేష్ పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవ నిర్వహణలో భాగంగా నిర్ణీత సమయానికి రాష్ట్రం తరపున లైవ్‌లో రాజ్యాంగ పీఠికను సర్పంచ్‌లు చదివారు. భారత రాజ్యాంగంపై ప్రసంగం జరిగింది. డిప్యూటీ కమిషనర్ సుధాకరరావు, అడిషనల్ కమిషనర్, అధికారులు పాల్గొనగా, నోడల్ అధికారి వినోద్ పర్యవేక్షించారు.

హక్కులను కాపాడుకోవాలి: కేవీపీఎస్

విజయవాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను రద్దు చేస్తూ కార్పొరేట్ల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను వ్యతిరేకిస్తూ అంబేడ్కర్ స్మృతివనం వద్ద కేవీపీఎస్, దళిత గిరిజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం 'రాజ్యాంగ పీఠిక పఠనం' కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అధ్యక్షతన జరిగింది. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు పీఠిక చదివి ప్రతిజ్ఞ చేయించారు. లేబర్‌కోడ్స్ తీసుకురావడం దుర్మార్గమని ఆగ్రహించారు. కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుండెమెడ క్రాంతికుమార్, ఆలిండియా దళిత, గిరిజన, బలహీన మైనారిటీ సంఘాల అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజ్ పాల్గొన్నారు.



కల్యాణం..

ఇందిరా ఫుడ్స్ అధినేత, పారిశ్రామికవేత్త మండవ వెంకటరత్నం, ఇందిర దంపతుల కుమారుడు సాయి నాగవిశాల్, గుత్తా శ్రీనివాసరావు, స్వరాజ్యలక్ష్మి కుమార్తె రాజిత వివాహం బుధవారం గన్నవరంలోని ఏబీ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేమూరి ఆదిత్య, ఆంధ్రజ్యోతి ప్రింటర్ అండ్ పబ్లిషర్ కె.శేషగిరిరావులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకకు ఎంపీ కేశినేని చిన్ని, కేంద్ర ప్రత్యక్ష పన్నుల శాఖ మాజీ చైర్మన్ కేవీ చౌదరి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తదితర ప్రముఖులు హాజరయ్యారు. - ఆంధ్రజ్యోతి, గన్నవరం



ఆహ్వానం..

వచ్చే ఏడాది జనవరి 9 నుంచి 11 వరకు విజయవాడలో జరగనున్న క్రెడాయ్ ప్రాపర్టీ షోకు రావాలని కోరుతూ మంగళవారం క్రెడాయ్ ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో క్రెడాయ్ విజయవాడ చాప్టర్ అధ్యక్షుడు జీఎస్ఆర్ మోహనరావు, సభ్యులు సీహెచ్ సతీష్, కే రఘురామ్, బీ పవన్ కుమార్, ఎస్ఎల్‌వీ రాజు, వీ మణికంఠ సీఎంను కలిసి ప్రాపర్టీ షో వివరాలు తెలిపి తప్పక రావాలని ఆహ్వానించారు. - వన్‌టౌన్, ఆంధ్రజ్యోతి

సేంద్రియం.. అమృతతుల్యం

- వాతావరణ ప్రతికూలతలకు తట్టుకుంటున్న వరి
- బాపులపాడు మండలం వైకుంఠలక్ష్మీపురంలో నిరూపించిన రైతు
- సేంద్రియ వ్యవసాయంతో పంటను కాపాడుకున్న సత్యనారాయణ
- చిట్టి ముత్యాల సాగుతో ఖర్చు తక్కువ.. అధిక దిగుబడి, లాభాలు
- ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సహకరించాలని వినతి
- రసాయనాల వాడకం లేక భూమి సారవంతం

బాపులపాడు మండలంలోని వైకుంఠలక్ష్మీపురంలో సేంద్రియ వ్యవసాయం చేస్తూ చుట్టుపక్క గ్రామాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా విత్తనాలు సరఫరా చేయడంతో పాటు విదేశాలకు కూడా ఎగుమతి చేస్తూ ఆదాయాన్ని గడిస్తున్న రైతు అట్లూరి వెంకట సత్యన్నారాయణ ప్రేరణగా నిలుస్తున్నారు. రసాయనాలతో నిండిన భూమి మొదటి రెండేళ్ల తనను తాను మెరుగుపరుచుకునేందుకు సమయం తీసుకోవడం వల్ల దిగుబడి కొంత తగ్గినా తరువాత వచ్చే దిగుబడులతో అదిపెద్ద విషయమే కాదంటున్నారు.

ప్రతికూలతను తట్టుకుంటూ..

రసాయనాలతో పండించిన స్వర్ణ రకం వరిపంట మూడడుగుల మాత్రమే ఉన్నా ఇటీవల వచ్చిన తుపానుకు నేల వాలిపోయింది. కానీ పక్కనే సత్యన్నారాయణ పండించిన వివిధ రకాల వరి



తుఫాను ప్రభావంతో వరిగిన రసాయనాలతో పండించిన వరి (మూడడుగులు), నిలబడే ఉన్న సేంద్రియ వ్యవసాయంతో పండించి వరి (ఐదడుగులు)

పంట సుమారు ఐదడుగులకు పైనే ఉన్నా అలాగే నిలుచుని ఉండటం సేంద్రియ వ్యవసాయంలోని మహత్తు. ఒకేరకం నేల అయినా రసాయనాలతో భూమి పట్టు కోల్పోయి పంట పడిపోతుందని, సేంద్రియ సాగుతో పంట వేర్లు భూమిలోకి చొచ్చుకుని పోవడంతో పంట ఒరగదని సత్యనారాయణ చెబుతున్నారు.

ఆయనే రోల్‌మోడల్

2017లో సేంద్రియ వ్యవసాయంలో మొట్టమొదట దేశీయ విత్తనాలిచ్చి విజయ్‌రామ్ అనే శాస్త్రవేత్త తనకు ప్రోత్సాహ ఇచ్చారని అట్లూరి సత్యన్నారాయణ తెలిపారు. సేంద్రియ సాగులో మొదట రమేష్ అనే స్నేహితుడు కృష్ణవేణి అనే రకం కేజీ విత్తనాలిచ్చి ప్రోత్సహించాడని, వాటిని సాగుచేసి స్వయంగా వండడంతో కుటుంబసభ్యులు బాగున్నాయన్నారన్నారు. తదనంతరం వివిధ ప్రాంతాల్లో దేశీయ విత్తనాలను సేకరించి సాగు చేయడం మొదలు పెట్టి ఇప్పుడు తానే కొందరు రైతులకు అందిస్తున్నానన్నారు. విత్తనాలిచ్చిన రైతుల వద్ద తిరిగి విత్తనాలే తీసుకుంటూ ప్రోత్సహిస్తున్నానన్నారు. పిల్లలు పుట్టని వారికి, గర్భవతులకు, పిల్లలకు పాలిచ్చే తల్లులకు అవసరమైన సేంద్రియ వరి కూడా సాగు చేస్తున్నానన్నారు.

ఎకరానికి 40 బస్తాలు పండించిన రైతు రసాయన ఎరువులు, పురుగుమందులకు సగానికి పైగా ఖర్చు చేస్తుంటే సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతు అందులో పావు వంతు కూడా ఖర్చులేకుండా వరిపంటను పండిస్తున్నాడు. 20 ఎకరాలు సాగుచేసే రైతుకంటే ఐదెకరాల్లో వైవిధ్యభరిత దేశీయ విత్తనాలతో సేంద్రియ సాగు చేసిన రైతు ఎక్కువ లాభాలు గడిస్తున్నాడు. సేంద్రియ ఉత్పత్తులకున్న అత్యధిక డిమాండ్ ఆధారంగానే ఇది సాధ్యమౌతోంది. చిట్టిముత్యాల రకంతో చేసిన బిర్యానీకి ఎంత డిమాండ్ ఉందో నగరాల్లోని హోటళ్లలో అడిగితే తెలుస్తుంది. రసాయనాలతో పండించిన బాసుమతి కేజీ రూ.50 ఉంటే దేశీయరకం చిట్టిముత్యాలు రూ.150 పలుకుతుంది.

- ఆంధ్రజ్యోతి, హనుమాన్ జంక్షన్ రూరల్



సేంద్రియ ఉత్పత్తులకు డిమాండ్

తన కుమారుడి వివాహ సమయంలో సేంద్రియ వరితోనే భోజనాలు వండించానని, రుచి తెలుసుకున్న వారు ఇప్పటికీ తన వద్దకు వచ్చి బియ్యం కొనుక్కుంటారన్నారు. వివిధ ప్రాంతాల్లోని వైద్యులు, ఉపాధ్యాయులు, ఆరోగ్యం గురించి ఆలోచించేవారు తన వద్ద సాధారణ రకాలైన కేజీ రూ.100 నుంచి చిట్టిముత్యాలు, ఎరుపు రకాలు (మెడికల్ వాల్యూస్ ఉన్న) రూ.200 వరకూ బియ్యం కొనుగోలు చేస్తుంటారని వివరించారు.

మార్కెటింగ్ సదుపాయం లేదు

సేంద్రియ ఉత్పత్తులకు ప్రజల్లో డిమాండ్ ఉన్నా, మార్కెటింగ్ సదుపాయం లేదని, ప్రభుత్వం సహకరిస్తే మరింతమంది సేంద్రియ సాగువైపు ఆకర్షితులవుతారన్నారు. ఈసాగులో ముఖ్యమైన వేపపిండి, ఆముదపుపిండి లాంటివి ప్రభుత్వం అందజేసి ప్రోత్సహిస్తే మరింతమంది రైతులు ముందుకు వస్తారన్నారు.



రైళ్ల రాకపోకల్లో మార్పులు

రైల్వేస్టేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజన్ పరిధిలోని గోదావరి, రాజమండ్రి, కడియం సెక్షన్ల మధ్య ఈనెల 27 నుంచి పలు రైళ్ల రాకపోకల్లో మార్పులు జరగనున్నాయి. కొన్నింటిని రద్దు చేయటం, మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేయటం, ఇంకొన్నింటిని దారిమళ్లించటం వంటి చర్యలుంటాయని, రైల్వే అధికారులు తెలిపారు. 12718 రైలును 29, 31న, 12717 రైలు జనవరి 29, 31న రద్దు చేశారు. 67262, 67261 రైళ్లను జనవరి 29న రద్దు చేశారు. 17249 రైలును జనవరి 28న 17250 రైలును జనవరి 29న రద్దు చేస్తున్నారు. 17239 రైలును జనవరి 28 నుంచి 30 వరకు 17240 రైలును జనవరి 29 నుంచి 31 వరకు రద్దు చేశారు. 12806 రైలును జనవరి 29, 30న 12805 రైలును జనవరి 28, 29న, 67285 రైలును జనవరి 29, 31న 67286 రైలును జనవరి 29, 31న, 17480 రైలు జనవరి 27న, 17479 రైలు జనవరి 28న, 12775 రైలు జనవరి 27న, 12776 రైలు జనవరి 28న, 22708 రైలు జనవరి 28న, 22707 రైలు జనవరి 29న, 17257 రైలు జనవరి 29, 30న, 17258 రైలు జనవరి 29, 31న, 67202, 67201, 67246, 67241 రైళ్లను జనవరి 29న రద్దు చేశారు. 17219 రైలును 28, 29న, రైలును 29, 30న రద్దు చేశారు. 07254, 07523, 22876 , 22575 రైళ్లను జనవరి 31న రద్దు చేశారు.

పాక్షిక రద్దు...

17643 చెంగల్‌పట్టు - కాకినాడ పోర్టు జనవరి 28న బయలుదేరుతుంది. భీమవరం టౌన్, కాకినాడ పోర్టు మధ్య పాక్షికంగా రద్దు చేశారు. అత్తిలి, తణుకు, నిడదవోలు, గోదావరి, రాజమండ్రి, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, కాకినాడ టౌన్, కాకినాడ పోర్టులో ఈ రైలును నిలుపుదల చేయరు. 17655 కాకినాడ పోర్టు - పుదుచ్చేరి జనవరి 29న బయలుదేరుతుంది. కాకినాడ పోర్టు - భీమవరం టౌన్ మధ్య పాక్షికంగా రద్దు చేస్తారు. కాకినాడ పోర్టు, కాకినాడ టౌన్, సామర్లకోట, అనపర్తి, ద్వారపూడి, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, అత్తిలి స్టేషన్లలో ఈ రైలు ఆగదు.

దారి మళ్లింపు...

13352 అలప్పూజ-ధనబాద్ జనవరి 28న బయలుదేరుతుంది. ప్రస్తుతం కొవ్వూరు, గోదావరి, రాజమండ్రి, కడియం రూట్‌లో ప్రయాణించే ఈ రైలును కొవ్వూరు, రాజమండ్రి, కడియం మీదుగా మళ్లిస్తారు. గోదావరి స్టేషన్‌లో ఈ రైలు ఆగదు. 12804 హజరత్ నిజాముద్దీన్ - విశాఖపట్నం జనవరి 28న బయలుదేరుతుంది. నాగ్‌పూర్, బలార్ష, వరంగల్, విజయవాడ రూట్‌లో నడిచే ఈ రైలును నాగపూర్, దుర్గ్‌జంక్షన్, లాకోలి, సింగాపూర్ రోడ్డు, విశాఖపట్నం మీదుగా మళ్లిస్తారు. బలార్ష, వరంగల్, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ స్టేషన్లలో ఈ రైలు ఆగదు.

సమయాల్లో మార్పులు..

12889 ఈటానగర్ జంక్షన్ - సర్ మోక్షగుండం ఎం విశ్వేశరయ్య టెర్మినల్ బెంగళూరు రైలు జనవరి 30న బయలుదేరుతుంది. 210 నిమిషాల మేరకు సమయంలో మార్పు చేశారు. 13351 ధన్‌బాద్ - అలప్పూజ జనవరి 30న బయలుదేరుతుంది. 180 నిమిషాల మేరకు సమయంలో మార్పు చేశారు.

42 ప్రత్యేక రైళ్ల పొడిగింపు..

07027 చర్లపల్లి - బ్రహ్మపూర్ శుక్రవారాల్లో నడుస్తుంది. డిసెంబరు 5 నుంచి జనవరి 30 వరకు 9 ట్రిప్పులు, 07028 బ్రహ్మపూర్ - చర్లపల్లి శనివారాల్లో బయలుదేరుతుంది. డిసెంబరు 6 నుంచి జనవరి 31 వరకు 9 సర్వీసులు, 07035 చర్లపల్లి - అనకాపల్లి శనివారాల్లో నడుస్తోంది. డిసెంబరు 6 నుంచి జనవరి 17 వరకు ఏడు సర్వీసులు నడుస్తుంది. 07636 అనకాపల్లి - చర్లపల్లి ఆదివారాల్లో నడుస్తుంది. డిసెంబరు 7 నుంచి జనవరి 18 వరకు 7 సర్వీసులు నడుస్తుంది. 07651 జల్నా - చాప్రా బుధవారాల్లో నడుస్తుంది. డిసెంబరు 3 నుంచి డిసెంబరు 31 వరకు అయిదు ట్రిప్పులు నడుస్తుంది. 07652 చాప్రా - జల్నా శుక్రవారాల్లో నడుస్తుంది. డిసెంబరు 5 నుంచి జనవరి 2 వరకు అయిదు ట్రిప్పులు చొప్పున నడుస్తుంది. 07027, 07028 చర్లపల్లి - బ్రహ్మపూర్ ప్రత్యేక రైలు అప్ అండ్ డౌన్‌లో 18 సర్వీసులు నడుస్తాయి. 07035, 07036 చర్లపల్లి - అనకాపల్లి అప్ అండ్ డౌన్ 14 సర్వీసులు నడుస్తాయి. 07651, 07652 జల్నా - చాప్రా ప్రత్యేక రైలు అప్ అండ్ డౌన్ 10 సర్వీసులు నడుస్తుంది. 07035, 07036 హైదరాబాద్ - అనకాపల్లి రైలును ఇక పై హైదరాబాద్ - చర్లపల్లి పేరిట నిర్వహిస్తారు.

లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలి

● రైతు, కార్మిక, ప్రజా సంఘాల నేతలు

ధర్నాచౌక్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని పలువురు వక్తలు ధ్వజమెత్తారు. కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లేబర్‌కోడ్స్ నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన రైతు, కార్మిక హక్కులను రక్షించుకునేందుకు దేశవ్యాప్తంగా ప్రజలందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, లేబర్ కోడ్‌ల నోటిఫికేషన్ రద్దు చేయాలని కోరుతూ రైతు, కార్మికసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో బుధవారం ధర్నా జరిగింది. తొలుత ఏలూరు లాకుల సెంటర్ నుంచి ధర్నాచౌక్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జీ ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన నూతన విత్తన చట్టం ముసాయిదా, నూతన మార్కెట్ విధానం రైతుల పాలిట ఉరితాళ్లుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల చట్టాలను తక్షణమే రద్దుచేసి రైతు, కార్మిక అనుకూల చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.



ధర్నాలో పాల్గొన్న రైతు, కార్మిక, ప్రజా సంఘాల నేతలు

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, రైతు, కార్మిక, ప్రజా సంఘాల నేతలు వై కేశవరావు, దడాల సుబ్బారావు, యలమందారావు, ఎం సాంబయ్య, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, ఏవీ నాగేశ్వరరావు, మరీదు ప్రసాదరావు పాల్గొన్నారు.



బ్యాంకులో జరిగిన అగ్ని ప్రమాదానికి కాలిపోయిన కంప్యూటర్లు

యూనియన్ బ్యాంకులో అగ్నిప్రమాదం

● స్పందించిన అగ్నిమాపక శాఖ అధికారులు

● కంప్యూటర్లు, ఫర్నీచర్ దగ్ధం

● రికార్డులన్నీ సురక్షితం: రామలింగారెడ్డి

గుడివాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్‌రోడ్డులోని వలివర్తిపాడు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో మంగళవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. బ్యాంకు కార్యాలయం నుంచి పొగలు వస్తుండటంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమందించారు. హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది బ్యాంకు అద్దాలను పగలగొట్టి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో కంప్యూటర్లు, ఫర్నీచర్ దగ్ధమయ్యాయి. అగ్నిమాపక శాఖ అధికారులు సకాలంలో స్పందించడంతో భారీ నష్టం తప్పింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్టు బ్యాంకు డిప్యూటీ రీజనల్ హెడ్ రామలింగారెడ్డి తెలిపారు.

రికార్డులన్నీ సురక్షితం

ఈ ప్రమాదం గురించి విషయం తెలుసుకున్న బ్యాంకు డిప్యూటీ రీజనల్ హెడ్ కొవ్వూరి ఉమారామలింగారెడ్డి బ్యాంకును పరిశీలించారు. బుధవారం అగ్ని ప్రమాద ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బ్యాంకులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్లే మంటలు వ్యాపించాయని, ఖాతాదారులు కంగారును పడాల్సిన అవసరం లేదన్నారు. బ్యాంకులో పొగ వ్యాపించడంతో కంప్యూటర్లు, ఫర్నీచర్ పాడయ్యాయని, రికార్డులు, డాక్యుమెంట్లు, లాకర్లలోని వస్తువులన్నీ భద్రంగా ఉన్నాయన్నారు. 4రోజుల్లో బ్యాంకు సేవలు అందుబాటులోకి తెస్తామని, పట్టణంలోని ఇతర శాఖల్లో ఖాతాదారులు సేవలు పొందవచ్చునని రామలింగారెడ్డి కోరారు.

ప్రైవేటు బస్సుల దోపిడీని అరికట్టాలి: సీపీఐ

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పండుగల సీజన్‌లో ప్రైవేటు బస్సు ఆపరేటర్ల దోపిడీని, రవాణా శాఖలో అవినీతిని అరికట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. రానున్న క్రిస్మస్, సంక్రాంతి పండుగలను దృష్టిలో పెట్టుకుని ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన లేఖ రాశారు. ప్రాంతాలను బట్టి బస్సు చార్జీలను రూ.3 వేల నుంచి రూ.7 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ బస్సులు ఫిట్నెస్, భద్రతా ప్రమాణాలు పాటించనప్పటికీ రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రవాణాశాఖలో అవినీతే ప్రైవేటు బస్సు ఆపరేటర్ల దోపిడీకి అవకాశంగా మారిందన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం
27 నవంబరు 2025

మన చుట్టూ ఉన్న సమాజంలో అనేక రకాల అసమానతలు కనిపిస్తూ ఉంటాయి. వాటిలో కొన్నింటినైనా తొలగించాలనే ఆశయంతో ముందుకు వెళ్తున్నారు గుంతకల్లుకు చెందిన కొందరు మహిళలు. రోజుకు రెండు రూపాయలు ఆదా చేస్తే- బాలికలకు ఉన్నత విద్యను అందించవచ్చనే లక్ష్యంతో 'అభయ విద్యా నిధి సొసైటీ' అనే ఒక సంస్థను స్థాపించారు. ఆ సొసైటీ ఇప్పుడు అనేక మంది పేద బాలికలకు ఆసరాగా నిలుస్తోంది.



చేయీ చేయీ కలిపి

గుంతకల్లుకు చెందిన సత్రసాల వసుంధర ఒక సాధారణ మహిళ. కానీ ఆమెకు సమాజానికి ఏదైనా చేయాలనే కోరిక బలంగా ఉండేది. విద్య వల్ల మహిళలకు సాధికారత వస్తుందని ఆమె నమ్మేవారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉన్నత విద్యను అభ్యసించలేని అనేక మంది బాలికలను ఆమె ప్రత్యక్షంగా చూశారు. వారికి ఏదైనా సాయం చేయాలనుకున్నారు. ఆ ఆలోచనల నుంచి పుట్టిందే 'అభయ విద్యా నిధి సొసైటీ'. తన వద్ద ఉన్న 20 వేల రూపాయలను విరాళంగా ఇచ్చి ఈ సొసైటీని ప్రారంభించారు. ఆమెలా సమాజానికి ఏదైనా చేయాలనే ఆసక్తి ఉన్నవారెందరో ఆమెకు సహకరించారు. చిన్న చిన్న బిందువులు కలిస్తేనే ఒక సముద్రమవుతుంది. మధ్యతరగతి ప్రజలు ఇతరులకు సాయం చేయలేరు కాబట్టి వసుంధర ఒక వినూత్నమైన ఆలోచనకు తెరలేపారు. దీనిలో భాగంగా- సొసైటీలో చేరిన సభ్యులందరి ఇళ్లలోను.. వారి పరిచయస్థుల ఇళ్లు, షాపుల్లోను హుండీ డబ్బాలు పెట్టారు. ఈ హుండి పెట్టుకున్న వారు క్రమం తప్పకుండా రోజుకు రెండు రూపాయలు దానిలో వేయాలి. ఇలా జమైన సొమ్ము ఏప్రిల్ నెలలో సొసైటీకి ఇస్తారు. ఈ ఆలోచన చాలా మందికి నచ్చింది. దీనిలో అనేక మంది హుండీల ద్వారా విరాళాలు ఇవ్వటం మొదలుపెట్టారు. మరి కొందరు ఒక అడుగు ముందుకేసి బాలికలకు ఫీజులు, పుస్తకాలకు- ట్యూషన్లకు అయ్యే వ్యయాన్ని భరిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఈ సొసైటీలో 150 మంది సభ్యులు ఉన్నారు. వీరి వద్ద ప్రతి ఏడాది వెయ్యి రూపాయల సభ్యత్వ రుసుము వసూలు చేస్తారు. ఈ రుసుముతో పాటుగా హుండీలు.. విరాళాలతో అనేక మంది బాలికలకు సాయం చేస్తున్నారు. మొదట్లో కేవలం ఇంటర్ వరకు చేరే బాలికలకే సాయం చేసేవారు. ఇప్పుడు డిగ్రీ చదివేవారికి కూడా సాయం చేస్తున్నారు.

> అర్హుల ఎంపికలో మా సొసైటీ నిబంధనలను తప్ప మరే ఇతర అంశాలనూ పరిగణనలోకి తీసుకోం. కుల, మతాలకు అతీతంగా బాలికలను ఎంపిక చేసి ఫీజులు చెల్లిస్తున్నాం. విద్యార్థినులు కూడా శ్రద్ధగా చదివి మాకు ఆత్మసంతృప్తిని కలిగిస్తున్నారు. రానున్న రోజుల్లో సొసైటీని మరింత విస్తృతపరుస్తాం.
>
> **- దేవరశెట్టి మాధవీలత,**
> సొసైటీ అధ్యక్షురాలు



ఎంపిక ఎలా..

"అర్హులైన వారందరూ బాగా చదువుకోవాలనే ఉద్దేశంతో ఈ సొసైటీని ప్రారంభించాం. అందుకోసం కొన్ని కట్టుదిట్టమైన నియమాలను ఏర్పాటు చేసుకున్నాం" అంటారు ఈ సొసైటీ ఛైర్ పర్సన్ వసుంధర. మంచి మార్కులతో ప్రభుత్వ కాలేజీలో సీటు తెచ్చుకొని.. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనేవారికి ఈ సొసైటీ సాయం చేస్తుంది. విద్యార్థినులు ఏ కులానికి చెందినవారు? ఏ మతానికి చెందినవారు? అనే పట్టింపులు ఏమి ఉండవు. అయితే సాయం పొందిన వారు కూడా మంచి మార్కులతో పాస్ కావాల్సి ఉంటుంది. ఒక సారి ఫెయిల్ అయినా- ఈ సాయాన్ని అందించరు. " సొసైటీ ఇచ్చిన ఆర్థిక సాయంతో నేను ఎంటెక్ పూర్తి చేశా. క్యాంపస్ ఇంటర్వ్యూలో టీసీఎస్‌లో ఉద్యోగం వచ్చింది.. డిగ్రీలో పాస్ కావటమే లక్ష్యం కాదు.. మంచి మార్కులతో ఇతరుల కన్నా ముందు ఉండాలని చదివేదాన్ని" అంటారు సంధ్య. ఈ సొసైటీకి విరాళాల రూపంలో వచ్చిన డబ్బంతా బ్యాంకుల్లో ఉంచుతారు. కాలేజీల ఫీజులను నేరుగా సొసైటీ నుంచి నేరుగా చెల్లిస్తారు. అంతే కాకుండా ఈ మధ్యకాలంలో సాయం పొందుతున్న విద్యార్థినులందరికీ ఒక వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో ప్రతి రోజు గ్రూపు సభ్యులు సాధించిన విజయాలు.. ఇతర స్ఫూర్తి గాథలను షేర్ చేస్తూ ఉంటారు. వీటి వల్ల కూడా అనేక మంది విద్యార్థినులు ప్రేరణ పొందుతున్నారు. ఈ తరహా సొసైటీలు అన్ని ప్రాంతాల్లో ఏర్పాటైతే మరింత మందికి సాయం అందుతుందనటంలో ఎటువంటి సందేహం లేదు.

• మహమ్మద్ రఫి,
గుంతకల్లు

పిల్లల్లో చెవి నొప్పి తగ్గేదెలా..?

ఒక్కోసారి పిల్లలు చెవిలో నొప్పంటూ ఏడుస్తూ ఉంటారు. వైద్యుని దగ్గరకు వెళ్లేలోపు చిన్న చిట్కాలతో చెవి నొప్పి నుంచి పిల్లలకు ఉపశమనం కలిగించవచ్చు.

- చెవి చుట్టూరా హీట్ ప్యాడ్‌తో అద్దడం వల్ల పిల్లలకు చెవి నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది. హీట్ ప్యాడ్ అందుబాటులో లేని పక్షంలో చేతి రుమాలును వేడి చేసి ఉపయోగించవచ్చు.
- ముక్కులో లేదా గొంతులో శ్లేష్మం చేరి చిక్కబడడం వల్ల కూడా చెవి నొప్పి రావచ్చు. పిల్లలకు గోరువెచ్చని నీరు తాగిస్తూ ఉంటే ఫలితం కనిపిస్తుంది.



- వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది నొప్పిని హరించడంలో బాగా పనిచేస్తుంది. రెండు వెల్లుల్లి రెబ్బలను కచ్చాపచ్చాగా దంచి పిల్లలచేత కొద్దికొద్దిగా తినిపిస్తే చెవి నొప్పి తగ్గుతుంది.
- ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు, పావు చెంచా మిరియాల పొడి కలిపి పిల్లల చేత తాగిస్తే వెంటనే ఉపశమనం కలుగుతుంది.
- ఒక చెంచా అల్లం రసంలో అరచెంచా తేనె కలిపి పిల్లల చేత నాకిస్తే చెవినొప్పి తగ్గుతుంది. వేడి వేడిగా సూప్‌లు తాగించినా ఫలితం ఉంటుంది.
- ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉండే చేపలు, అవిసెలు, ఇతర గింజలను పిల్లలు తినే ఆహారంలో చేర్చడం వల్ల వారికి చెవి నొప్పి రాదు
- స్ట్రాబెర్రీ, కివి, నారింజ, జామ, బత్తాయి, అనాస పండ్లతోపాటు ఆకుకూరలను పిల్లలకు తినిపిస్తుంటే చెవి నొప్పి సమస్య దరి చేరదు.
- రాత్రిపూట పిల్లలు చెవినొప్పితో బాధపడుతుంటే.. ఆలివ్ ఆయిల్‌ను కొద్దిగా వేడిచేసి దానితో చెవి చుట్టూరా మర్దన చేయాలి. ఆలివ్ ఆయిల్‌లోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు కొద్దిపాటి ఉపశమనాన్ని కలిగిస్తాయి.

కౌన్సెలింగ్

అనుబంధం బలంగా

డాక్టర్! మేమిద్దరం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లం. గత రెండేళ్లుగా ఇంటి నుంచే పని చేస్తున్నాం. అయితే ఈ తరహా వర్క్ ఫ్రం హోం బాగున్నట్టే అనిపించినా, గత కొంత కాలంగా మా మధ్య చీకాకులు, కోపతాపాలూ పెరుగుతున్నాయి. వీటిని వదిలించుకుని పూర్వంలా అన్యోన్యంగా మసలుకోగలిగే వాతావరణాన్ని నెలకొల్పే మార్గం ఉందా?

- ఓ సోదరి, హైదరాబాద్.

భార్యాభర్తల అనుబంధానికి దంపతులిద్దరూ సమ ప్రాధాన్యం ఇవ్వాలి. అలాగే పరిస్థితులను అంగీకరించి, వాటికి తగ్గట్టు మసలుకోవాలి. కలిసి ఒకే ఇంట్లో ఒకే వాతావరణంలో జీవించేటప్పుడు, అడపా దడపా చీకాకులు తలెత్తడం సహజమే! అయితే ఇద్దరి మధ్యా గొడవలు తలెత్తడానికి కారణాలను అన్వేషించుకోవాలి. పొరపాటు ఎక్కడ జరుగుతుందో ఎవరికి వారు గమనించుకోవాలి. అన్నిటికంటే ముఖ్యంగా కలిసి గడిపే సమయం విసుగు తెప్పించేలా ఉండకుండా అందుకు తగిన పరిష్కారాలు ఆలోచించాలి.

భావవ్యక్తీకరణ: చెబుతున్నది ఆలకించాలే తప్ప, ప్రతిస్పందించడం కోసం వినడం సరి కాదు. స్పందించడం కోసం చెబుతున్నది వినడం మొదలుపెడితే, పర్యవసానాలు తప్పవు

ప్రేమాప్యాయతలు: దంపతుల మధ్య అనుబంధం... ప్రేమ, ఆప్యాయతలతో ముడిపడి ఉండాలి. దాంపత్య బంధం



మీద పట్టు సాధించాలంటే దంపతులు ఒకర్నొకరు అర్థం చేసుకోవాలి. సంసార జీవితం సజావుగా సాగించగలిగే మెలకువలను అలవరుచుకోవాలి.

నాణ్యమైన సమయం: పరిమాణం కంటే నాణ్యత ముఖ్యం. ఎంత సమయం కలిసి గడిపాం అనేది కాకుండా ఎంత నాణ్యమైన సమయాన్ని గడిపాం అనేదే ముఖ్యంగా దంపతులు భావించాలి. అలాంటి సమయం కోసం తీరిక చేసుకోవాలి.

ప్రేమ భాష: స్పర్శే ప్రేమ భాష. హత్తుకోవడం, స్పృశించడం, చేతులు కలపడం... ఇవన్నీ దంపతులను మానసికంగా చేరువ చేసేవే! కాబట్టి ప్రతి రోజూ అంతటి సాన్నిహిత్యంతోనే మెలగాలి.

దూర దృష్టి: జీవితం, అనుబంధం, కలిసి జీవితాన్ని కొనసాగించడంలో ఉండే ప్రయోజనాలను దూర దృష్టితో ఆలోచించాలి.

దంపతులిద్దరూ పరస్పర వృత్తులనూ, సమయాలనూ, స్వేచ్ఛలనూ గౌరవించుకుంటూ అద్భుతమైన అనుబంధాన్ని ఏర్పరుచుకోవాలి. అనుకూల భావాలను స్వాగతిస్తూ, ప్రతికూల భావాలకు చోటు లేకుండా చేసుకోవాలి.

• డాక్టర్ మధురిమ రెడ్డి పూత,
సైకాలజిస్ట్, హైదరాబాద్

స్ఫూర్తి

భూమికి భారం తగ్గిస్తున్నారు

ఒకప్పుడు రాకెట్ ప్రయోగాల్లో భాగస్వామి అయిన ఆమె... ఇప్పుడు పర్యావరణ కార్యకర్తగా వ్యర్థాలపై యుద్ధం చేస్తున్నారు. మార్పునకు ఇంటి నుంచే శ్రీకారం చుట్టి... ఆపై సమాజంలో చైతన్యం తెచ్చే పనిలో పడ్డారు. 'జీరో వేస్ట్ అడ్డా' ఇన్‌స్టా వేదికగా అవగాహన కల్పిస్తూ... భారతీయుల గృహాల్లో వ్యర్థాలను తగ్గించేలా స్ఫూర్తి రగిలిస్తున్నారు. ప్రధాని మోదీ నుంచి 'నేషనల్ గ్రీన్ చాంపియన్ క్రియేటర్' అవార్డును సైతం అందుకున్న ఇస్రో మాజీ శాస్త్రవేత్త పంక్తి పాండే ప్రయాణం ఇది.

"మార్పు కోసం వేసే తొలి అడుగు ఎప్పుడూ ఒంటరే. ఆ అడుగు నాదే ఎందుకు కాకూడదు? ఈ ఆలోచనే నాలో ఉద్యమ స్ఫూర్తి రగిలించింది. వ్యర్థంపై యుద్ధానికి ప్రేరణ కలిగించింది. ఫలితంగా నాలుగేళ్ల కిందట 'జీరో వేస్ట్ అడ్డా' పురుడు పోసుకుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరం మాది. బీటెక్ తరువాత ఇస్రోలో మైక్రోవేవ్ ఇంజనీర్‌గా ఉద్యోగం వచ్చింది. 2009లో చేరాను. గత ఏడాది మార్చి వరకు పని చేశాను. అయితే మొదటి నుంచీ నాకు భూమికి భారంగా మారుతున్న, ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాల విషయంలో ఆందోళన ఉండేది. ఈ క్రమంలో ఒకరోజు పత్రికలో దీనికి సంబంధించిన ఒక కథనం చదివాను. పర్యావరణవేత్తలు, ప్రేమికులు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాల గురించి అందులో చర్చించారు. ఆ సమయంలో నేను గర్భవతిని. ఇప్పుడే వాతావరణం ఇంతలా కలుషితమైతే... ఇక పుట్టబోయే బిడ్డ పరిస్థితి ఏంటని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. ఈ ప్రశ్న నన్ను కుదురుగా కూర్చోనివ్వలేదు. మరి పరిష్కారం ఏంటి?

మా ఇంటి నుంచి...

తెలిసి కొందరు, తెలియక కొందరు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వ్యర్థాలు పేరుకుపోవడానికి మనమందరం కారణం అవుతున్నాం. మా ఇల్లే తీసుకోండి.. టిఫెన్ ప్లేట్ల నుంచి క్యారీబ్యాగ్‌ల వరకు ప్లాస్టిక్ వస్తువులే ఉండేవి. సౌలభ్యం కోసం కావచ్చు, మరొకటి కావచ్చు... కారణం ఏదైనా మనకు తెలియకుండా ప్లాస్టిక్ తదితర వ్యర్థాలు మన ఇంటిని ఆక్రమించేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలంటే... అది నాతోనే మొదలుకావాలని భావించాను. అందుకే మా ఇంటి నుంచే మార్పునకు శ్రీకారం చుట్టాను. క్యారీ బ్యాగ్‌లు, షాంపూ బాటిల్స్, కిచెన్‌లో వాడే స్క్రబ్బర్స్.. ఇలా ఎన్నో ఎక్కడబడితే అక్కడ కనిపించాయి. వాటికి ప్రత్యామ్నాయంగా పునర్వినియోగ స్టీల్ వస్తువులు, క్లాత్ బ్యాగ్స్‌లాంటివి తెచ్చాను. సెకండ్‌హ్యాండ్ ఫర్నీచర్ కొన్నాను. సాధ్యామైనంతవరకు వ్యర్థాలు తగ్గించుకొని, తదనుగుణంగా జీవనశైలిని మార్చుకున్నాను. ఆహార పదార్థాలు కూడా అవసరానికి మించి పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకున్నా. ఇదేతరహాలో ప్రజలను చైతన్యవంతులను చేస్తే ప్రయోజనం ఉంటుందని అనుకున్నా.



సామాజిక మాధ్యమాల ద్వారా...

నా దృష్టిలో త్వరితగతిన ప్రజలకు చేరువ కావడానికి సామాజిక మాధ్యమాలు అద్భుత సాధనాలు. సరైన రీతిలో ఉపయోగించుకొంటే సమాజంపై ఎంతో ప్రభావం చూపుతాయి. ఈ భావనతోనే 2021లో నేను 'జీరో వేస్ట్ అడ్డా' పేరుతో ఇన్‌స్టాగ్రామ్ పేజీ ప్రారంభించాను. దానిద్వారా పర్యావరణానికి హాని కలిగిస్తున్న వ్యర్థాల గురించి అవగాహన కల్పించాను. వాటికి ప్రత్యామ్నాయ మార్గాలు సూచించాను. అవకాశం ఉన్నవారికి అనువైన కంపోస్టింగ్ పద్ధతులు వివరించాను. కొద్ది రోజుల్లోనే నా పోస్టులు వేలమందిని ఆకర్షించాయి. ఇప్పుడు ఇన్‌స్టాలో నా పేజీని నాలుగు లక్షలమందికి పైగా ఫాలో అవుతున్నారు. ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో కూడా నా పోస్టులు షేర్ చేస్తున్నారు. నా సూచనలు, సలహాలతో చాలామంది తమ జీవన శైలిని మార్చుకున్నామని చెబుతుంటే నాకు ఎంతో సంతోషంగా ఉంటుంది. ఒక చిన్న అడుగుతో పర్యావరణానికి కొంతైనా మేలు జరుగుతోంది. ఇలాంటి మార్పునే నేను కోరుకుంది."

> **వర్క్‌షాప్‌లు కూడా...**
>
> ఒక పర్యావరణ ప్రేమికురాలిగానే కాకుండా... శాస్త్రవేత్తగా కూడా నేను ఆలోచించడం మొదలుపెట్టాను. వ్యర్థాలను తగ్గించి, తద్వారా కాలుష్యాన్ని నివారించేందుకు, పునర్వినియోగించేందుకు ఆచరణసాధ్యమయ్యే మార్గాలపై నిత్యం అన్వేషిస్తూనే ఉంటాను. ప్రయోగాలు చేస్తుంటాను. దీనికి అనుబంధంగా 'ప్రాజెక్ట్ కాంచన్' నెలకొల్పాను. మరింత చైతన్యం తేవాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా అవగాహన తరగతులు నిర్వహిస్తున్నాను. నా సేవలకు గుర్తింపుగా గత ఏడాది ప్రధాని మోదీ నుంచి 'నేషనల్ గ్రీన్ చాంపియన్ క్రియేటర్' అవార్డు అందుకున్నాను. 'ఫోర్బ్స్' మ్యాగజైన్ టాప్ 100 చేంజ్ మేకర్స్ జాబితాలో కూడా చోటు సంపాదించాను. ఏదిఏమైనా దీన్ని ఒక పనిగా కాకుండా ఒక బాధ్యతగా భావిస్తున్నా. అందరూ అలానే భావిస్తే భూమికి భారం తగ్గుతుంది. పర్యావరణం పచ్చగా వర్థిల్లుతుంది."

సర్వ రోగ నివారిణి

శీతాకాలంలో విరివిగా లభించే సింగాడా దుంపలు.. చూడడానికి నల్లని బొగ్గుల్లా కనిపిస్తాయి. లోపల మాత్రం తెల్లగా ఉంటుంది. వీటిలో చాలా పోషకాలు ఉంటాయనీ, వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయనీ నిపుణులు చెబుతున్నారు.



- సింగాడాలు తీపి, వగరు కలగలిసిన రుచిలో క్రంచీగా ఉంటాయి. వీటిని ఉడికించుకుని లేదా కాల్చుకుని తినవచ్చు. సలాడ్స్, సూప్స్, శాండ్‌విచ్‌లలో వినియోగించుకోవచ్చు. వీటిని ఎండబెట్టి పిండి చేసి దానితో రొట్టెలు, లడ్డూలు, కడి లాంటి కూరలు తయారు చేసుకోవచ్చు. సింగాడా పిండిని పూజలు, ఉపవాసాలప్పుడు ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటారు.
- సింగాడాలో పీచుపదార్థాలు అధికం. ఇవి జీర్ణక్రియను వేగవంతం చేసి చలికాలంలో ఎక్కువగా ఏర్పడే మలబద్ధకం సమస్యను నివారిస్తాయి.
- వీటిలోని కాల్షియం, పొటాషియం, మాంగనీస్, జింక్, కాపర్ లాంటి మినరల్స్. ఎముకలు, దంతాలను బలోపేతం చేస్తాయి. శరీరంలో రక్తప్రసరణ వేగాన్ని నియంత్రించి గుండె ఆరోగ్యంగా పనిచేసేందుకు తోడ్పడతాయి. మెదడుకు చురుకుదనాన్ని ఇస్తాయి.
- సింగాడాలో అరుదైన లారిక్ యాసిడ్ ఉంటుంది. ఇది చర్మసౌందర్యాన్ని కాపాడడంతోపాటు శిరోజాలు ఒత్తుగా పెరిగేలా చేస్తుంది. చర్మానికి తగినంత తేమను అందిస్తుంది. సింగాడాలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల చర్మం పొడిబారడం, చుండ్రు లాంటి సమస్యలు తగ్గుతాయి. శరీరంలో పేరుకున్న టాక్సిన్లు బయటికి వెళ్లిపోతాయి. కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది.
- సింగాడాలో బి, సి, ఇ, కె విటమిన్లతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు శరీరానికి పోషణను అందిస్తాయి. కొవ్వులు, కేలరీలు నామ మాత్రంగా ఉంటాయి. దీని గ్లైసెమిక్ ఇండెక్స్ కూడా చాలా తక్కువ. మధుమేహం ఉన్నవారికి ప్రయోజనకరంగా ఉంటుంది.

ట్రెండ్

భామల బ్రాండ్స్

బాలీవుడ్ బ్యూటీలు తెర మీద అద్భుతమైన నటనను ప్రదర్శించడంతో పాటు, అంతకు మించిన అద్భుతమైన బ్రాండ్లకు అధిపతులవుతున్నారు. ప్రముఖ తారలు, వాళ్ల సొంత బ్రాండ్ల గురించి తెలుసుకుందామా?

గ్లామర్, స్టైల్‌కు మారుపేరుగా నిలిచే హిందీ తారలు బ్రాండ్ల ప్రచారానికే పరిమితం కాకుండా సొంత దుస్తులు, సౌందర్య సాధనాల బ్రాండ్లను లాంచ్ చేసుకుంటూ ఫ్యాషన్ ప్రపంచంలో తమదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. అలాంటి కొందరు ప్రముఖులు, వారి బ్రాండ్లు ఇవే..

మసాబా.. లవ్ చైల్డ్


నీనా గుప్తా కూతురు మసాబా గుప్తా తనదైన ప్రత్యేకమైన స్టైల్ స్టేట్‌మెంట్‌కు గుర్తింపు పొందింది. హౌస్ ఆఫ్ మసాబా అనే దుస్తుల లేబుల్‌ను కలిగి ఉన్న మసాబా, బ్యూటీ బ్రాండ్, లవ్‌చైల్డ్‌ను కూడా లాంచ్ చేసింది. ఈ చర్మ సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్‌లో పలురకాల లిప్‌స్టిక్‌లూ, ఫౌండేషన్‌లూ ఉంటాయి. నీనా గుప్తా, క్రికెటర్ వివియన్ రిచర్డ్స్ ప్రేమ ఫలితంగా పుట్టిన తాను 'లవ్‌చైల్డ్'గా గుర్తింపు పొందడాన్ని ప్రారంభంలో ప్రతికూలంగానే భావించాననీ, కానీ ఆ స్టేటస్‌ను సవాలు చేసేలా, అసాధారణమైన అంశాన్ని సరళతరం చేయాలని సంకల్పించినట్టు మసాబా ఓ సందర్భంలో చెప్పుకొచ్చింది. ఆ క్రమంలోనే లవ్‌చైల్డ్ అనే బ్రాండ్‌ను సృష్టించి, తనదైన విప్లవాత్మక నైజాన్ని చాటుకునే ప్రయత్నం చేసింది మసాబా.

కత్రినా ఖైఫ్... కె బ్యూటీ

తన పేరులోని మొదటి అక్షరమైన 'కె' పేరుతో.. 2019లో కె బ్యూటీ బ్రాండును లాంచ్ చేసింది కత్రినా ఖైఫ్. అత్యుత్తమ నాణ్యతతో కూడిన, మేకప్ ఉత్పత్తులను ఈ బ్రాండ్ అందుబాటులోకి తీసుకొచ్చింది. లిప్ స్టిక్స్ ఐలైనర్స్, ఫౌండేషన్ మొదలైన సౌందర్యసాధనాలు ఈ బ్రాండ్‌లో దొరుకుతాయి.



అనుష్క శర్మ... నష్



అద్భుతమైన నటనా నైపుణ్యాలతో అభిమానులను అలరించిన అనుష్క సొంత బ్రాండ్ గురించి తెలిసిన వాళ్లు తక్కువ. 2017లోనే ఈమె దుస్తుల బ్రాండ్ 'నష్'ను లాంచ్ చేసింది. సౌకర్యంగా ఉండే దుస్తుల కొరతను గమనించిన అనుష్క, సౌకర్యంతో పాటు స్టైల్‌కు ప్రాధాన్యమిస్తూ వినూత్నంగా, విభిన్నంగా ఉండే దుస్తుల బ్రాండ్‌ను లాంచ్ చేసింది.

జాక్వెలిన్ ఫెర్నాండెజ్... జస్ట్ ఎఫ్

ఫ్యాషన్ ప్రపంచ రారాణిగా పేరుపొందిన జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఫ్యాషన్ సెన్స్‌కు అభిమానులు దాసోహమవుతూ ఉంటారు. ట్రెండీగా, ఆధునికంగా కనిపించే వస్త్రధారణను అనుసరించే జాక్విలిన్ 2018లో జస్ట్ ఎఫ్ పేరుతో వస్త్రాల బ్రాండ్‌కు శ్రీకారం చుట్టింది. సరికొత్త ఫ్యాషన్లను అనుసరిస్తూ, అందుబాటు ధరల్లో రూపొందే జస్ట్ ఎఫ్ దుస్తులు అన్ని వయసుల మహిళలనూ విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. మరీముఖ్యంగా క్యాజువల్ వేర్ దుస్తుల అవసరతను గుర్తించిన జాక్వెలిన్, తెలివిగా తన బ్రాండ్‌తో ఆ ఖాళీని భర్తీ చేయడం తెలివైన ఎత్తుగడ అని వ్యాపార నిపుణులు భావిస్తూ ఉంటారు.



అక్కాచెల్లెళ్ల... రీసన్

అత్యంత ఫ్యాషన్‌గా కనిపించే సోనమ్ కపూర్, రియా కపూర్‌లను ప్రస్తావించకుండా ఫ్యాషన్ గురించి మాట్లాడడం అసంభవం. ఈ ఇద్దరు అక్కాచెల్లెళ్లు రీసన్ అనే సొంత దుస్తుల బ్రాండ్‌ను కలిగి ఉన్నారు. ట్రెండీగా, అందుబాటు ధరల్లో దొరికే వస్త్ర ప్రపంచం వీరిది. వీటిలో క్యాజువల్ వేర్ బాగా ప్రసిద్ధి పొందింది. 2017లో లాంచ్ చేసిన ఈ బ్రాండ్ ఎంతో తక్కువ కాలంలోనే మహిళల ఆదరణను చూరగొనడం విశేషం.

ముగ్గురు ప్రముఖుల... లేబుల్ లైఫ్

సుసాన్ ఖాన్, బిపాషా బసు, మలైకా అరోరా... ఎవరి పరిధిలో వాళ్లు తమదైన ప్రత్యేకతను కలిగి ఉన్నారు. ఈ ముగ్గురు ప్రముఖులూ కలిసి లేబుల్ లైఫ్ అనే దుస్తుల బ్రాండ్‌ను రూపొందించారు. 2012లో లాంచ్ అయిన ఈ లైఫ్‌స్టైల్ బ్రాండ్, దుస్తులతో పాటు, గృహాలంకరణ వస్తువులు, మహిళల యాక్సెసరీస్‌లను అందిస్తుంది. మహిళల వస్త్రాలకే పరిమితం కాకుండా మహిళలు ఇష్టపడే గృహాలంకరణ ఉత్పత్తుల మీద దృష్టి సారించి, తమలోని వ్యాపార మెలకువలను చాటుకున్నారు.

అహ్మదాబాద్..అధికారికం

భారత్‌లోనే 2030 కామన్వెల్త్ క్రీడలు
ప్రకటించిన నిర్వాహకులు

గ్లాస్గో: రెండు దశాబ్దాల విరామం తర్వాత కామన్వెల్త్ క్రీడలు భారత్‌లో జరగనున్నాయి. 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య హక్కులను అహ్మదాబాద్ దక్కించుకొంది. నెల రోజుల కిందే ఖరారైనప్పటికీ.. బుధవారం జరిగిన కామన్వెల్త్ జనరల్ అసెంబ్లీలో అధికారికంగా ధ్రువీకరించారు. మొత్తం 74 దేశాలకు చెందిన ప్రతినిధులు భారత ఆతిథ్యాన్ని ఆమోదించారు. మొత్తం 15 నుంచి 17 క్రీడాంశాలను ఈ క్రీడల్లో చేర్చనున్నట్టు కామన్వెల్త్ క్రీడల బోర్డు వెల్లడించింది. అథ్లెటిక్స్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, లాన్స్‌బౌల్స్, వెయిట్‌లిఫ్టింగ్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్, నెట్‌బాల్, బాక్సింగ్ క్రీడలను ఇప్పటికే ఖరారు చేశామనీ.. ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, టీ20 క్రికెట్, బీచ్ వాలీబాల్, సైక్లింగ్, హాకీ, జూడో, షూటింగ్, స్క్వాష్, రెజ్లింగ్, ట్రయథ్లాన్ లాంటి మరికొన్ని క్రీడాంశాలు పరిశీలనలో ఉన్నాయని తెలిపింది. నైజీరియాకు చెందిన అబూజ నగరం కూడా ఈ క్రీడల నిర్వహణ కోసం పోటీపడింది. కానీ, ఎగ్జిక్యూటివ్ బోర్డు పెద్దలంతా అహ్మదాబాద్‌కే ఓటేశారు. 2036 ఒలింపిక్స్ ఆతిథ్యం కోసం భారత్ పోటీపడుతున్న నేపథ్యంలో కామన్వెల్త్ హక్కులు దక్కడం శుభపరిణామం. ఇక.. 2030లో కామన్వెల్త్ క్రీడలు వందేళ్లు పూర్తి చేసుకోనుండడం విశేషం. ఈ మెగా ఈవెంట్‌కు భారత్ వేదికవడం ఇది రెండోసారి. అంతకుముందు 2010లో దేశ రాజధాని ఢిల్లీలో ఈ క్రీడలు జరిగాయి. తొలి కామన్వెల్త్ గేమ్స్‌కు 1930లో కెనడా ఆతిథ్యమిచ్చింది. అహ్మదాబాద్‌కు ఆతిథ్య హక్కులు దక్కడంపై ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ శుభాకాంక్షలు తెలిపారు.

మరో రెండు ఈవెంట్లకు ప్రతిపాదన: అహ్మదాబాద్ నగరం మరో రెండు మెగా ఈవెంట్లకు కూడా వేదికయ్యే అవకాశముందని భారత అధికారులు వెల్లడించారు. 2028లో అండర్-20 వరల్డ్ అథ్లెటిక్స్‌తో పాటు 2031 సీనియర్ ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ల ఆతిథ్యానికి అహ్మదాబాద్ పేరును ప్రతిపాదించామన్నారు.





చరిత్ర ఎరుగని చెత్తాట

రెండో టెస్ట్‌లో 408 పరుగులతో భారత్ చిత్తు

- హార్మర్‌కు దాసోహం
- దక్షిణాఫ్రికా ఘన విజయం
- 2–0తో సిరీస్ క్లీన్ స్వీప్

హార్మర్ దెబ్బకు టీమిండియా హాహాకారాలు చేసింది. స్పిన్‌ను ఎలా ఆడాలో కూడా అర్థం కానట్టుగా.. మన బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టడంతో.. రెండో టెస్ట్‌లో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ చిత్తయింది. భారత గడ్డపై కనీసం సిరీస్ డ్రా చేసుకొంటే చాలనుకున్న సఫారీలు.. 2-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి సరికొత్త రికార్డు సృష్టించారు.

గువాహటి: లాంఛనం ముగిసింది! చరిత్రలో లేని రీతిలో భారత జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. సైమన్ హార్మర్ (6/37) సుడులు తిరిగే బంతులకు దిమ్మ తిరిగిన టీమిండియా బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టడంతో.. దక్షిణాఫ్రికాతో రెండో టెస్ట్‌లో భారత్ 408 పరుగుల తేడాతో భారీ ఓటమిని చవిచూసింది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో 0-2తో వైట్‌వాష్‌కు గురైంది. కోచ్ గంభీర్ హయాంలో గత 13 నెలల్లో స్వదేశంలో భారత్ క్లీన్‌స్వీప్ కావడం ఇది రెండోసారి. ఇక గత 25 ఏళ్లలో భారత గడ్డపై సఫారీలకు ఇది తొలి సిరీస్ విజయం. నాలుగో ఇన్నింగ్స్‌లో 549 పరుగుల లక్ష్యం దాదాపు అసాధ్యమే. కానీ, టీమిండియా బ్యాటర్లు తుదికంటా పోరాడి కనీసం డ్రాతోనైనా పరువు నిలుపుతారని అభిమానులు ఆశించారు. ఆ ఆశల్ని మన బ్యాటర్లు అడియాశలు చేశారు. ఆటకు ఐదో, ఆఖరి రోజైన బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 27/2తో రెండు ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 140 పరుగులకే కుప్పకూలింది. రవీంద్ర జడేజా (54) మినహా ఎవరూ కనీసం రెండు పదులు స్కోరు చేయలేక పోయాడు. కేశవ్ మహరాజ్ రెండు వికెట్లు పడగొట్టాడు. దక్షిణాఫ్రికా 489, 260/5 డిక్లేర్ చేయగా.. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 201 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా మార్కో యాన్సెన్, 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా హార్మర్ నిలిచారు.

వేటాడిన హార్మర్: పిచ్ నుంచి లభిస్తున్న సహకారంతో హార్మర్ చెలరేగడంతో.. రెండు సెషన్లు కూడా ముగియకుండానే టీమిండియా చాపచుట్టేసింది. లోబౌన్స్ బంతితో నైట్ వాచ్‌మన్ కుల్దీప్ (5)ను బౌల్డ్ చేసిన హార్మర్.. ఆ వెంటనే ధ్రువ్ జురెల్ (2)ను క్యాచవుట్ చేశాడు. అయితే, వన్‌డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్ (14), కెప్టెన్ రిషభ్ పంత్ (13) ఆదుకొంటారని భావించారు. అయితే, పంత్‌ను కూడా హార్మర్ కుదురుకోనీయలేదు. కానీ, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన జడేజా ఆచితూచి ఆడడంతో టీ సమయానికి భారత్ 90/5తో నిలిచింది. తిరిగి వచ్చిన తర్వాత సుదర్శన్‌ను ముత్తుసామి వెనక్కిపంపాడు. ఈ దశలో జడ్డూ, సుందర్ (16) ఏడో వికెట్‌కు 35 పరుగుల భాగస్వామ్యంతో పోరాడే ప్రయత్నం చేశారు. కానీ, సుందర్, నితీశ్ కుమార్ (0)ను హార్మర్ తన వరుస ఓవర్లలో వెనక్కిపంపాడు. హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్న జడేజాతోపాటు సిరాజ్ (0)ను కేశవ్ అవుట్ చేయడంతో టీమిండియా కథ ముగిసింది. సిరాజ్‌ను అవుట్ చేసిన యాన్సెన్ క్యాచ్ అద్భుతమనే చెప్పాలి. బౌండరీలైన్ వద్ద ఒంటిచేత్తో ఆ క్యాచ్‌ను పట్టిన తీరుకు సిరాజ్‌తోపాటు బవుమా కూడా ఆశ్చర్య పోయారు.



ప్లేయర్ ఆఫ్ ది సిరీస్
సైమన్ హార్మర్
(6/37)

స్కోరు బోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 489; భారత్ తొలి ఇన్నింగ్స్: 201; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 260/5 డిక్లేర్;

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 13, రాహుల్ (బి) హార్మర్ 6, సాయి సుదర్శన్ (సి) మార్‌క్రమ్ (బి) ముత్తుసామి 14, కుల్దీప్ (బి) హార్మర్ 5, జురెల్ (సి) మార్‌క్రమ్ (బి) హార్మర్ 2, పంత్ (సి) మార్‌క్రమ్ (బి) హార్మర్ 13, జడేజా (స్టంప్డ్) వెరీన్ (బి) కేశవ్ 54, సుందర్ (సి) మార్‌క్రమ్ (బి) హార్మర్ 16, నితీశ్ (సి) వెరీన్ (బి) హార్మర్ 0, బుమ్రా (నాటౌట్) 0, సిరాజ్ (సి) యాన్సెన్ (బి) కేశవ్ 0; ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 63.5 ఓవర్లలో 140 ఆలౌట్; వికెట్ల పతనం: 1-17, 2-21, 3-40, 4-42, 5-58, 6-95, 7-130, 8-138, 9-140; బౌలింగ్: యాన్సెన్ 15-7-23-1, ముల్డర్ 4-1-6-0, హార్మర్ 23-6-37-6, కేశవ్ 12.5-1-37-2, మార్‌క్రమ్ 2-0-2-0, ముత్తుసామి 7-1-21-1.



ఇంకో మెట్టు కిందకు..

'డబ్ల్యూటీసీ'లో భారత్‌కు ఐదోస్థానం

దక్షిణాఫ్రికాతో సిరీస్ ఓటమితో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో టీమిండియా నాలుగు నుంచి ఐదో స్థానానికి దిగజారింది. ఈ సైకిల్‌లో 9 టెస్ట్‌లు ఆడిన భారత్ 48.15 విజయాల శాతంతో.. పాకిస్థాన్ (50 శాతం) తర్వాతి స్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, శ్రీలంక మొదటి మూడుస్థానాల్లో ఉన్నాయి.

- *భారత్ గడ్డపై అత్యధికంగా 27 వికెట్లు పడగొట్టిన దక్షిణాఫ్రికా బౌలర్ హార్మర్. డేల్ స్టెయిన్ (26 వికెట్లు)ను హార్మర్ అధిగమించాడు.*
- *ఒక టెస్ట్ మ్యాచ్‌లో అత్యధికంగా 9 క్యాచ్‌లు అందుకొన్న ఫీల్డర్‌గా మార్‌క్రమ్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఈ క్రమంలో రహానె 8 క్యాచ్‌ల రికార్డును తిరగ రాశాడు.*
- *పరుగుల పరంగా భారత జట్టు చరిత్రలో ఇది అత్యంత ఘోర పరాజయం. 2004లో నాగ్‌పూర్ టెస్ట్‌లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ 342 రన్స్ తేడాతో ఓటమి అతి పెద్దది. ఇప్పుడు దక్షిణాఫ్రికా చేతిలో 408 పరుగుల తేడాతో పరాజయం పాలైంది.*

'పోల్' ఆటగాడి ప్రాణం తీసింది!

రోహ్‌తక్ (హరియాణా): తాను రోజూ సాధన చేసే బాస్కెట్‌బాల్ కోర్టు.. అందులోని బాస్కెట్‌బాల్ పోల్ ఆ జాతీయస్థాయి క్రీడాకారుడికి మరణ శాసనమైంది. హార్దిక్ రథి (16) రోజుమాదిరే ఇక్కడి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బాస్కెట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. బంతిని బాస్కెట్‌లో వేసే సాధన క్రమంలో తుప్పు పట్టిన బాస్కెట్‌బాల్ పోల్ అతడిపై పడింది. గమనించిన సహచర ఆటగాళ్లు పరుగునవచ్చి పోల్‌ను పక్కకుతీసి హార్దిక్‌ను రక్షించే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయాడు.

అజ్లాన్ షా హాకీలో మలేసియాపై భారత్ గెలుపు

ఇపో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత్ ఆతిథ్య మలేసియాను 4-3తో చిత్తు చేసింది. భారత్ తరఫున సెల్వమ్ (7వ), సుఖ్‌జీత్ (21వ), రోహిదాస్ (39వ), సంజయ్ (53) గోల్స్ చేశారు. టోర్నీలో భారత్ తర్వాతి మ్యాచ్‌ను న్యూజిలాండ్‌తో గురువారం ఆడనుంది.

గంభీర్ ఇప్పుడేమంటావ్?



అద్భుతమేమీ జరగలేదు. అసలు రెండో టెస్ట్‌లో మన ప్రధాన బ్యాటర్ల ఆట తీరు చూస్తే అద్భుతమన్న పదమే అత్యాశ అవుతుంది! భారత టెస్టు చరిత్రలోనే అత్యంత చెత్త ప్రదర్శనను కనబరచిన మన ఆటగాళ్లకు అసలేమైంది. గత జూన్-జులైలో ఇంగ్లండ్ పర్యటనలో కఠినమైన సిరీస్‌ను డ్రా చేయడం ద్వారా కొత్త కెప్టెన్ గిల్ ఆధ్వర్యంలోని జట్టు శభాష్ అనిపించుకుంది. మరిప్పుడు పరిస్థితి ఎందుకు తారుమారైంది. ఇంగ్లండ్ టూర్ తర్వాత మన దేశంలో బలహీన వెస్టిండీస్‌తో జరిగిన రెండు టెస్ట్‌ల సిరీస్‌ను టీమిండియా 2-0తో దక్కించుకుంది. కానీ బలమైన జట్టు ఎదురుపడేసరికి స్వదేశంలోనూ మనోళ్లు చేతులెత్తేస్తున్నారు.

గురువు బాధ్యత తీసుకుంటాడా ?

కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టాక భారత జట్టు అద్భుతాలు చేయలేదు సరికదా.. స్వదేశంలో గత నవంబరులో న్యూజిలాండ్ చేతిలో (0-3), ఇప్పుడు దక్షిణాఫ్రికాపై అవమానకర రీతిలో క్లీన్ స్వీప్‌లు. ఆస్ట్రేలియా గడ్డపై ఆ జట్టు చేతిలో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో 1-3తో పరాజయం. అలాగే 27 ఏళ్ల తర్వాత వన్డేలలో శ్రీలంక చేతిలో టీమిండియా సిరీస్‌ను కోల్పోయింది. గతంలో కిర్‌స్టెన్, కుంబ్లే, రవిశాస్త్రి, ద్రవిడ్‌ల హయాంలో టీమిండియా చక్కని ఫలితాలే రాబట్టింది. నాటి కెప్టెన్ కోహ్లీతో కోచ్ కుంబ్లేకు సరిపడకపోయినా..అది జట్టు ప్రదర్శనపై మాత్రం ప్రభావం చూపలేదు. కానీ గంభీర్ వ్యవహార శైలి భిన్నమైనదని చెబుతారు. సీనియర్లేకాదు..జూనియర్లు కూడా అతడి తీరుపై సంతృప్తిగా లేరన్నది జట్టు వర్గాల సమాచారం. జట్టు ఎంపిక, ఆటగాళ్లను బ్యాటింగ్ ఆర్డర్‌లో పైకి కిందికి మార్చడం తదితర గంభీర్ నిర్ణయాలపై విశ్లేషకులు ఆశ్చర్యం ప్రకటించడం పరిపాటి అయిపోయింది. ఇకపోతే..న్యూజిలాండ్, ఆస్ట్రేలియాపై టెస్ట్ సిరీస్‌ల ఓటముల తర్వాత సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, అశ్విన్ అనూహ్యంగా సుదీర్ఘ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. వారు ముగ్గురికీ కోచ్ గంభీర్ పొమ్మనలేక పొగబెట్టాడన్న విమర్శలు తీవ్ర స్థాయిలో వినిపించాయి. మరి స్వదేశంలో రెండు టెస్ట్ సిరీస్‌ల్లో వైట్‌వాష్‌కు లోనైన నేపథ్యంలో కోచ్‌గా గంభీర్ బాధ్యత తీసుకుంటాడా? అనే చర్చ బయలు దేరింది.

బ్యాటర్లు, బౌలర్ల సమష్టి వైఫల్యం..

ఈ సిరీస్‌లో కోల్‌కతా టెస్ట్‌లో పట్టుబట్టి స్పిన్ వికెట్ తయారు చేయించుకున్న గిల్ సేన భంగపడింది. దాంతో గువాహటి టెస్ట్‌కు అటు బౌలర్లు, బ్యాటర్లకు సమంగా అనుకూలించేలా పిచ్‌ను రూపొందించారు. మరి బ్యాటింగ్‌కు సహకరించిన పిచ్‌పై భారత బ్యాటర్లు ఎందుకు భంగపడ్డారు. ప్రత్యర్థి మిడిల్, టెయిలెండర్ బ్యాటర్లు ధారాళంగా పరుగులు చేసిన వికెట్‌పై కనీసం మన టాప్, మిడిలార్డర్ బ్యాటర్లు ఎందుకు రాణించలేకపోయారు? నిర్లక్ష్యపు షాట్లతో వికెట్లు పారేసుకున్నారు. జట్టు ఇక్కట్లలో ఉన్నప్పుడు బాధ్యత లేకుండా ఆడారు. తొలి ఇన్నింగ్స్‌లో రాణించలేకపోయిన జడేజా...రెండో ఇన్నింగ్స్‌లో ఆకట్టుకున్నాడు. నితీశ్ కుమార్ తన ఎంపికకు ఏమాత్రం న్యాయం చేయలేక పోయాడు. ఇక ఇటీవలి కాలంలో ఆపద్బాంధవుడి పాత్ర పోషిస్తున్న సుందర్ సత్తా చాటబట్టి తొలి ఇన్నింగ్స్‌లో 200 స్కోరైనా సాధ్యమైంది. లేదంటే మనోళ్ల పరిస్థితి మరీ దయనీయంగా ఉండేది. మొదటి ఇన్నింగ్స్‌లో స్పిన్నర్ కుల్దీప్ ఎంతో ఓపికగా (134 బంతులు) ఆడిన తీరు చూస్తే మన ప్రధాన బ్యాటర్ల వైఫల్యం మరింత స్పష్టమవుతుంది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

నా భవిష్యత్ బీసీసీఐ చేతుల్లో..: గంభీర్

సొంతగడ్డపై వరుసగా రెండో వైట్‌వాష్ కావడంతో కోచ్ గంభీర్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే, ఈ దారుణ వైఫల్యానికి తాను సహా అందరూ బాధ్యులేనని గౌతీ అన్నాడు. తన భవిష్యత్‌ను బీసీసీఐ నిర్ణయిస్తుందని చెప్పాడు. 'భారత క్రికెట్ కంటే నాకు ఏదీ ముఖ్యం కాదు. యువ జట్టుతోనే ఇంగ్లండ్‌లో సిరీస్ డ్రా చేసుకొన్నప్పుడు కూడా అక్కడ ఉన్నది నేనే. నా హయాంలోనే చాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ గెలిచారన్న విషయాన్ని గుర్తుంచుకోవాల'ని చెప్పాడు. కివీస్‌తో సిరీస్‌లో ఎంతో అనుభవం ఉన్న రోహిత్, కోహ్లీ జట్టులో ఉన్నారన్న విషయాన్ని గౌతీ నర్మగర్భంగా చెప్పాడు. అయితే, ఇప్పటి టాపార్డర్ బ్యాటర్లు కొందరికి 15 టెస్ట్‌లు ఆడిన అనుభవం కూడా లేదని తెలిపాడు.

19 ఏళ్ల కుర్రాడు.. కప్ కొట్టాడు

చెస్ వరల్డ్ కప్ విజేత సిందరోవ్



పనాజీ: ఉజ్బెకిస్థాన్ చెస్ ఆటగాడు జావోఖిర్ సిందరోవ్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ 19 ఏళ్ల గ్రాండ్‌మాస్టర్ ఫిడే వరల్డ్ కప్‌లో చాంపియన్‌గా నిలిచాడు. ఫైనల్లో సిందరోవ్ 2.5-1.5తో చైనా గ్రాండ్‌మాస్టర్, 26 ఏళ్ల వీ యీని ఓడించాడు. తద్వారా పిన్న వయసులో ఫిడే వరల్డ్ కప్ నెగ్గిన ఆటగాడిగా సిందరోవ్ రికార్డుకెక్కాడు. ఈ ఏడాది మహిళల వరల్డ్ కప్ నెగ్గిన భారత అమ్మాయి దివ్యా దేశ్‌ముఖ్ వయసు కూడా 19 ఏళ్లే కావడం విశేషం.

ఫైనల్ పోరులో భాగంగా తొలి రెండు గేమ్‌లను సిందరోవ్, వీ యీ డ్రాగా ముగించడంతో.. ఫలితం కోసం టైబ్రేక్‌కు వెళ్లారు. బుధవారం జరిగిన టైబ్రేక్ తొలి రౌండ్‌లో వీ యీని డ్రాతో నిలువరించిన సిందరోవ్ రెండో రౌండ్లో విజయం సాధించి టైటిల్ విజేతగా నిలిచాడు. సిందరోవ్‌కు ట్రోఫీతో పాటు రూ. కోటి ప్రైజ్‌మనీ దక్కింది. ఫైనల్ చేరడం ద్వారా వీళ్లిద్దరూ ఇప్పటికే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో భారత్ నుంచి తెలుగు ఆటగాడు అర్జున్ ఇరిగేసి క్వార్టర్‌ఫైనల్లో పరాజయం పాలయ్యాడు.

ఆసియా క్రీడలే తదుపరి లక్ష్యం



ఆర్చర్ జ్యోతి సురేఖ

హైదరాబాద్: ఆసియా క్రీడలే తన తదుపరి లక్ష్యమని స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ తెలిపింది. 2022 ఆసియా క్రీడల కాంపౌండ్ ఆర్చరీలో భారత్ కాంపౌండ్, రికర్వ్ విభాగాలలో కలిపి 5 స్వర్ణాలు సహా మొత్తం 9 పతకాలు సాధించింది. ఇక..తదుపరి ఆసియా క్రీడలు వచ్చే ఏడాది సెప్టెంబరు-అక్టోబరులో జపాన్‌లోని నగోయాలో జరగనున్నాయి. ఆ క్రీడల్లో కూడా మెరుగైన ప్రదర్శన చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు బుధవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో సురేఖ తెలిపింది.

ఆంధ్ర విజయం

లఖ్‌నవూ: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నమెంట్‌లో ఆంధ్ర, హైదరాబాద్ జట్లు విజయం సాధించాయి. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 29 పరుగుల తేడాతో అసోంపై నెగ్గింది. మొదట ఆంధ్ర 20 ఓవర్లలో 9 వికెట్లకు 143 పరుగులు చేసింది. కెప్టెన్ రికీ భుయ్ (46) టాప్‌స్కోరర్. అసోం బౌలర్ ముఖ్తార్ హుస్సేన్ 4 వికెట్లు తీశాడు. ఛేదనలో అసోం 19.4 ఓవర్లలో 114 పరుగులకే ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లలో సత్యనారాయణ రాజు 3, స్టీఫెన్, పృథ్వీరాజ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు.

6,433 మంది బలి

(మొదటి పేజీ తరువాయి)

సచివాలయంలో సీఎం మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా రోడ్డు ప్రమాదాలకు కారణాలు వివరించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 15,462 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 6,433 మంది ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. ద్విచక్ర వాహనాల వల్లే జరుగుతున్నాయని చెప్పారు. కార్లు, బైకుల స్వీయ ప్రమాదాలు 53 శాతం మేర ఉన్నాయని వెల్లడించారు. నెల్లూరు, తిరుపతి, పల్నాడు, అన్నమయ్య, కాకినాడ జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలతో పాటు మరణాల సంఖ్య ఎక్కువగా నమోదవుతోందని వివరించారు. మొత్తం ప్రమాదాల్లో జాతీయ రహదారులపై 42 శాతం, రాష్ట్ర రహదారులపై 21 శాతం జరుగుతున్నాయని, అతివేగం వల్ల 79 శాతం ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ఇటీవల కర్నూలులో జరిగిన ఘోర ప్రమాదం తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా దాడులు నిర్వహించి అనధికారికంగా మార్పులు చేయించిన 134 ఆలిండియా సర్వీసు బస్సుల్ని సీజ్ చేసినట్లు అధికారులు వివరించారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ.. "రోడ్డు ప్రమాదాలు, మరణాలు బాగా తగ్గించాలి. దాని కోసం కఠిన చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమైన అతివేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ గవర్నర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. రవాణేతర వాహనాలపైనా అమలు చేసే అవకాశాన్ని పరిశీలించాలి. జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రతి అర కిలోమీటరుకు ఒక సీసీ కెమెరా ఏర్పాటు చేయాలి. వీటిని ఆర్టీజీఎస్‌తో అనుసంధానం చేసి వాహన ట్రాకింగ్ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలి.

రోడ్లలో లోపాలు సరిదిద్దాలి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 680 బ్లాక్ స్పాట్‌లలో రోడ్ ఇంజనీరింగ్ లోపాలను సరిదిద్దాలి. అత్యవసరంగా ఆ పనులు పూర్తి చేయాలి. ప్రమాద హెచ్చరికల బోర్డులు అవసరమైన చోట ఏర్పాటు చేయాలి. అయినా ఉల్లంఘించే వాహనాన్ని సీజ్ చేయాలి. రోడ్డు ప్రమాదాల్లో దేశంలో ఏపీ ఎనిమిదో స్థానంలో ఉండటం ఆవేదన కలిగించే అంశం. రహదారి భద్రతపై విస్తృత ప్రచారం అవసరం. సెలబ్రిటీలు, ప్రజా ప్రతినిధులతో ట్రాఫిక్ అవగాహన సందేశాలు ఇప్పించాలి. ప్రతి మూడు నెలలకు ఓసారి రాష్ట్ర, జిల్లా స్థాయిలో రోడ్ సేఫ్టీ సమావేశాలు నిర్వహించాలి. ఏటా నవంబరు మూడో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి.

స్లీపర్ బస్సుల్లో ఉల్లంఘనలపై ఉక్కుపాదం

ప్రైవేటు వాహనాల్లో అనధికారిక మార్పులు చేర్పులు చేస్తే కఠినంగా వ్యవహరించండి. ముఖ్యంగా స్లీపర్ బస్సుల్లో ఉల్లంఘనలపై ఉక్కుపాదం మోపాలి. బస్ బిల్డింగ్ కోడ్‌కు విరుద్ధంగా ట్రావెలర్స్ వ్యవహరిస్తే చర్యలు తీసుకోండి. డ్రైవింగ్ నిబంధనలు ఉల్లంఘించే వారిని ముందుగా హెచ్చరించి ఐదో సారి లైసెన్స్ రద్దు చేయండి. డ్రైవర్ల శిక్షణా కేంద్రాలు(ఆదోని, దర్శి) త్వరగా పూర్తి చేయాలి. అంబులెన్స్ సేవలు ఏకీకృతం చేయాలి. ప్రమాద బాధితుల్ని ఆసుపత్రులకు త్వరగా తరలించే వారికి ప్రోత్సాహకాలు అందజేయాలి. రోడ్ సేఫ్టీ యాక్షన్ ప్లాన్ అమలులో భాగంగా పోలీసు, రవాణా, ఇంజనీరింగ్, వైద్య ఆరోగ్యం, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలి" అని సీఎం సూచించారు. ఈ సమీక్షలో రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డితో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్లన్నీ వేగంగా బాగవ్వాలి: సీఎం

గుంతలు లేని రహదారులే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని, ఈ దిశగా ఆర్అండ్‌బీ కార్యాచరణ ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీ రోడ్ లింక్ వ్యవస్థ అమల్లోకి రాకముందే రోడ్లపై గుంతలు యుద్ధప్రాతిపదికన పూడ్చాలని ఆదేశించారు. రోడ్ల ధ్వంసంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన నేపథ్యంలో ఆర్అండ్‌బీతో సీఎం బుధవారం ప్రత్యేకంగా సమీక్షించారు. రహదారుల నిర్మాణం, నిర్వహణ, గుంతలు పూడ్చడం, నాణ్యత పర్యవేక్షణకు ఆర్అండ్‌బీ అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రహదారి పనుల్లో నాణ్యతకు పెద్దపీటవేయాలని, తప్పులు చేసే కాంట్రాక్టర్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇంజనీర్లు జవాబుదారీతనంగా పనిచేయాలన్నారు. రహదారుల నిర్వహణకు డ్రోన్‌లు, డిజిటల్ సర్వే, అవసరమైతే శాటిలైట్ సేవలు ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. జాతీయ రహదారుల నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా చూసుకోవాలన్నారు. కొత్త ప్రాజెక్టులు, ఇప్పటికే అమల్లో ఉన్నవాటికి భూసేకరణ సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. త్వరలో వచ్చే ఏపీ లింక్ వ్యవస్థను ఆర్థికంగా బలోపేతం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లాజిస్టిక్ కార్పొరేషన్‌ను బలోపేతం చేస్తే పెద్దఎత్తున పెట్టుబడులు వస్తాయని, అప్పుడు రహదారుల నెట్‌వర్క్ మరింతగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కాగా, ఆర్అండ్‌బీలో వర్క్‌లు చేస్తున్న కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, స్పెషల్ సీఎస్ కృష్ణబాబు సీఎంను కోరారు. పెండింగ్ బిల్లులను నెలనెలా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు చంద్రబాబు సానుకూలంగా స్పందించారని తెలిసింది. ప్రస్తుతం కాంట్రాక్టర్ల బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో రూ. 299 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంకా అప్‌లోడ్ చేయాల్సిన బిల్లులు రూ. 481 కోట్లు ఉన్నాయని సీఎంకు నివేదించారు.

సెస్సులు వేసి రోడ్లు!

(మొదటి పేజీ తరువాయి)

ఏటా రూ.441 కోట్లు ఆదాయం లభిస్తుందని తేల్చారు. మోటార్ వెహికల్ ట్యాక్స్‌పై 10 శాతం సెస్సు విధించడం ద్వారా ఏటా కనీసం 350 కోట్లు రాబట్టాలని ప్రతిపాదించారు. ఓడ రేవులకు వచ్చే కార్గోపైనా, రిజిస్ట్రేషన్ చార్జీలపైనా 'రోడ్డు సెస్సు' విధించాలని ఆర్అండ్‌బీ ప్రతిపాదించింది.

ఏటా రూ.375 కోట్ల టోల్ వసూలు...

హైబ్రిడ్ రోడ్లపై టోల్‌గేట్ల ద్వారా ఏటా రూ.375 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇది అంతకంటే పెరగొచ్చు కూడా. ఈ మొత్తాన్ని కాంట్రాక్టు సంస్థ వసూలు చేసుకుంటుందని ఆర్అండ్‌బీ పేర్కొంది. రహదారుల నిర్మాణం పూర్తయి మూడేళ్లలో అందుబాటులోకి వస్తాయని భావిస్తోంది. అయితే... కేవలం 1500 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం కోసం మొత్తంగా రూ.22వేల కోట్లు వ్యయం చేయడం, ప్రజల నుంచి సెస్సు వసూలు చేయాలని ప్రతిపాదించడం, టోల్‌గేట్లు పెట్టడం వంటి ప్రతిపాదనలపై అధికార వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ప్రజల నుంచి సెస్సులు వసూలు చేస్తూ... మళ్లీ టోల్ వసూలు చేయాలన్న ప్రతిపాదనల్లో హేతుబద్ధత లేదని పేర్కొంటున్నారు. హైబ్రిడ్ ప్రాజెక్టులో ప్రభుత్వం, ప్రజలపై భారం ఉండకూడదని... ఈ ప్రాజెక్టు మాత్రం అందుకు భిన్నంగా ఉందని ఒక సీనియర్ అధికారి పేర్కొన్నారు. గతంలో జగన్ హయాంలో రాష్ట్ర రహదారులపై టోల్ వసూలు చేయాలని ప్రతిపాదించారు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఇప్పుడు... ఆర్అండ్‌బీ చేసిన ప్రతిపాదనలపై కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

రేషన్ షాపులు.. ఇక విలేజ్ మాల్స్!

- కార్డుదారులకు చౌకగా మరిన్ని సరుకులు, డీలర్లకు ఆదాయం ఉండేలా రీ మోడలింగ్
- మార్కెట్ ధర కంటే తక్కువకు నిత్యావసర వస్తువులు
- డీలర్లతో పౌర సరఫరాల అధికారుల చర్చలు

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపులను విలేజ్ మాల్స్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ప్రతినెలా పేదలకు అందిస్తున్న రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయడంతోపాటు ఇతర నిత్యావసర వస్తువులను కూడా రేషన్ షాపులలో సరసమైన ధరలకు విక్రయించాలని భావిస్తోంది. దీనివల్ల డీలర్లకు అదనపు ఆదాయం చేకూరడంతోపాటు కార్డుదారులకు కూడా తక్కువ ధరలకు నిత్యావసర సరుకులు అందుబాటులోకి వచ్చి, వారికి ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని భావిస్తోంది. ఇందులో భాగంగా విలేజ్ మాల్స్ విధానాన్ని తీసుకురానుంది. రాష్ట్రంలోని సుమారు 30 వేల రేషన్ షాపులను మినీ మాల్స్‌గా మారుస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ ఇప్పటికే ప్రకటించారు. దీనిపై బుధవారం రేషన్ డీలర్ల సంఘాల ప్రతినిధులతో పౌర సరఫరాల శాఖ డైరెక్టరు, ఇతర ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. రేషన్ షాపులను 'చంద్రన్న విలేజ్ మాల్స్'గా అభివృద్ధి చేసే ప్రతిపాదనపై డీలర్ల అభిప్రాయాలు కోరారు. ఈ సమయంలో డీలర్ల సంఘ ప్రతినిధులు పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతమున్న రేషన్ షాపులను రీ మోడలింగ్ చేయాలని, సూపర్ మార్కెట్ల తరహాలో అందంగా తీర్చిదిద్దాలని ఒత్తిడి తీసుకువస్తే తామేం చేయలేమని స్పష్టంచేశారు. ప్రస్తుతం ఉన్న షాపుల్లోనే నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తామని చెప్పారు. రేషన్ షాపులలో విక్రయించే వస్తువుల ధరలు బహిరంగ మార్కెట్, డీ-మార్ట్ తదితర మాల్స్‌లో కంటే తక్కువగా ఉండేలా చూడాలని కోరారు. విలేజ్ మాల్స్ నిర్వహణ కోసం ప్రభుత్వమే బ్యాంకులతో చర్చలు జరిపి రుణాలు ఇప్పించాలన్నారు. రేషన్ షాపుల ద్వారా విక్రయించే నిత్యావసరాల్లో పప్పు దినుసులు, ఉప్పు, నూనెలు, గోధుమపిండి, రవ్వ తదితర పది, పదిహేను వస్తువులు ఉంటే సరిపోతుందని, సూపర్ మార్కెట్లలో మాదిరిగా అన్ని రకాల వస్తువులను ఉంచాలంటే ఇబ్బందికరంగా ఉంటుందని డీలర్ల ప్రతినిధులు తెలిపారు. ఈ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న అధికారులు, వాటిని ప్రభుత్వానికి నివేదిక రూపంలో సమర్పించనున్నారు. ఇదిలా ఉండగా.. కార్డుదారులకు ప్రస్తుతం ఇస్తున్న రేషన్ బియ్యం, పంచదారతోపాటు రాగులు, జొన్నలు, కొర్రలు వంటి తృణ ధాన్యాలను కూడా దశలవారీగా ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.



సరికొత్త పాత్రలో బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఎన్‌బీకే 111' అనేది వర్కింగ్ టైటిల్. బుధవారం ఈ సినిమాను పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు బీగోపాల్ క్లాప్ కొట్టారు. బాలకృష్ణ కూతురు తేజస్విని కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకులు బోయపాటి శ్రీను, బాబీ, బుచ్చిబాబు సానా గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా ఓ పోస్టర్‌ను షేర్ చేశారు. రాజసం ఉట్టిపడేలా శక్తిమంత మైన లుక్‌లో ఓ వైపు, మెడలో రుద్రాక్షమాల ధరించి మరోవైపు.. రెండు విభిన్న లుక్స్‌లో కనిపించారు బాలకృష్ణ. చారిత్రక నేపథ్యంలో సాగే ఈ సినిమాలో ఆయన ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రేక్షకులు మునుపెన్నడూ చూడని సరికొత్త పాత్రలో ఆయనను చూపించబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. హృదయానికి హత్తుకునే భావోద్వేగాలు, సరికొత్త అనుభూతినిచ్చే సన్నివేశాలు, థ్రిల్‌ను పంచే పోరాటఘట్టాలు, అద్భుతమైన విజువల్స్‌తో సినిమాను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. 'సింహా', 'జై సింహా', 'శ్రీరామ రాజ్యం' సినిమాల తర్వాత బాలకృష్ణతో కలసి ఆమె నటిస్తున్న నాలుగో చిత్రమిది. థమన్ సంగీతం అందిస్తున్నారు. బాలయ్య, గోపీచంద్ మలినేని కాంబోలో 2023లో విడుదలైన 'వీర సింహారెడ్డి' మంచి విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే.



నిర్మాత సీహెచ్‌ఆర్‌బీ చౌదరి కన్నుమూత

టాలీవుడ్ నిర్మాత సీహెచ్‌ఆర్‌బీ చౌదరి(55) బుధవారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన పూర్తి పేరు చలసాని రామబ్రహ్మం చౌదరి. జేడీ చక్రవర్తి హీరోగా 'నేను ప్రేమిస్తున్నాను', రాజశేఖర్‌తో 'నేటి గాంధీ' అల్లరి నరేశ్‌తో 'సెల్ఫీరాజా' చిత్రాలను నిర్మించారు. ఆయన తండ్రి చలసాని గోపి, మావయ్య టీ త్రివిక్రమరావు కూడా విజయవంతమైన చిత్ర నిర్మాతలే. చౌదరి స్వగ్రామం కృష్ణా జిల్లాలోని పెదమద్దాలిలో నేడు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రివాల్వర్ రీటాగా గుర్తుండిపోతాను



కీర్తిసురేశ్

ఇప్పటివరకూ డార్క్ కామెడీ నేపథ్యంలో చాలా చిత్రాలు వచ్చాయి. అవన్నీ హీరో పాత్ర చుట్టూ అల్లుకున్న కథలు. కానీ 'రివాల్వర్ రీటా' మాత్రం హీరోయిన్ ఓరియంటెడ్ కథతో రూపుదిద్దుకున్న డార్క్ కామెడీ చిత్రం. ఇకపై ప్రేక్షకులకు రివాల్వర్ రీటాగా గుర్తుండిపోతాను' అని హీరోయిన్ కీర్తిసురేశ్ అన్నారు. జేకే చంద్రు దర్శకత్వంలో ఆమె టైటిల్ రోల్ పోషించిన చిత్రమిది. సుధన్ సుందరం, జగదీశ్ పళని సామి నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం బుధవారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కీర్తిసురేశ్ మాట్లాడుతూ 'ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా ఈ చిత్రం ఉంటుంది. నన్ను రీటా పాత్రలో అద్భుతంగా చూపించిన చంద్రుకు ధన్యవాదాలు. పక్కా కమర్షియల్ హంగులతో ఈ సినిమా తీశారు. అజయ్, సునీల్, రాధిక గారి అభినయం ప్రధానాకర్షణగా నిలుస్తుంది' అని అన్నారు. డిస్ట్రిబ్యూటర్ కుమార్ మాట్లాడుతూ 'సినిమా ఎక్స్‌ట్రార్డినరీగా వచ్చింది. నాకు నచ్చి, తెలుగు, కన్నడ భాషల్లో పంపిణీ చేస్తున్నాను. కీర్తి గారు ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. పాత్రలోకి పరకాయ ప్రవేశం చేశారు. దర్శకుడు ప్రతి విషయాన్ని సునిశితంగా పరిశీలించి సినిమాను తెరకెక్కించారు' అని తెలిపారు. అద్భుతమైన కథతో తెరకెక్కిన చిత్రమిది, కీర్తిసురేశ్ గారితో కలసి నటించినందుకు ఆనందంగా ఉంది అని అజయ్ ఘోష్ తెలిపారు.



ప్రేక్షకులను అలరించేలా..

నటుడు, నిర్మాత డీఎస్‌ఆర్ తనయుడు సాయికృష్ణ దమ్మలపాటి హీరోగా పరిచయమౌతున్న చిత్రం 'పదహారు రోజుల పండగ'. సాయికిరణ్ అడివి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రదా పిక్చర్స్, సాయి సినీ చిత్ర బేనర్‌పై సురేశ్‌కుమార్ దేవత, హరిత దుద్దుకూరు, ప్రతిభ అడివి నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమాను ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు శేఖర్ కమ్ముల క్లాప్ కొట్టగా, నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. నిర్మాత సురేశ్‌బాబు గౌరవ దర్శకత్వం వహించారు. రచయిత కోనవెంకట్, నిర్మాత కేకే రాధామోహన్ నిర్మాతలకి స్క్రిప్ట్ అందించారు. ఈ సందర్భంగా నిర్మాత సురేశ్‌కుమార్ మాట్లాడుతూ 'ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది. సరికొత్త కథతో వినోదం, భావోద్వేగాలు కలగలిసి ఉంటాయి' అని అన్నారు. సాయికృష్ణ మాట్లాడుతూ 'మంచి చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతున్నందుకు ఆనందంగా ఉంది. సినిమా ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు. సాయికిరణ్ అడివి మాట్లాడుతూ 'ఈ సినిమా ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని ఇస్తుంది. సాయికృష్ణకు పరిశ్రమలో మంచి భవిష్యత్తు ఉంది' అని అన్నారు. ఈ చిత్రంలో గోపిక ఉదయన్ కథానాయిక. వెన్నెల కిశోర్, రేణూ దేశాయ్, అనసూయ భరద్వాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఆత్మీయ అనుబంధం ఏర్పడింది



"ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రం కోసం మేము కంపోజ్ చేసిన ట్యూన్‌కు తగినట్లు రామ్ 'నువ్వుంటే చాలు' అనే అద్భుతమైన పాట రాశారు. సంగీత దర్శకులుగా మమ్మల్ని తెలుగు ప్రేక్షకులకు చేరువ చేసిన ఆ పాటతో మాకు ఒక ఆత్మీయ అనుబంధం ఏర్పడింది' అని వివేక్, మెర్విన్ చెప్పారు. మహేశ్ బాబు పి. దర్శకత్వంలో రామ్ కథానాయకుడిగా నటించిన 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంగీత దర్శకులు వివేక్, మెర్విన్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'తమిళంలో సంగీత దర్శకులుగా ఇరవై చిత్రాలకు పనిచేశాం. 'ఆంధ్ర కింగ్ తాలూకా' తెలుగులో మాకు మొదటి సినిమా. హీరో రామ్ గారు పిలిచి అవకాశమివ్వడంతో ఈ సినిమాకు సంగీత దర్శకులుగా పనిచేశాం. ఇందులో ప్రతి పాటా విజువల్‌గా స్టన్నింగ్‌గా ఉంటుంది' అని వివేక్ చెప్పారు. 'ఈ చిత్రం నుంచి నాలుగు పాటలను విడుదల చేశాం. అన్నింటికీ ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. కథలో కీలకమైన మూడు పాటలను సినిమా రిలీజయ్యాక విడుదల చేస్తాం. ప్రేక్షకులు ఈ పాటలన్నింటినీ థియేటర్లలో ఎంజాయ్ చేస్తారు. నేపథ్య సంగీతం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది' అని మెర్విన్ తెలిపారు.

దర్శకుడు సంపత్ నందికి పితృవియోగం



దర్శకుడు సంపత్ నంది ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి కిష్టయ్య (73) కన్నుమూశారు. మంగళవారం రాత్రి కిష్టయ్య తన నివాసంలో తుది శ్వాస విడిచారు. తండ్రిని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు సంపత్ నంది. 'నాన్న.. ఇకపై నువ్వు లేకుండానే ఉండాలి. చిన్నప్పుడు నా ఆరోగ్యం బాగాలేకపోతే ఆయుర్వేద వైద్యం కోసం నీ భుజాల మీద 10 కిలోమీటర్లు మోసుకెళ్లిన సంఘటన మొన్నే కదా జరిగింది అని అనిపిస్తోంది. నన్ను దగ్గరుండి 'ఖైదీ' సినిమాకు తీసుకెళ్లింది నిన్ననే కదా అని అనిపిస్తోంది. ఏ సినీ అభిమాని ఇంటికొచ్చినా మా వాడి దగ్గరకు వెళ్లు అని నా ఫోన్ నంబర్ ఇచ్చి ప్రోత్సహించడం.. ఇకపై ఇవన్నీ జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. ఇప్పటివరకూ నేను తీసిన సినిమాలు తప్పితే, మిగతా ఏ సినిమాలు థియేటర్లో చూడని నీ ప్రేమ నాకు మళ్లీ కావాలి' అని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★


'రామాయణ' ప్రపంచానికే ప్రామాణికంగా ఉంటుంది

నితీశ్ తివారీ



దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో 'రామాయణ' చిత్రం రెండు భాగాలుగా రూపుదిద్దుకుంటున్న విషయం విదితమే. రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్నారు. ఇందులో రావణుడి పాత్ర పోషిస్తూ, చిత్ర నిర్మాణంలో కూడా భాగస్వామి అయ్యారు కన్నడ హీరో యశ్. వచ్చే ఏడాది డిసెంబర్‌లో 'రామాయణ' చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర దర్శకుడు నితీశ్ తివారీ ఓ ఆంగ్ల మీడియా సంస్థకు ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికరమైన అంశాలు వెల్లడించారు. ఓ దృశ్య కావ్యంలా, విజువల్ వండర్‌గా 'రామాయణ'ను రూపొందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 'కొన్ని కథలు ఎన్ని సార్లు విన్నా కొత్తగానే ఉంటాయి. అలాగే రామాయణం కూడా. ఈ సినిమాలో విఎఫ్ఎక్స్ కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. విజువల్స్ చాలా బాగుంటాయి. అతిశయోక్తి కాదు కానీ 'రామాయణ' మొత్తం ప్రపంచానికే ఓ ప్రామాణికంగా ఉంటుంది. ఓ తపస్సులా, యజ్ఞంలా ఐదేళ్ల నుంచి ఈ సినిమా కోసం పని చేస్తున్నాం. ప్రపంచంలోనే గొప్ప వీఎఫ్ఎక్స్ స్టూడియోల్లో ఒకటైన ప్రైమ్ ఫోకస్‌తో కలసి పని చేయడం ఆనందంగా ఉంది. ఇంత అద్భుతమైన చిత్రానికి నేను దర్శకత్వం వహిస్తున్నాను అని గర్వంగా చెప్పడానికి నాకు రెండేళ్లు పట్టింది. చిత్రం మీద పూర్తి నమ్మకంతో ఉన్నానిప్పుడు.. వచ్చే ఏడాది దాదాపు ఇదే సమయానికి విడుదలయ్యే 'రామాయణ' చిత్రం తొలి భాగానికి ప్రేక్షకుల స్పందన ఎలా ఉంటుందా అని కొంత టెన్షన్‌గా ఉంది' అన్నారు నితీశ్ తివారీ.

అరుదైన రికార్డు సాధించిన హనుమాన్ చాలీసా



భక్తి గీతం 'హనుమాన్ చాలీసా' ఓ అరుదైన ఘనత సాధించింది. యూట్యూబ్‌లో 500 కోట్ల వ్యూస్ వచ్చిన తొలి భారతీయ వీడియోగా రికార్డు సృష్టించింది. టీ-సిరీస్ సంస్థ 2011లో తమ యూట్యూబ్ ఛానల్లో ఈ గీతాన్ని అప్‌లోడ్ చేసింది. టీ- సిరీస్ వ్యవస్థాపకుడు గుల్షన్ కుమార్ ఈ గీతంలో నటించారు. హరిహరన్ ఈ గీతాన్ని ఆలపించగా, లలిత్ సేన్ సంగీతం అందించారు. టీ- సిరీస్ ఎండీ భూషణ్ కుమార్ ఈ వీడియో సాధించిన రికార్డుపై స్పందించి, ఆనందం వ్యక్తం చేశారు.

లోకేశ్‌తో ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ రామ్‌లాల్‌జీ భేటీ



అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) అఖిల భారతీయ సంపర్క్ ప్రముఖ్ రామ్‌లాల్‌జీ మంత్రి లోకేశ్‌తో భేటీ అయ్యారు. ఉండవల్లిలోని మంత్రి నివాసానికి బుధవారం రామ్‌లాల్‌జీ విచ్చేశారు. ఆయనకు లోకేశ్ స్వాగతం పలికారు. 2006 నుంచి 2019 వరకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, ఆర్‌ఎస్‌ఎస్‌లో వివిధ ఉన్నత హోదాల్లో పనిచేసిన రామ్‌లాల్‌జీ ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశ వ్యాప్తంగా వివిధ రంగాల ప్రముఖులతో సమావేశమవుతున్నారు. అందులో భాగంగా లోకేశ్‌తోపాటు పలువురు మంత్రులతోనూ భేటీ అయ్యారు. ఆయనను మంగళగిరి శాలువాతో లోకేశ్ సత్కరించారు. బాలల రాజ్యాంగ పుస్తకాన్ని బహూకరించారు. కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎన్‌ఎండీ ఫరూక్, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, ఎస్.సవిత, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రాంప్రసాద్, డోలా బాలవీరాంజనేయ స్వామి, ఆనం రాంనారాయణ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, కొలుసు పార్థసారధి, వాసంశెట్టి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

నీలం సాహ్నిని కొనసాగించడంపై హైకోర్టులో పిల్

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఐఏఎస్ అధికారిణి నీలం సాహ్నిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్(ఎస్‌ఈసీ)గా కొనసాగించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి, నీలం సాహ్నికి బుధవారం నోటీసులు జారీ చేసింది. గుంటూరుకు చెందిన పిడికిటి వెంకట మల్లికార్జునరావు ఈ పిల్ దాఖలు చేశారు. 65ఏళ్లు పైబడినా కూడా ఎస్‌ఈసీగా కొనసాగడం రాజ్యాంగంలోని అధికరణ 14, 243(కె)లను ఉల్లంఘించడమేనని అందులో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి స్పందిస్తూ పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తామన్నారు.

ఈ-స్టాంప్ కేసుల పురోగతిపై నివేదిక ఇవ్వండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈ-స్టాంప్ అక్రమాల విషయంలో అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిపై స్థాయీ నివేదికలను తమ ముందు ఉంచాలని పోలీసులను హైకోర్టు బుధవారం ఆదేశించింది. ఈ-స్టాంప్ అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలన్న పిటిషనర్ అభ్యర్థనపై ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేమంది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న కల్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే సురేంద్రబాబు తదితరులకు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

పోలీసు శాఖలో ఖాళీలు భర్తీ చేయండి

- సీఎస్‌కు హైకోర్టు ఆదేశం.. విచారణ 6 వారాలకు వాయిదా

పోలీస్‌శాఖలో వివిధ కేడర్ల కింద ఖాళీగా ఉన్న 11,639 పోస్టుల భర్తీకి డీజీపీ చేసిన ప్రతిపాదనపై తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర సీఎస్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణలో నివేదికను తమ ముందు ఉంచాలని నిర్దేశించింది. విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. పోలీస్‌శాఖలో ఖాళీలను భర్తీ చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కీతినీడి అఖిల్ శ్రీగురుతేజ 2024లో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. బుధవారం మరోసారి ఆ పిల్ విచారణకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎస్‌జీపీ ప్రణతి వాదనలు వినిపించారు.

మా నీళ్లను లాక్కుపోతే..

మేం అడుక్కు తినాలా?

వందేళ్ల నాటి కేటాయింపులను ఎలా కుదిస్తారు?.. కృష్ణా ట్రిబ్యునల్-2లో నిలదీసిన ఆంధ్రప్రదేశ్

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వందేళ్ల కిందట కేటాయించిన నీటిని లాక్కుంటే తాము అడుక్కుతినాలా అని ఆంధ్రప్రదేశ్ నిలదీసింది. కృష్ణా జలాల పునఃసమీక్షపై జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ సారథ్యంలోని కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్-2 విచారణలో రెండో రోజు బుధవారం కూడా ఏపీ తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా గట్టిగా వాదనలు వినిపించారు. నీటి కేటాయింపులపై కృష్ణా ట్రిబ్యునల్ -1, ట్రిబ్యునల్-2 ఇచ్చిన ఆదేశాలను మార్చేందుకు ఆస్కారమే లేదన్నారు. 'రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్‌కు వ్యవసాయమే ఆధారంగా మారింది. తెలంగాణ ఇటు నదీ జలాల విషయంలోనూ, ఆర్థికంగానూ సంపూర్ణ పరిపుష్టి కలిగి ఉంది. ఆ రాష్ట్రానికి రాజధాని హైదరాబాద్, ప్రపంచశ్రేణి ఐటీ కంపెనీలు ఉన్నాయి. హైదరాబాద్ సహా తెలంగాణ జిల్లాలన్నింటిలోనూ వ్యవసాయంతో సహా పరిశ్రమలూ ఉండడంతో ఆర్థికంగా బలోపేతమవుతోంది. కానీ ఏపీకి రాజధానీ లేదు. పరిశ్రమలు కూడా లేవు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో మాకు ఉన్న నీటి కేటాయింపులను కూడా కుదిస్తే ఆర్థికంగా సంక్షోభంలోకి వెళ్లిపోతాం' అని వివరించారు. తెలంగాణకు ఇలాంటి ఇబ్బందులేవీ లేవన్నారు. కృష్ణా జలాల గురించి మాట్లాడుతున్న ఆ రాష్ట్రం.. గోదావరి జలాల గురించి దాస్తోందన్నారు. రెండు నదుల జలాలను కలిపి చూస్తే తెలంగాణకు నీటికి లోటే లేదన్నారు.

కేటాయింపులను పునఃసమీక్షించరాదు

రాష్ట్ర విభజన జరిగాక చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులకు ట్రిబ్యునళ్లు కేటాయించిన నీటిని పునఃసమీక్షించేందుకు వీల్లేదని గుప్తా తెలిపారు. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో గత కేటాయింపులను మార్చేందుకు వీల్లేదని చెప్పారు. 'సాగర్ జలాలు పూర్తిగా వ్యవసాయానికే వినియోగించాల్సి ఉంది. రాష్ట్ర విభజనకు ముందు హైదరాబాద్‌లో గ్లోబల్ ఐటీ సంస్థలన్నీ పెట్టుబడులు పెట్టాయి. ఆర్థికంగా సుసంపన్నమైన హైదరాబాద్ రాజధానిగా తెలంగాణలోనే ఉంది. ఏపీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో రాజధానిని నిర్మించుకోలేకపోయింది. పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి మాది. ఆర్థిక లోటుతో ఉంది. అందువల్ల గతంలో ట్రిబ్యునళ్లు ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు కేటాయించిన నీటిలో కోత పెట్టడానికి ఏమాత్రం వీల్లేదు. రాష్ట్రంలో 150 ఏళ్ల కిందటే సాగునీటి పారుదల విధానాలను నిర్దేశించారు' అని వెల్లడించారు. రాష్ట్ర విభజనకు ముందున్న ఉమ్మడి రిజర్వాయర్లకు కేటాయింపులు కుదించేందుకు వీల్లేదని పునరుద్ఘాటించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్‌తోపాటు పులిచింతల కూడా ఉమ్మడి ప్రాజెక్టుల పరిధిలోకి వస్తుందన్నారు. 'విభజన చట్టంలోని క్లాజ్-21లో తుంగభద్ర నుంచి శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల్లో 33 టీఎంసీలు ఆవిరి నష్టాలుగా ట్రిబ్యునళ్లు పేర్కొన్నాయి. సాగర్ ఎడమ కాలువ ద్వారా 121 టీఎంసీలు, కుడి కాలువ ద్వారా 132 టీఎంసీలు కేటాయించాయి. కృష్ణా జలాల్లో ఉమ్మడి రాష్ట్రం వాటా 811 టీఎంసీల్లో.. రాష్ట్ర విభజన తర్వాత 512 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్‌కు, 299 టీఎంసీలు తెలంగాణకు కేటాయించారు. 5 టీఎంసీలను చెన్నైకి తాగునీటికి కేటాయించారు. ఈ కేటాయింపులపై ఇచ్చిన ఆదేశాలను మార్చేందుకు బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు ఎలాంటి అధికారమూ లేదు' అని గుప్తా తేల్చిచెప్పారు. ట్రిబ్యునల్ విచారణ గురువారం కూడా కొనసాగనుంది.

విచారణ మొదలుకాకముందే పేలవ వాదనలంటారా?

- జగన్‌పై సాగునీటి సంఘాల సమాఖ్య నేత ఆగ్రహం

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల కేటాయింపులకు సంబంధించి రాష్ట్ర హక్కులను కాపాడేలా బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట రాష్ట్రప్రభుత్వం సమర్థంగా వాదనలు వినిపిస్తోందని రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. ట్రిబ్యునల్‌లో ఏపీ తరఫు వాదనలు మంగళవారం నుంచి మొదలయ్యాయని.. కానీ వాదనల్లో బలం లేదంటూ మాజీ సీఎం జగన్ నాలుగు రోజుల కిందటే విమర్శలు చేయడం ఏమిటని ఓ ప్రకటనలో మండిపడ్డారు. ఇది రాష్ట్ర హక్కులను కాలరాయడమేనన్నారు. జగన్ తప్పిదం కారణంగానే ట్రిబ్యునల్ ముందు ఇప్పుడు వాదనలు వినిపించాల్సి వస్తోందన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలపై రాజీలేదు!

- కృష్ణా జలాలపై హక్కుల కోసం పోరు: సీఎం

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే విషయంలో రాజీలేదని.. ఏ చిన్న అవకాశమూ పొరుగు రాష్ట్రాలకు ఇవ్వొద్దని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కృష్ణా జలాల పునఃపంపిణీకి అంగీకరించేది లేదని తేల్చిచెప్పారు. నీటి హక్కుల కోసం గట్టిపోరాటం చేద్దామన్నారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం జల వనరుల శాఖపై ఆయన సమీక్షించారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. కృష్ణా ట్రిబ్యునల్-2 ముందు రాష్ట్రప్రభుత్వం వినిపిస్తున్న వాదనలపై సీఎం ఆరా తీశారు. అవసరమైతే సమర్థులైన న్యాయవాదులను అదనంగా నియమించుకుందామని.. పటిష్ఠ వాదనలు వినిపించాలన్నారు. ఈ అంశంపై రెండ్రోజుల్లో ప్రత్యేకంగా సమావేశమవుదామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు ప్రగతిపైనా చర్చించారు. తొలి దశ పూర్తికావడానికి ఇంకా ఎన్ని నిధులు అవసరమని సీఎం ప్రశ్నించగా.. మరో వెయ్యి కోట్ల దాకా అవసరమవుతాయని.. ఈ నిధులు విడుదలైతే.. వచ్చే ఏడాది జూన్ దాకా చేపట్టే పనులకు నిధులు సరిపోతాయని అధికారులు తెలిపారు. నిర్వాసితులకు సహాయం, పునరావాసం నిధుల జమలో జాప్యంపై ముఖ్యమంత్రి అడిగారు. చింతలపూడి ఎత్తిపోతల పనులను పునఃప్రారంభించాలన్నారు. ఈ పథకం కోసం ఇప్పటికే రూ.4,500 కోట్లు వ్యయం చేశామని.. పర్యావరణ అనుమతులు రావడంలో జాప్యం కారణంగా పనులు నిలిచిపోయాయని, ఆ అనుమతులు సాధించాలని అధికారులకు స్పష్టంచేశారు. పోలవరం-నల్లమల సాగర్ అనుసంధాన పనులు చేపట్టేందుకు కూడా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ఢిల్లీ వెళ్లి అనుమతులు సాధించాలని సూచించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రానికి మిగులు జలాలు ఉంటాయన్నారు.

హక్కుల రక్షణలో రాజ్యాంగానిది కీలక పాత్ర: గవర్నర్



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ, వ్యక్తిగత హక్కుల పరిరక్షణలో రాజ్యాంగం కీలక పాత్ర పోషిస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. 76వ రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం రాజ్‌భవన్‌లో ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ శిల్పి, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, రాజ్యాంగ ముసాయిదా కమిటీ సభ్యుల చిత్రపటాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రథమ మహిళ సమీరా నజీర్, సీఎస్ కె.విజయానంద్, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము, హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయాధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను గౌరవించాలి: జెన్కో ఎండీ నాగలక్ష్మి

రాజ్యాగం విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని జెన్కో ఎండీ నాగలక్ష్మి పేర్కొన్నారు. విద్యుత్ సౌధలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్ చంద్, ట్రాన్స్‌కో డైరెక్టర్లు, జెన్కో డైరెక్టరు పాల్గొన్నారు. ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని రాజ్యాంగ దినోత్సవంలో సీఎండీ పుల్లారెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం

టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, టీడీ జనార్దన్, వర్ల రామయ్య, షరీఫ్, మండలిలో చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, తెనాలి శ్రావణ్, ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, వేపాడ చిరంజీవి, బీద రవిచంద్ర పాల్గొన్నారు.

ఐదు కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఐదు బీసీ సంక్షేమ కార్పొరేషన్లకు చైర్మన్లను, ఒక కార్పొరేషన్‌కు డైరెక్టర్లను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. ఏపీ భట్రాజ కార్పొరేషన్, ఏపీ పెరిక సంక్షేమ కార్పొరేషన్, ఏపీ షేక్ సంక్షేమ కార్పొరేషన్, ఏపీ కుర్ని/కరికాలభక్తులు సంక్షేమ కార్పొరేషన్, ఏపీ రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్లను నియమించారు. దీంతోపాటు ఏపీ నాగవంశం కార్పొరేషన్‌కు 15 మంది డైరెక్టర్లను నియమిస్తూ మరో ఉత్తర్వును విడుదల చేశారు.

భూమనా.. బుకాయించకు: వర్ల రామయ్య

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తన హావభావాలు, భాషా పటిమతో చేసిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య పేర్కొన్నారు. ఈ బుకాయింపులు చెల్లవని తేల్చిచెప్పారు.

పదవి పోగానే జగన్‌కు ప్రేమ పుట్టుకొచ్చింది: భూమిరెడ్డి

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రైతులకు పంటల బీమా చెల్లించినట్లు నిరూపిస్తే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సవాల్ విసిరారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు రైతుల ముఖం చూడని జగన్‌కు పదవి పోగానే రైతులపై ప్రేమ పుట్టుకొచ్చిందని విమర్శించారు. 2019-24 మధ్య ఒక్క ఎకరా అరటి పంటకూ బీమా చెల్లించలేదన్నారు.

టీటీడీ అవినీతిలో జగన్ పాత్రనూ విచారించాలి: నరసింహయాదవ్

తిరుమల తిరుపతి దేవస్థానంలో వైసీపీ పాలనలో జరిగిన అవినీతిపై మాజీ సీఎం జగన్, ఆయన బంధువుల పాత్రపైనా సమగ్ర విచారణ జరపాలని యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ కోరారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,27,910 ▲	1,17,250 ▲	1,76,000 ▲
విజయవాడ	1,30,000 ▲	1,21,000 ▲	1,64,000 ▲
విశాఖపట్నం	1,30,000 ▲	1,14,700 ▼	1,76,000 ▲
రాజమండ్రి	1,27,910 ▲	1,17,250 ▲	1,61,000 ▲
ప్రొద్దుటూరు	1,25,900 ▲	1,15,830 ▲	1,63,000 ▲
ముంబై	1,26,080 ▲	1,15,940 ▲	1,59,025 ▲

భారత మార్కెట్లోకి 'రెడ్ రాక్ డెలీ' చిప్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ చిప్స్ బ్రాండ్ 'రెడ్ రాక్ డెలీ'ని పెప్సికో భారత్ మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. కెటిల్ కుక్డ్, బేక్డ్, పాప్డ్ వంటి మూడు విభిన్న పద్ధతుల్లో దేశీయంగానే ఉత్పత్తి చేస్తూ, భారతీయ అభిరుచులకు అనుగుణంగా వివిధ ఫ్లేవర్లలో ఈ చిప్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పెప్సికో ఇండియా ఫుడ్స్ చీఫ్ మార్కెటింగ్ అధికారి సాక్షి వర్మ మీనన్ తెలిపారు. ఈ చిప్స్ ప్రస్తుతం ప్రముఖ క్విక్ కామర్స్ వేదికల్లో అందుబాటులో ఉంటాయని, స్థానిక రుచులతో మేళవిస్తూ యువ వినియోగదారులకు భిన్నమైన స్నాకింగ్ అనుభవాన్ని అందించడంపై దృష్టి సారిస్తున్నట్లు కంపెనీ తెలిపింది.

మార్కెట్లో ఫెడ్ జోష్



రేట్ల తగ్గుదల ఆశలతో పోటెత్తిన కొనుగోళ్లు

- సెన్సెక్స్ 1,022 పాయింట్లు అప్
- రూ.5.51 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో మూడు రోజుల వరుస నష్టాలకు తెరపడింది. బుధవారం ట్రేడింగ్‌లో మదుపరులు కొనుగోళ్లు పోటెత్తించడంతో ఈక్విటీ సూచీలు భారీగా లాభపడ్డాయి. సెన్సెక్స్ ఏకంగా 1,022.50 పాయింట్లు ఎగబాకి 85,609.51 వద్దకు చేరింది. నిఫ్టీ 320.50 పాయింట్ల వృద్ధితో 26,205.30 వద్ద స్థిరపడింది. ఆల్‌టైం రికార్డు ముగింపు స్థాయికి సూచీ కేవలం 10 పాయింట్ల దూరంలో ఉంది. అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వచ్చేనెలలో ప్రామాణిక వడ్డీరేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు ఊపందుకోవడంతో అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన ఈక్విటీ సూచీలూ పరుగులు తీశాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడులు, రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం త్వరలోనే కుదరవచ్చన్న అంచనాలు, ముడిచమురు ధరల తగ్గుదల వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరిచాయని విశ్లేషకులు పేర్కొన్నారు. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.5.51 లక్షల కోట్లు పెరిగి రూ.474.92 లక్షల కోట్లకు చేరింది.

- సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్ మినహా అన్నీ రాణించాయి. బజాజ్ ఫిన్‌సర్వ్ షేరు 2.63 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.32%, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.23% వృద్ధి చెందాయి. రంగాల వారీ సూచీల్లో టెలికాం మినహా అన్నీ లాభపడ్డాయి.
- విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) రూ.4,778.03 కోట్లు, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు(డీఐఐ) రూ.6,247.93 కోట్ల నికర కొనుగోళ్లు జరిపారు.

బంగారం.. 2 వారాల గరిష్ఠం

దేశీయంగా బంగారం ధరలు దాదాపు 2 వారాల గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత గల లోహం రేటు 10 గ్రాములపై రూ.1,200 పెరిగి రూ.1,30,100కు చేరింది. 99.5% స్వచ్ఛత లోహం కూడా అదే స్థాయిలో పెరిగి రూ.1,29,500గా నమోదైంది. కిలో వెండి సైతం రూ.2,300 ఎగబాకి రూ.1,63,100 ధర పలికింది. అంతర్జాతీయ విపణిలో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒకదశలో 0.81% వృద్ధితో 4,164 డాలర్లకు, సిల్వర్ 1.71% పెరిగి 52.37 డాలర్లకు చేరాయి.

కెనరా బ్యాంక్ రూ.3,500 కోట్ల సమీకరణ

బాసెల్-3 ప్రమాణాలతో కూడిన అడిషనల్ టైర్-1 (ఏటీ1) బాండ్ల జారీ ద్వారా రూ.3,500 కోట్లు సమీకరించనున్నట్లు ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ బుధవారం ప్రకటించింది. మూలధన నిల్వలను పెంచుకోవడంతోపాటు భవిష్యత్ వృద్ధి ప్రణాళికలకు తోడ్పడేందుకు ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు బ్యాంక్ తెలిపింది.

రిలయన్స్ @ రూ.21 లక్షల కోట్లు

రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ తొలిసారిగా రూ.21 లక్షల కోట్ల మైలురాయిని దాటింది. బీఎస్ఈలో కంపెనీ షేరు ఒకదశలో 2 శాతానికి పైగా పెరిగి రూ.1,571.80 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 1.99% లాభంతో రూ.1,569.75 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.21,24,259.89 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రిలయన్స్ షేరు 29 శాతానికి పైగా పెరిగింది.

ఎంసీఎక్స్ షేరు రూ.10,000

ఎంసీఎక్స్ షేరు ధర తొలిసారిగా రూ.10,000 మార్క్‌ను దాటేసింది. బీఎస్ఈలో షేరు ధర ఏకంగా 4.08% వృద్ధి చెంది రూ.10,274.60 వద్ద ముగిసింది. ఈ షేరు లాభపడటం ఇది వరుసగా మూడో రోజు. ఈ ఏడాది మార్చిలో రూ.4,408 వద్ద ఏడాది కనిష్ఠాన్ని నమోదు చేసిన ఎంసీఎక్స్ షేరు.. గడిచిన 8 నెలల్లో 132% శాతం వృద్ధి చెందడం విశేషం.

వడ్డీ రేట్లు తగ్గినా బేఫికర్

- మా లాభాలకు ఢోకా ఉండదు
- పావు శాతం వరకు తగ్గనున్న 'రెపో'
- ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి



న్యూఢిల్లీ: ఆర్‌బీఐ కీలక రెపోరేటు మరో పావు శాతం తగ్గించినా తమ నికర వడ్డీ లాభాలకు ఢోకా ఉండదని ఎస్‌బీఐ భావిస్తోంది. బ్యాంకు చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం చెప్పారు. సెప్టెంబరు త్రైమాసికానికి 2.97 శాతంగా ఉన్న తమ నికర వడ్డీ లాభం శాతం వచ్చే ఏడాది మార్చి మూడు శాతానికి చేరుతుందని భావిస్తున్నట్టు ఎస్‌బీఐ చీఫ్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) మొత్తానికి చూసినా జీడీపీ వృద్ధిరేటు ఏడు శాతానికి పైనే ఉండవచ్చునన్నారు.

మారిన వైఖరి : నిజానికి డిసెంబరు 5న ముగిసే ఎంపీసీ భేటీలో ఆర్‌బీఐ కీలక రెపోరేటు జోలికి పోకపోవచ్చని ఎస్‌బీఐ నిన్న మొన్నటి వరకు భావించింది. ఆర్‌బీఐ కూడా ఇవే సంకేతాలు ఇచ్చింది. అయితే అక్టోబరు నెల రిటైల్ ద్రవ్యోల్బణం పావు శాతానికి పడిపోయిన నేపథ్యంలో డిసెంబరు 5న ముగిసే భేటీలోనూ రెపోరేటు మరింత కుదించే అవకాశం ఉందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఇటీవల సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ తగ్గింపు పావు శాతం వరకు ఉంటుందని ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి చెప్పారు.

కలిసి రానున్న అంశాలు : ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు బ్యాంకులు తన ఆర్‌బీఐ వద్ద ఉంచాల్సిన నగదు నిల్వల నిష్పత్తిని (సీఆర్ఆర్) ఒక శాతం వరకు తగ్గించింది. దీంతో బ్యాంకుల వద్ద నిధుల లభ్యత పెరిగి వడ్డీ ఆదాయం పెరుగుతోంది. దీనికి తోడు అధిక వడ్డీరేటుతో తీసుకున్న డిపాజిట్లపై చెల్లించే వడ్డీరేట్లను బ్యాంకు తగ్గిస్తోంది. ఎస్‌బీ ఖాతాలపై చెల్లించే వడ్డీరేటునీ ఎస్‌బీఐ 0.2% తగ్గించింది. ఇవన్నీ తమ నికర వడ్డీ లాభాలను పెంచుతాయని శ్రీనివాసులు శెట్టి చెప్పారు.

షేర్ సర్టిఫికెట్లు పోగొట్టుకున్నారా?

డూప్లికేట్ కాపీలు పొందడం ఇక ఈజీ ● నిబంధనలను సడలించనున్న సెబీ

ముంబై: షేర్లు, బాండ్లు, మ్యూచువల్ ఫండ్ పథకాలు వంటి సెక్యూరిటీల సర్టిఫికెట్లను పోగొట్టుకున్నారా..? వాటి డూప్లికేట్ కాపీలను ఇకపై సులభంగా, తక్కువ ఖర్చుతో పొందేలా నిబంధనలను సడలించాలని సెబీ భావిస్తోంది. డూప్లికేట్ సెక్యూరిటీ సర్టిఫికెట్ల జారీకి ఒకే రకమైన ఫారాలను ప్రతిపాదించింది. అంతేకాదు, పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ ఫైల్ చేయడం, పత్రికల్లో ప్రకటన జారీ చేయాల్సిన అవసరం లేకుండా డూప్లికేట్ సర్టిఫికెట్ల జారీ చేయగలిగే పరిమితిని ప్రస్తుతమున్న రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని కూడా సెబీ ప్రతిపాదించింది. అంతేకాదు, నకిలీ కాపీల కోసం దరఖాస్తు చేసే సమయంలో అఫిడవిట్‌తోపాటు ఇండెమ్నిటీ బాండ్‌ను కూడా జతచేసే అవసరానికి స్వస్తి పలికి అఫిడవిట్ కమ్ ఇండెమ్నిటీ బాండ్‌ను సమర్పిస్తే చాలని సెబీ అంటోంది. వీటిపై డిసెంబరు 16లోగా అభిప్రాయాలు తెలుపాల్సిందిగా ప్రజలను కోరింది.

ప్రస్తుత నిబంధనలు ఇలా..

సెబీ తాజా సర్క్యులర్ ప్రకారం.. ప్రస్తుతం డూప్లికేట్ సెక్యూరిటీల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మూడు దశల ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది. ఇందుకు మదుపరి ఎఫ్ఐఆర్/ పోలీస్ స్టేషన్‌లో సమర్పించిన ఫిర్యాదు కాపీ/ కోర్టు ఇంజక్షన్ ఆర్డరు/పోగొట్టుకున్న సెక్యూరిటీల వివరాలతో కూడిన ఫిర్యాదు కాపీని సమర్పించాల్సి ఉంటుంది. అలాగే, పోయిన సెక్యూరిటీ సర్టిఫికెట్ల విషయమై ఏదైనా వార్తా పత్రిక ద్వారా ప్రకటన కూడా జారీ చేయాలి. ఆ తర్వాత మదుపరి అఫిడవిట్, ఇండెమ్నిటీ బాండ్‌ను విడివిడిగా సెబీ నిర్దేశిత ఫార్మాట్‌లో సమర్పించాల్సి ఉంటుంది. అయితే, దరఖాస్తు సమర్పించేనాటికి ఆ సర్టిఫికెట్ల విలువ రూ.5 లక్షలకు మించని పక్షంలో ఎఫ్ఐఆర్ సమర్పించడం, పత్రికలో ప్రకటన జారీ చేయాల్సిన అవసరం లేదు.

పెట్టుబడి సలహాదారులు, రీసెర్చ్ అనలిస్టులకు విద్యార్హత నిబంధనల సడలింపు

పెట్టుబడి సలహాదారులు, రీసెర్చ్ అనలిస్ట్‌లకు విద్యార్హత నిబంధనలను సెబీ సడలించింది. ఏ డిగ్రీ అభ్యర్థి అయినా రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించింది. అయినప్పటికీ, ఎన్ఐఎస్ఎం సర్టిఫికేషన్ పరీక్షల్లో ఉత్తీర్ణులవడం మాత్రం తప్పనిసరని మంగళవారం విడుదల చేసిన నోటిఫికేషన్లలో స్పష్టం చేసింది. ప్రస్తుతం ఫైనాన్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, కామర్స్, ఎకనామిక్స్ క్యాపిటల్ మార్కెట్లు వంటి ఆర్థిక సంబంధిత రంగాల్లో డిగ్రీ లేదా మాస్టర్ డిగ్రీ పూర్తి చేసినవారు మాత్రమే ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు లేదా రీసెర్చ్ అనలిస్ట్ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.

హరిత పెట్టుబడులతో 2047 నాటికి 4.8 కోట్ల కొలువులు

న్యూఢిల్లీ: పర్యావరణ పరిరక్షణకు ఉపకరించే పెట్టుబడులు మన ఆర్థిక వ్యవస్థకు కూడా పెద్ద ఊతం కానున్నాయి. 2047 నాటికి ఈ రంగంలోకి వచ్చే 4.1 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.364.9 లక్షల కోట్లు) పెట్టుబడులతో సుమారు 4.8 కోట్ల పూర్తి స్థాయి ఉద్యోగాలు ఏర్పడనున్నాయి. ఇంధన, పర్యావరణ, జల మండలి (సీఈఈడబ్ల్యు) ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. దీంతో 2047 నాటికి దేశంలో పర్యావరణ హిత వస్తువుల మార్కెట్ కూడా 110 లక్షల డాలర్లకు (సుమారు రూ.97.9 లక్షల కోట్లు) చేరుతుందని అంచనా వేసింది. శిలాజ ఇంధనాల నుంచి హరిత ఇంధనాలకు మారడం, పునరుత్పాదక విధానాలు, ప్రకృతి ఆధారిత ఉత్పత్తులు వంటి రంగాల్లో భారత్‌లో భారీ అవకాశాలు ఉన్నట్లు సీఈఈడబ్ల్యు తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27వ తేదీ			
హైదరాబాద్	650	విజయవాడ	660
వరంగల్	652	గోదావరి	645
చిత్తూరు	673	విశాఖపట్నం	635
		డజను గుడ్లు రూ.	90

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	100	విజయవాడ	103
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	98
కర్నూలు	100	నెల్లూరు	103
విశాఖపట్నం	100	అనంతపురం	103
గోదావరి	103		

ద్రవ్యోల్బణ అంచనాల్లో పక్షపాతం లేదు

ముంబై: ద్రవ్యోల్బణ అంచనాల్లో తమకు ఎలాంటి వ్యవస్థాగత పక్షపాతం లేదని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ పూనం గుప్తా స్పష్టం చేశారు. నిపుణులతో చర్చలు, అనేక నమూనాల ఆధారంగా ఆర్‌బీఐ ద్రవ్యోల్బణ అంచనాలు వెలువడరిస్తుంటుందన్నారు. అయితే అంతర్జాతీయ పరిణామాల కారణంగా కొన్ని సార్లు తమ అంచనాలు తప్పుతాయన్నారు.


కస్టమర్ల ముంగిట్లోనే చార్జింగ్ స్టేషన్లు

టెస్లా ఇండియా జీఎం

న్యూఢిల్లీ: ఖాతాదారుల జీవన శైలికి చేరువలోనే చార్జింగ్ స్టేషన్ల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయబోతున్నట్లు ఈవీ కార్ల దిగ్గజం టెస్లా ఇండియా జీఎం శరద్ అగర్వాల్ వెల్లడించారు. ఈవీ వాహనదారులు టిఫిన్లు, భోజనాలు చేసే ప్రదేశాలు, పని చేసే ప్రాంతాలు, విశ్రాంతి తీసుకునే ప్రాంతాల్లో సూపర్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఢిల్లీ, ముంబై నగరాల్లో ఇప్పటికే ఈ పని ప్రారంభించినట్లు తెలిపారు. మిగతా నగరాల విషయంలోనూ తమ వైఖరి ఇలానే ఉంటుందన్నారు. అవసరమైతే ఖాతాదారుల ఇంటి వద్ద కూడా చార్జింగ్ సేవలు అందిస్తామన్నారు.

హెచ్‌పీలో 2028లోగా 6,000 జాబ్స్ ఔట్

న్యూయార్క్: టెక్ ఉద్యోగాల్లో కోతల పర్వం కొనసాగుతోంది. వచ్చే మూడేళ్లలో నాలుగు వేల నుంచి ఆరు వేల మంది ఉద్యోగులను తీసివేయనున్నట్టు పర్సనల్ కంప్యూటర్ల (పీసీ) తయారీ సంస్థ హెచ్‌పీ ఇంక్ ప్రకటించింది. దీని వల్ల 100 కోట్ల డాలర్ల (సుమారు రూ.8,900 కోట్లు) వరకు ఆదా అవుతాయని కంపెనీ సీఈఓ ఎన్‌రిక్ లోరెస్ ప్రకటించారు. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ఇంటర్నల్ ఆపరేషన్స్, కస్టమర్ సపోర్ట్ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులపై ఈ కోతల ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావమే ఇందుకు కారణమన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ హెచ్‌పీ కంపెనీ 1,000 నుంచి 2,000 మంది ఉద్యోగులను ఇంటికి పంపించింది.



బుధవారం విద్యార్థుల మాక్ అసెంబ్లీ సందర్భంగా చిన్నారులతో స్పీకర్ అయ్యన్న, సీఎం చంద్రబాబు, మంత్రులు, అధికారుల గ్రూప్ ఫొటో

అధ్యక్షా.. అద్భుతః!







మాక్ అసెంబ్లీలో స్పీకర్ (స్వాతి)ని చైర్ వద్దకు తోడ్కొని వస్తున్న సీఎం(లీలాగౌతమ్), ప్రతిపక్ష నేత(సౌమ్య), పోడియం వద్ద విపక్ష సభ్యుల నిరసన, అధికార పక్ష సభ్యుల ఎదురుదాడి

(మొదటి పేజీ తరువాయి)

నుంచి 175 మంది విద్యార్థులు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, ముఖ్యమంత్రిగా వ్యవహరించి పలు అంశాలపై చర్చించారు. సాధారణ శాసనసభ తరహాలో ప్రొసీడింగ్స్, ప్రశ్నలు, చర్చలు సాగాయి. అధికార, విపక్షాల సభ్యులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. అయితే ఎక్కడా హద్దులు దాటలేదు. ప్రతిపక్షం నిర్మాణాత్మక సలహాలు ఇచ్చేలా, ప్రభుత్వం దానిని హుందాగా స్వీకరించేలా కార్యక్రమం నిర్వహించారు. వాస్తవ అసెంబ్లీ తరహాలోనే విద్యార్థులు పలు అంశాలపై స్పష్టంగా మాట్లాడారు. సమస్యలపై ప్రభుత్వ తీరును ప్రతిపక్షం ఎండగడితే, పలు ప్రశ్నలకు ప్రభుత్వం తరఫు నుంచి మంత్రులు దీటుగా సమాధానాలిచ్చారు. ప్రశ్నోత్తరాలు జరిగిన తీరు ఇదీ...

కౌన్సెలింగ్ అంటూ కాలక్షేపం చేస్తున్నారు

కాలేజీ విద్యార్థులు, ద్విచక్ర వాహన ప్రమాదాల గురించి సభ్యులు లేవనెత్తిన ప్రశ్నకు రవాణామంత్రి స్పందిస్తూ... కాలేజీ విద్యార్థుల వల్ల జరుగుతున్న ప్రమాదాలపై చర్యలు తీసుకుంటున్నామని, కౌన్సెలింగ్, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. దీనిపై ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే మాట్లాడుతూ... 'మంత్రి గారు కౌన్సెలింగ్, అవగాహన అంటూ కాలక్షేపం చేస్తున్నారు. దురుసుగా వాహనం నడిపేవాడు విద్యార్థి కాదు టెర్రరిస్ట్. ఓట్ల కోసం వారిని పిల్లలు అంటూ వెనకేసుకొస్తారా?' అని నిలదీశారు. దీనిపై అధికార పక్షం సభ్యులు నిరసన వ్యక్తం చేశారు.

మీటర్లు లేని ప్యానెళ్లు ఎందుకు?

సోలార్ ప్యానెళ్లు, వాటికి మీటర్లను అమర్చడం అంశంపై అడిగిన ప్రశ్నకు ఇంధన శాఖ మంత్రి సమాధానమిచ్చారు. సోలార్ ప్యానెళ్లకు మీటర్లు బిగించి దానిని గ్రిడ్‌కు అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. దీనిపై ప్రతిపక్ష ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేశారు. 'పీఎం సూర్యఘర్‌తో ఉచిత విద్యుత్ రావడాన్ని స్వాగతిస్తున్నాం. కానీ నెట్ మీటర్ పెట్టడానికి డిస్కంలు నెలల తరబడి సమయం తీసుకుంటున్నాయి. మీటర్ లేకపోతే ఆ విద్యుత్ గ్రిడ్‌కు వెళ్లదని మీకు తెలియదా?' అని ప్రశ్నించారు.

3.5 లక్షల మంది రైతులకు సాయం

వర్షాలు, తుఫాన్ల కారణంగా పంటలు దెబ్బతిన్న 3.5 లక్షల మంది రైతులకు సాయం అందించామని వ్యవసాయ శాఖ మంత్రి ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాలేజీల్లో డ్రగ్స్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని హోంమంత్రి చెప్పారు.

మీది బఫరింగ్ ప్రభుత్వం

విద్యార్థుల్లో మొబైల్ వ్యసనంపై వందల్లో కేసులు నమోదయ్యాయని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి చిన్మయి అన్నారు. దీనిపై ప్రతిపక్ష ఎమ్మెల్యే మాట్లాడుతూ... 'మంత్రిగారి సమాధానం అద్భుతంగా ఉంది. కేసులు వందల్లో ఉన్నాయట. అంటే కచ్చితమైన లెక్కలు కూడా లేవా. పిల్లలు 5జీ స్పీడ్‌లో ఫోన్లకు అతుక్కుపోతుంటే మీ ప్రభుత్వ చర్యలు 2జీ స్పీడ్‌లో బఫర్ అవుతున్నాయి. మీ పైలట్ సెంటర్లు వచ్చేలోగా విద్యార్థుల భవిష్యత్తు స్విచ్ఛాఫ్ అయిపోదా?' అని నిలదీశారు.

ఒలింపిక్స్‌లో కోతికొమ్మచ్చి, గోలీలాట

ఒలింపిక్స్- 2036 నిర్వహణకు నిధులు కేటాయించామని క్రీడల శాఖ మంత్రి తెలిపారు. దీనిపై ప్రతిపక్ష ఎమ్మెల్యే స్పందిస్తూ... 'మనవాళ్లు జావెలిన్ విసరడం కంటే కూడా ఒకరిపై ఒకరు బురద బాగా చల్లుకుంటున్నారు. నా సలహా ఏంటంటే కోతి కొమ్మచ్చి, గోలీలాట, గిల్లీదండ ఆటలు పెట్టాలని ఒలింపిక్స్ కమిటీకి లేఖ రాయండి. వాటిలో మనకు గోల్డ్ మెడల్ వస్తుంది' అని వ్యాఖ్యానించారు.

సోషల్ మీడియాపై బిల్లు

14 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా వినియోగాన్ని నియంత్రించే బిల్లును సభ ఆమోదించింది. ఆ వయసు పిల్లలు సోషల్ మీడియా వినియోగించకూడదని మంత్రి అన్నారు. దీనిపై అధికార పార్టీ ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇది తల్లిదండ్రులకు చట్టపరమైన ఆయుధ వం న్నారు. ఇది కంపెనీల మెడలు వంచి 'మా పిల్లల డేటా మీ వ్యాపారం కాదు' అని ధైర్యం చెబుతుందన్నారు.

మొక్కలు నాటే స్థలమేదీ?

పర్యావరణ పరిరక్షణ బిల్లుపై ప్రతిపక్ష ఎమ్మెల్యేలు మాట్లాడుతూ... 'ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటాలనడం బాగుంది.. కానీ అందుకు స్థలం ఎక్కడుంది.శ్లాబులపై నాటమంటారా?.' అని నిలదీశారు. దీనిపై పర్యావరణ శాఖ మంత్రి స్పందిస్తూ... 'మొక్కలు అంటే మర్రి చెట్లు కాదు. మొక్కలు నాటే స్థలం ఉంది. లేకపోతే ఇంటి వద్ద అయినా నాటుతారు.' అని బదులిచ్చారు. అనంతరం ఈ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఇకనుంచి అసెంబ్లీలో ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. కాగా, స్టూడెంట్ అసెంబ్లీకి 175మంది ఎంపికైనా వారిలో 43మందికి మాట్లాడే అవకాశంవచ్చింది. సభలో 50శాతం బాలికలు ఉన్నారు.

బాలల భారత రాజ్యాంగం ఆవిష్కరణ

విద్యార్థులకోసం బాలల భారత రాజ్యాంగం పుస్తకాన్ని పాఠశాల విద్యాశాఖ రూపొందించింది. కార్టూన్ బొమ్మలతో దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పుస్తకాన్ని సీఎం చంద్రబాబులో ఆవిష్కరించారు. వాటిని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అందించనున్నారు. అనంతరం విద్యార్థులతో చంద్రబాబు ఫొటో దిగారు. వారిని అసెంబ్లీ హాలు సందర్శనకు తీసుకెళ్లారు.

అసలు అసెంబ్లీలానే..!

స్టూడెంట్ అసెంబ్లీ నిజమైన శాసనసభ లాగానే సాగింది. సీఎంనుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, మార్షల్స్‌దాకా అందరూ విద్యార్థులే. సభను ప్రొటెం స్పీకర్ హోదాలో ఓ విద్యార్థి ప్రారంభించారు. ఆయన సభలోకి ప్రవేశించే సమయంలో సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు సహా అందరూ లేచి నిలబడ్డారు. జాతీయ గీతం అనంతరం స్పీకర్ ఎన్నిక జరిగింది. ఒకే నామినేషన్ రావడంతో స్వాతిని స్పీకర్‌గా ఎన్నుకున్నారు. సీఎం లీలాగౌతమ్, ప్రతిపక్ష నేత సౌమ్య... స్పీకర్‌ను తీసుకెళ్లి స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టారు. అనంతరం ప్రశ్నోత్తరాలు చేపట్టారు. జీరో అవర్ తర్వాత రెండు బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదించారు. పర్యావరణ బిల్లు ఆమోదం సమయంలో విపక్షసభ్యులు పోడియం వద్దకువెళ్లి నిరసన తెలిపారు. ఓ సభ్యుడిని మార్షల్స్ బయటకు ఎత్తుకుని వెళ్లారు. సభను స్పీకర్ నిరవధికంగా వాయిదా వేశారు.

జీరో అవర్ సాగిందిలా...

తుఫానులు, ఇతర విపత్తుల కారణంగా మత్స్యవేట, ఇతర నిషేధాలు విధిస్తే ఆ సమయంలో వారికి ఉపాధి హామీ పని చేసినట్లుగా పరిగణించి ఉపాధి కూలీ అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. జీరో అవర్ సందర్భంగా ప్రతిపక్ష ఎమ్మెల్యే మాట్లాడుతూ... 'తుఫానుపై ప్రభుత్వం హడావిడి చేస్తోంది. ఏడు రోజులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని ఉత్తర్వులు ఇచ్చారు. అయితే వేటనే నిషేధించారా? లేక ఆకలిని కూడా నిషేధించారా?' అని నిలదీశారు. దీనిపై సీఎం స్పందిస్తూ... 'మీరు అడిగింది ప్యాకేజీ.. కానీ మేం శాశ్వత పరిష్కారం చూపిస్తున్నాం. వేట నిషేధించిన రోజులను ఉపాధి హామీ పనిచేసినట్లుగా పరిగణిస్తాం. అంటే ఇంట్లో ఉన్నా ఉపాధి కూలీ వస్తుంది.' అని అన్నారు. ఇదొక చరిత్రాత్మక నిర్ణయం అని స్పీకర్ వ్యాఖ్యానించారు. దీనిపై సభ్యులంతా హర్షం వ్యక్తం చేశారు.

సభ ఎలా నిర్వహించాలో తెలిసింది



స్పీకర్‌గా ఎన్నిక కావడం, సీఎం చంద్రబాబు ముందు ఆ రోల్ ప్రదర్శించడం, వారంతా కింద ఉండి వీక్షించడం గొప్ప అనుభూతిని ఇచ్చింది. మాక్ అసెంబ్లీ ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాం. పిల్లలకు మాక్ అసెంబ్లీ పెట్టినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు. ఇదో గొప్ప అవకాశం. - ఎస్ స్వాతి. ఏపీ మోడల్ స్కూల్, శంఖవరం, కాకినాడ

చాలా ఆనందంగా ఉంది



నాకు సీఎం పాత్ర ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది. నేను, ప్రతిపక్ష నేత తీసుకెళ్లి స్పీకర్‌ను ఆయన స్థానంలో కూర్చోబెట్టడం చాలా బాగుంది. ప్రతి సంవత్సరం మాక్ అసెంబ్లీ నిర్వహించాలి. ఈ కార్యక్రమంతో చాలా నేర్చుకున్నా.

- లీలా గౌతమ్, జడ్పీ ఉన్నత పాఠశాల, బీజేపురం, పార్వతీపురం మన్యం జిల్లా

పెద్దయ్యాక సీఎం కుర్చీ ఎక్కాలనుకుంటున్నా



పెద్దయ్యాక రాజకీయాల్లోకి వద్దామనుకుంటున్నా. ముఖ్యమంత్రినై చంద్రబాబు కుర్చీ ఎక్కాలనుకుంటున్నా. మాక్ అసెంబ్లీలో నేను ప్రొటెం స్పీకర్‌గా పైన కూర్చుని కింద ఉన్న అందరినీ కంట్రోల్ చేయడం నచ్చింది. ఈ అవకాశం కల్పించిన మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు.

- రాజశేఖర్, పూసపాడు ఎస్‌కేవీఎస్ హైస్కూల్ బాపట్ల జిల్లా

జీవితంలో మర్చిపోలేని అనుభూతి



నా జీవితంలో మర్చిపోలేని అనుభూతిని సొంతం చేసుకున్నాను. అసెంబ్లీ, కౌన్సిల్‌ను చూసే అదృష్టం దక్కడం సంతోషంగా ఉంది. మాక్ అసెంబ్లీలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా మాట్లాడాను.

- గాయత్రి, ఏపీఎస్‌డబ్ల్యు స్కూల్, వెల్దుర్తి, కర్నూలు జిల్లా

ప్రతిపక్షం అంటే ప్రశ్నించడమే కాదు..



రాజకీయాల్లో ఎలా ఉంటుందని అనేది మాక్ అసెంబ్లీ ద్వారా తెలిసింది. నాకు ప్రతిపక్ష నేత పాత్ర ఇచ్చారు. ప్రతిపక్షం అంటే ప్రశ్నించడమే కాదు.. సమాధానం కూడా క్లారిటీగా వినాలని తెలిసింది. సభను మాకు ఈ విధంగా చూపించడం సంతోషంగా ఉంది.

- ఎల్ సౌమ్య సాయి జిల్లాప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల, మక్కువ, పార్వతీపురం మన్యం జిల్లా

డాక్టర్‌నై రాజకీయాల్లోకి వస్తా



మాక్ అసెంబ్లీ అనేది మంచి అనుభవం. విద్యా శాఖ మంత్రిగా పాత్ర నిర్వహించాను. ఇంతకుముందు డాక్టర్ కావాలనుకున్నా. ఇక్కడికి వచ్చాక డాక్టర్ అయిన తర్వాత కూడా రాజకీయాల్లోకి రావొచ్చని తెలుసుకున్నా. -ఎ.చిన్మయిశ్రీ, జడ్పీ స్కూలు, తిరుచానూరు, తిరుపతి జిల్లా



మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తున్న చంద్రబాబు, లోకేశ్

సమాజ హితం కోసమే ప్రజాప్రతినిధులు

- వ్యక్తిగత ప్రయోజనాలకు చట్టసభలు వేదిక కాకూడదు
- చాయ్‌వాలా ప్రధాని అయ్యారంటే.. అది రాజ్యాంగం గొప్పతనం
- మాక్ అసెంబ్లీలో విద్యార్థులు అదరగొట్టారు: సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 'వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎవ్వరూ సభకు రాకూడదు. సమాజ హితం కోసం ప్రజాప్రతినిధులుగా చట్టసభలకు రావాలి.' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన మాక్ అసెంబ్లీకి ఆయన హాజరయ్యారు. మాక్ అసెంబ్లీలో విద్యార్థులు అదరగొట్టారని ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించిన పిల్లలను చూస్తుంటే ముచ్చటేస్తోందన్నారు. "అసెంబ్లీ ఆదర్శంగా ఉండాలని నేను ఎప్పుడూ కోరుకుంటాను. విద్యార్థుల్లో బాధ్యత, చైతన్యం రావడానికి సంవిధాన్ దివస్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నాం. మన కోసం మనం రాజ్యాంగాన్ని రాసుకున్నాం. 28 ఏళ్లకే నేను ఎమ్మెల్యే అయ్యాను. యూనివర్సిటీలో చదువుకునేటప్పుడు ప్రజాప్రతినిధి అవ్వాలని కోరుకున్నాను. మా వైస్ చాన్సలర్ పిలిచి లెక్చరర్‌గా చేరాలని అడిగితే.. ఎమ్మెల్యే అవుతానని చెప్పాను. 1978లో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచి కనబడతానని చెప్పి, గెలిచి చూపించాను. నిర్దేశించుకున్న లక్ష్యం కోసం నిరంతరం శ్రమించాలి. ప్రతి ఒక్కరికీ సంక్షోభాలు వస్తాయి. వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి. సరైన నిర్ణయం తీసుకుని ముందుకెళ్లాలి. అందువల్లే నేను 9 సార్లు ఎమ్మెల్యే అయ్యాను. 30ఏళ్లకే మంత్రి, 40 ఏళ్లకు సీఎం అయ్యాను. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఏడుసార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎంపీ అయ్యారు. నా కంటే చిన్న వయసులోనే మీరు మాక్ అసెంబ్లీకి వచ్చి సమర్థంగా నిర్వహించారు. ఒక చాయ్‌వాలా దేశానికి ప్రధాని అయ్యారు. ఆయన ఈ దేశం దిశ మార్చారంటే అది రాజ్యాంగం మనకు ఇచ్చిన గొప్ప వరం. దేశంలో ఏ ఒక్కరూ రాజ్యాంగం కంటే గొప్పవారు కాదు. సోషల్ మీడియాలో మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పోస్టులు పెడుతున్నారు. దీనికి అడ్డుకట్టపడాలి' అని చంద్రబాబు పేర్కొన్నారు.

మార్పు విద్యార్థులతోనే సాధ్యం

- ప్రజాస్వామ్యంలో ప్రతి స్వరం ముఖ్యమే
- మహిళలను కించపరిచే పదాలకు అడ్డుకట్టవేయాలి: మంత్రి లోకేశ్

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భవిష్యత్తు రాజకీయాల్లో కీలక పాత్ర పోషించి, సమాజంలో మార్పు తీసుకురావాలని, అది వారికే సాధ్యమని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. 'యువగళం పాదయాత్ర సమయంలో రాజ్యాంగం పుస్తకం పట్టుకుని తిరిగాను. పాదయాత్ర సమయంలో నన్ను అడ్డుకున్న పోలీసులకు ఆర్టికల్ 19లో పొందుపర్చిన రైట్ టు ఫ్రీడం గురించి చెప్పాను. వారు అదంతా మాకు తెలియదు, ఎస్పీతో మాట్లాడమని చెప్పేవారు. పిల్లలకు చిన్న వయసులోనే రాజ్యాంగం హక్కులు, బాధ్యతల గురించి తెలియజేయాలని ఆనాడే నిర్ణయించుకున్నాను. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నేను రాజకీయాల్లోకి వచ్చా. స్టాన్‌ఫోర్డ్ ప్రవేశపరీక్ష సందర్భంగా రాసిన వ్యాసంలో ప్రజాసేవ, పాజిటివ్ లీడర్‌షిప్‌తో సమాజంలో మార్పు వస్తుందని రాశాను. మీరు భవిష్యత్తులో ఏ వృత్తిలోకి వెళ్లినా నైతికతను వీడొద్దు. రాజకీయాల్లో పాజిటివ్ లీడర్‌షిప్ తేవడానికి కృషి చేయండి.' అని లోకేశ్ కోరారు. 'రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో 7 లక్షల మందితో పోటీపడి మీరంతా ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ కార్యక్రమాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో పెట్టాలని పోరాడాను. ఈ రోజు మనం చూసింది లివింగ్ క్లాస్ రూం ఆఫ్ డెమొక్రసీ. శాసనసభ కార్యకలాపాలన్నీ మీరు ఈ రోజు చూశారు. ఏటా ఇలాంటి కార్యక్రమం చేయాలన్నది మన ప్రభుత్వ లక్ష్యం. ప్రజాస్వామ్య పరిరక్షణకు క్రమశిక్షణ, హుందాతనం ముఖ్యం. రాజ్యాంగం ద్వారా మనకు సంక్రమించే ప్రాథమిక హక్కుల గురించే కాదు, బాధ్యతల గురించి కూడా తెలుసుకోవాలి. ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తి స్వరం చాలా ముఖ్యం. రాజ్యాంగం భారతదేశానికి ఆత్మలాంటిది. అందుకే బాలల భారత రాజ్యాంగాన్ని తీసుకొచ్చాం. సమాజాన్ని నడిపించడంలో గురువులతో పాటు తల్లిదండ్రుల బాధ్యత కూడా ఉంది. నేను ఈ రోజు ఇక్కడ ఉన్నానంటే నా తల్లి కారణం. తెలుగు వాడుక భాషలో మహిళలను కించపరిచే పదాలకు అడ్డుకట్ట వేయాలి. గాజులు తొడుక్కున్నావా.. చీర కట్టుకున్నావా.. వంటి పదాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలి. ఇది కేవలం పుస్తకాల్లోనే కాదు, ఆచరణలోనూ అమలు చేయాలి. ఈ కార్యక్రమాన్ని 45వేల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లైవ్‌లో చూశారు. దీనిలో పాల్గొనేందుకు పోటీపడి రాలేకపోయిన వారికి ప్రభుత్వం మెరుగైన అవకాశాలు కల్పిస్తుంది' అని లోకేశ్ తెలిపారు.



విద్యార్థులకు ఆటోగ్రాఫ్ ఇస్తున్న మంత్రి లోకేశ్



రాష్ట్ర శాసనసభ ఆవరణలో విద్యార్థులతో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న, మంత్రి పయ్యావుల కేశవ్

చట్టసభలకు రాని ఎమ్మెల్యేలకు జీతాలెందుకు?

- మాక్ అసెంబ్లీలో పిల్లలు బాగా చేశారు: స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం చేయని ఉద్యోగికి జీతం ఇవ్వరని, అదే విధంగా చట్టసభలకు రాని ఎమ్మెల్యేలు జీతాలు ఎలా తీసుకుంటారని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. అసెంబ్లీకి రాకుండా ఇంటి వద్దే ఉంటూ జీతాలు తీసుకోవడం ఎంత వరకు నైతికమో సమాజం ఆలోచించాలన్నారు. భారత రాజ్యాంగం రచనలో 15 మంది వరకు తెలుగు ప్రముఖుల భాగస్వామ్యం ఉండటం మనందరికీ గర్వకారణమని అన్నారు. మాక్ అసెంబ్లీలో పిల్లలు బాగా చేశారని చెబుతూ.. 'మాకంటే మీరే అద్భుతంగా సభను నడిపారు' అని ప్రశంసించారు.

శ్రీసిటీకి ఇద్దరు ప్రత్యేక అధికారులు

సత్యవేడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక సేవల బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం శ్రీసిటీకి ఇద్దరు ప్రత్యేక అధికారులను నియమించింది. శ్రీసిటీ ఫెసిలిటేషన్ ఆఫీసర్‌గా తిరుపతి జిల్లా పరిశ్రమల కేంద్రం(డీఐసీ) ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి వి.జయంత్‌కుమార్‌ను, శ్రీసిటీ ఇండస్ట్రియల్ లోకల్ ఏరియా అథారిటీ (ఐలా) అధికారిగా ఏపీఐఐసీ ప్రాజెక్టు ఇంజనీర్(సివిల్) సుగుణను నియమించారు. పరిశ్రమల అనుమతులు, ప్రోత్సాహకాల ప్రక్రియలు, వ్యాపార సంస్కరణల అమలు కోసం జయంత్ పని చేయనున్నారు. అలాగే భవన అనుమతుల ఆన్‌లైన్ ప్రాసెసింగ్, ప్రాపర్టీ ట్యాక్స్ నిర్వహణ, వివిధ శాఖలతో సమన్వయం ద్వారా ఆన్‌లైన్ సేవల పరిష్కారానికి సుగుణ కృషిచేస్తారు. ఈ నియామకాలపై శ్రీసిటీఎండీ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

- నేడు వాయుగుండంగా బలపడే అవకాశం
- 29 కల్లా ఉత్తర తమిళనాడు సమీపానికి రాక
- తమిళనాడు, దక్షిణ కోస్తా మధ్య తీరం దాటే చాన్స్
- రాష్ట్రంలో రేపటి నుంచి వర్షాలు
- ఇండోనేషియా సమీపంలో తుఫాన్

విశాఖపట్నం/అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీలంకకు సమీపాన నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం మరింత బలపడి బుధవారం తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది ఉత్తర వాయవ్యంగా పయనించి గురువారం ఉదయానికి వాయుగుండంగా బలపడనుంది. ఆ తర్వాత రెండు రోజులు ఉత్తర వాయవ్యంగా పయనించే క్రమంలో తీవ్ర వాయుగుండంగా బలపడి ఉత్తర తమిళనాడు సమీపానికి వెళ్లనుంది. ఆ తర్వాత కూడా ఉత్తర వాయవ్యంగా పయనించి ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా మధ్య తీరం దాటి బలహీనపడనుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో శుక్రవారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల, ఉత్తరకోస్తాలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయి. శనివారం నుంచి వరుసగా మూడు రోజులపాటు రాష్ట్రంలో అనేకచోట్ల వర్షాలు, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ, ఉత్తరకోస్తాలో పలుచోట్ల భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ప్రధానంగా మధ్య, దక్షిణ కోస్తాపై ఎక్కువ ప్రభావం చూపుతుందని పేర్కొంది. రైతులు వరి, పత్తి పంటలను భద్రపరచుకోవాలని సూచించింది. గురువారం నుంచి తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. ఈనెల 29, 30 తేదీల్లో తీరం వెంబడి గంటకు 50 నుంచి 60, అప్పుడప్పుడు 70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. తీరంలోని వరి రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇదిలావుండగా మలక్కా జలసంధి పరిసరాల్లోని తీవ్ర వాయుగుండం బుధవారం ఇండోనేషియా పరిసరాల్లో తుఫాన్‌గా మారింది. దీనికి 'సెన్‌యార్' అని పేరు పెట్టారు. దీని ప్రభావం మన రాష్ట్రంపై ఉండదని వాతావరణ శాఖ పేర్కొంది. గురువారం నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో గంటకు 35-55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

మీకు తెలిసే రాజీ జరిగిందా?


ధర్మారెడ్డి


నరసింహ కిశోర్

అయిపోయాక తెలిసిందా.. ఎవరు ఒత్తిడి చేశారు?

- టీటీడీ పరకామణి చోరీ కేసులో.. నాటి ఈవో ధర్మారెడ్డికి సీఐడీ ప్రశ్నలు
- నేడు సీఐడీ ముందుకు వైవీ సుబ్బారెడ్డి

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుమలేశుడి పరకామణిలో చోరీ కేసులో సీఐడీ దర్యాప్తు వేగం పుంజుకుంది. తాజాగా టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి, విజిలెన్స్-సెక్యూరిటీ విభాగం మాజీ చీఫ్ (సీవీఎస్‌వో), ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీగా ఉన్న నరసింహ కిశోర్‌ను దర్యాప్తు సంస్థ అధికారులు ప్రశ్నించారు. 'టీటీడీలో దొంగతనానికి పాల్పడినవారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారు.. దొంగలించిన వ్యక్తి అంతకు కొన్ని రెట్లు ఎక్కువ చెల్లిస్తానంటే వదిలేసే అవకాశం ఉందా.. విదేశీ డాలర్లు దొంగలించి పట్టుబడిన పరకామణి ఉద్యోగి రవికుమార్‌తో ఆస్తులు రాయించుకునే విషయంలో నిబంధనలు ఏం చెబుతున్నాయి.. అప్పట్లో ఈ కేసుపై లోక్ అదాలత్‌లో మీకు తెలిసే రాజీ జరిగిందా.. జరిగిపోయిన తర్వాత తెలిసిందా.. ఎవరు ఒత్తిడి చేశారు..' అని ధర్మారెడ్డిని అడిగినట్లు తెలిసింది. ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగలేదని, దాతలు ముందుకొచ్చినప్పుడు ఆ వివరాలు పాలకమండలి ఎజెండాలో చూపించి.. దాని ఆమోదంతోనే తదుపరి చర్యలు చేపడతామని ఆయన బదులిచ్చినట్లు సమాచారం. విజయవాడ తులసీనగర్‌లోని సీఐడీ కార్యాలయానికి బుధవారం ఉదయం పది గంటలకు ధర్మారెడ్డి చేరుకోగా.. అధికారులు ఆయన్ను ఐదు గంటలు ప్రశ్నించారు. ఆ తర్వాత రెండు గంటల పాటు నరసింహ కిశోర్‌ను విచారించి వాంగ్మూలం నమోదు చేసుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) పరకామణి(హుండీ లెక్కింపు)లో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన డాలర్ల దొంగతనం వ్యవహారంపై హైకోర్టు ఆదేశాల మేరకు డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలోని సీఐడీ బృందం పూర్తిస్థాయి విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. తిరుపతి కేంద్రంగా నిందితుడు రవికుమార్‌తో పాటు నాటి టీటీడీ విజిలెన్స్ అధికారులు, ఈవో ధర్మారెడ్డి తదితరులను, హైదరాబాద్‌లో అప్పటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని ఇప్పటికే ప్రశ్నించారు. దర్యాప్తు కీలక దశకు చేరుకున్న తరుణంలో విచారణను విజయవాడకు మార్చారు. ధర్మారెడ్డిని, నరసింహ కిశోర్‌ను ప్రశ్నించేందుకు అయ్యన్నార్ మంగళవారం రాత్రి ఆగమేఘాలపై బెజవాడ చేరుకున్నారు. రవికుమార్ భార్య పేరుతో ఉన్న ఆస్తులను టీటీడీకి గిఫ్ట్ డీడ్ ఇచ్చేందుకు ఆయన చేసిన వినతిని పాలకమండలి భేటీలో టేబుల్ ఎజెండాగా పెట్టిన తర్వాతే రిజిస్టర్ చేయించినట్లు మాజీ ఈవో వెల్లడించారని తెలిసింది. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుంటుంటే.. మీకెవరూ చెప్పలేదా అని సీఐడీ ప్రశ్నించగా.. ఆయన సరైన సమాధానం ఇవ్వలేదని సమాచారం. ఇప్పటి వరకూ పలువురిని విచారించి సేకరించిన ఆధారాలను చూపించి ప్రశ్నించినట్లు సమాచారం.

స్వాధీనం చేసుకున్న విదేశీ కరెన్సీ నోట్లు ఎన్ని?

పరకామణిలో దొంగలించిన విదేశీ కరెన్సీ నోట్లలో రవికుమార్ నుంచి ఎన్నింటిని స్వాధీనం చేసుకున్నారు.. పోలీసులకు ఫిర్యాదు చేయాలని అప్పటి ఏవీఎస్‌వో సతీశ్ కుమార్‌కు చెప్పింది మీరేనా.. పోలీసు ఫిర్యాదులో 9 యూఎస్ డాలర్ల నోట్లు (ఒక్కొక్కటి వంద డాలర్లు విలువ) మాత్రమే స్వాధీనం చేసుకున్నట్లుగా ఉంది.. కానీ 112 స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.. కచ్చితంగా ఎన్ని అనేది మీకు తెలుసా.. పరకామణిలో దొంగతనం చేసి పట్టుబడిన దొంగతో.. ఫిర్యాదు చేసిన ఏవీఎస్‌వో సతీశ్‌కుమార్ లోక్ అదాలత్‌లో రాజీ పడుతుంటే మీరు అభ్యంతరం ఎందుకు చెప్పలేదు.. ఒక దొంగతనం కేసులోని నిందితుడు రూ.కోట్ల ఆస్తులు విరాళంగా ఇస్తే తీసుకోవడం సబబేనా.. అందుకు ఆలయ నిబంధనలు అభ్యంతరం చెప్పవా..' అని నరసింహ కిశోర్‌ను సీఐడీ ప్రశ్నించినట్లు తెలిసింది. రవికుమార్ దొంగతనాన్ని గుర్తించడం, పట్టుకుని ఫిర్యాదు చేయడం వరకూ విజిలెన్స్ సక్రమంగానే వ్యవహరించిందని ఆయన బదులిచ్చారు. ఆ తర్వాత పోలీసులు దర్యాప్తు ఎలా చేశారు.. చార్జిషీటులో ఏం రాశారు.. లోక్ అదాలత్‌లో ఎందుకు రాజీ పడ్డారు.. అనే విషయాలు తమ పరిధిలోకి రావని వివరించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని గురువారం మరోసారి సీఐడీ అధికారులు ప్రశ్నించనున్నారు. ఆయన ఉదయాన్నే విజయవాడ రానున్నట్లు తెలిసింది.

కోర్టు సిబ్బందిని విచారించిన సీఐడీ

తిరుపతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పరకామణి చోరీ కేసు విచారణ జరిగిన తిరుపతి రెండో ఏడీఎం కోర్టు సిబ్బందిని సీఐడీ అధికారులు బుధవారం పద్మావతి అతిథి గృహంలో విచారించారు. ఎవరి అనుమతితో లేదా ఎవరి ఆదేశాలతో కోర్టు ఈ కేసు రాజీని అంగీకరించింది.. లోక్ అదాలత్‌లో కేసు రాజీకి సంబంధించిన నిబంధనలు ఏంటని అడిగి వివరాలు సేకరించినట్లు తెలిసింది. కేసు రాజీ సమయంలో టీటీడీ నుంచి ఎవరెవరు వచ్చారు, సంతకాలు పెట్టిందెవరు వంటి ప్రశ్నలు వేసినట్లు సమాచారం. కేసు రాజీకి సంబంధించిన రికార్డులు కూడా పరిశీలించి అవసరమైన ప్రతులను తీసుకున్నట్లు తెలిసింది.

ప్రతి భారతీయుడూ గర్వించాల్సిన తరుణం

- శతాబ్ది కామన్వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యంపై సీఎం

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 2030లో జరగనున్న శతాబ్ది కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని భారతదేశం దక్కించుకోవడం ప్రతి భారతీయుడూ గర్వించాల్సిన తరుణంగా సీఎం చంద్రబాబు అభివర్ణించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో సాధించిన ఈ విజయం ప్రత్యేక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. ఈ పరిణామం ప్రపంచ వేదికపై భారత్ స్థానాన్ని మరింత పెంచుతుందని 'ఎక్స్‌'లో చేసిన పోస్టులో సీఎం పేర్కొన్నారు.

చంద్రబాబుపై 'ఫైబర్' కేసు క్లోజ్

- అక్రమాలు జరగలేదని సీఐడీ నిర్ధారణ
- ఆర్థిక నష్టాల్లేవని తేల్చిన సంస్థ
- ఏకీభవించిన నాటి, నేటి ఎండీలు
- కేసు మూసివేతకు కోర్టులో అంగీకారం

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఫైబర్‌నెట్‌లో అక్రమాలు జరిగాయంటూ జగన్ హయాంలో నాటి ప్రతిపక్షనేత చంద్రబాబు సహా 16 మందిపై పెట్టిన సీఐడీ కేసు ముగిసిపోయింది. ఫైబర్‌నెట్‌లో అక్రమాలేవీ చోటు చేసుకోలేదని, సంస్థకు ఎలాంటి ఆర్థిక నష్టం జరగలేదని సీఐడీ నివేదిక ఇచ్చింది. ఈ నివేదికతో తాము పూర్తిగా ఏకీభవిస్తున్నామని ఫైబర్‌నెట్ పూర్వ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. మధుసూదన రెడ్డి, ప్రస్తుత మేనేజింగ్ డైరెక్టర్ గీతాంజలి శర్మ విజయవాడలోని ఏసీబీ కోర్టుకు లిఖిత పూర్వకంగా తెలియజేశారు. వీరు బుధవారం ఏసీబీ కోర్టుకు హాజరయ్యారు. కేసును మూసేస్తున్నట్లు రాతపూర్వకంగానూ, మౌఖికంగానూ వెల్లడించారు.

రాజకీయ కక్షతోనే కేసు

2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే... జగన్ కక్ష సాధింపు రాజకీయాలు మొదలుపెట్టారు. ఫైబర్‌నెట్‌పై సొంత పత్రికలో వచ్చిన కథనాల ఆధారంగా చర్యలు తీసుకోవడం గమనార్హం. టెర్రాసాఫ్ట్ సంస్థకు ఆయాచితంగా రూ.321 కోట్ల లబ్ధిని చేకూర్చారంటూ సీఐడీకి 2021 సెప్టెంబరు 11న నాటి ఫైబర్‌నెట్ ఎండీ ఎం.మధుసూదన రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ కేసు పెట్టిన రెండేళ్ల తర్వాత... 2023 అక్టోబరు 11న చంద్రబాబు పేరునూ చేర్చారు. అయితే.. భారత్ నెట్ పథకం కింద కేంద్రం నుంచి విడుదలైన రూ.3840 కోట్లలో రూ.321 కోట్లు టెర్రాసాఫ్ట్‌కు బదలాయించినట్లుగా సీఐడీ నిర్ధారించలేకపోయింది. సార్వత్రిక ఎన్నికలు ముగిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఫైబర్‌నెట్ కేసులో అక్రమాలు జరగలేదని, ఆర్థిక అక్రమాలు లేవంటూ సీఐడీ ధ్రువీకరించింది. రాజకీయ కక్షతో కావాలనే చంద్రబాబును జగన్ ఇరికించారని చెప్పకనే చెప్పింది. అప్పుడు చంద్రబాబుపై ఫిర్యాదు చేసిన మధుసూదన రెడ్డే... ఇప్పుడు కేసును క్లోజ్ చేసేందుకు అభ్యంతరం లేదని చెప్పారు. అక్రమాలు జరగలేదన్న సీఐడీ నివేదికతో పూర్తిగా ఏకీభవించారు.

భారతదేశ డేటా క్యాపిటల్‌గా విశాఖ

- రూ.98వేల కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్
- 'ఎక్స్'లో సీఎం చంద్రబాబు, లోకేశ్ పోస్టులు

విశాఖపట్నంలో రిలయన్స్ జాయింట్ వెంచర్ ద్వారా రూ.98 వేల కోట్ల పెట్టుబడితో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందని, దీంతో విశాఖ భారతదేశ డేటా క్యాపిటల్‌గా అవతరించనుందని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు వారు బుధవారం 'ఎక్స్'లో వేర్వేరుగా పోస్టు చేశారు. వినూత్న ఆలోచనలు.. ఆవిష్కరణలతో విశాఖ అద్భుత నగరంగా మారనుందని తన పోస్టులో లోకేశ్ పేర్కొన్నారు. యువ నిపుణులు విశాఖను ముద్దుగా శాన్‌ఫ్రాన్సిస్కో ఆఫ్ ఈస్ట్‌గా పిలుచుకుంటున్నారని తెలిపారు.

రఘురామ టార్చర్ కేసులో కదలిక!

ఏ-1 సునీల్‌కుమార్‌కు నోటీసులు

- 4న గుంటూరు సీసీఎస్ కార్యాలయానికి రావాలని వాట్సాప్ సందేశం
- నేడు స్వయంగా అందజేయనున్న పోలీసులు



గుంటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నాటి నరసాపురం ఎంపీ, ప్రస్తుతం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న రఘురామకృష్ణరాజును లాకప్‌లో చిత్రహింసలకు గురిచేసిన కేసులో ఎట్టకేలకు కదలిక వచ్చింది. కేసులో ప్రధాన నిందితుడైన నాటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్‌కు బుధవారం పోలీసులు నోటీసులు జారీ చేశారు. డిసెంబరు 4న గుంటూరు సీసీఎస్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని వాట్సా‌ప్‌లో పంపిన నోటీసుల్లో పేర్కొన్నారు. గురువారం వారు స్వయంగా వాటిని అందజేయనున్నారు. ఈ కేసులో ఐపీఎస్ అధికారులతో పాటు మాజీ సీఎం జగన్ తదితరులు నిందితులుగా ఉండడంతో కేసు విచారణను అప్పటి ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం అప్పట్లోనే ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన విజయనగరం ఎస్పీగా ఉన్నారు. 2021 మే 14న హైదరాబాద్‌లో జన్మదినం జరుపుకొంటున్న రఘురామ రాజును సీఐడీ పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి తీసుకొచ్చారు. ఆరోజు రాత్రి ఆయనపై సీఐడీ కార్యాలయంలో గుండెలపై కూర్చుని, లాఠీలతో కొట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని.. గుండె ఆపరేషన్ చేయించుకున్నానని, మందులు వేసుకోవాలని ప్రాధేయపడినా వినిపించుకోకుండా తనను తీవ్రంగా హింసించి హత్యాయత్నం చేశారని రఘురామ ఆ తర్వాతి రోజు కోర్టులో మేజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం ఇచ్చారు. దెబ్బలకు వాచిపోయి ఉన్న అరికాళ్లను మేజిస్ట్రేట్‌కు చూపారు. దీంతో ఆయనకు వైద్య పరీక్షలు చేయించాలని న్యాయాధికారి ఆదేశించారు. ఆయన శరీరంపై దెబ్బల్లేవని నాటి గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి నివేదిక ఇచ్చారు. ఆమె భర్త రవికుమార్ వైసీపీ నాయకుడు కావడంతో ఆమెను నాటి ప్రభుత్వ పెద్దలు ప్రభావితం చేసి తప్పుడు నివేదిక ఇప్పించారని రఘురామఆరోపించారు. దీనిపై ఆయన హైకోర్టు, సుప్రీంకోర్టు తలుపులు తట్టడంతో చివరకు హైదరాబాద్‌లోని మిలిటరీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. ఆయన ఒంటిపై గాయాలు ఉన్నాయని వైద్యులు కోర్టుకు నివేదిక ఇచ్చారు. తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చాక గత ఏడాది జూలై 11న గుంటూరు నగరంపాలెం పోలీసు స్టేషన్లో రఘురామ ఫిర్యాదు చేయడంతో పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నాటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్‌ను ఏ-1గా, నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులును ఏ-2గా, నాటి సీఎం జగన్‌ను ఏ-3గా, అప్పటి సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌ను ఏ-4గా, అప్పటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతిని ఏ-5గా చేర్చారు. ఈ కేసులో దర్యాప్తు అధికారిగా ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ను నియమించారు. కేసు విచారణలో భాగంగా విజయ్ పాల్‌ను విచారించి, అరెస్టు చేశారు. అలాగే రఘురామపై కస్టడీలో దాడి చేసిన తులసిబాబును అరెస్టు చేశారు. రఘురామకు చిత్రహింసల సమయంలో నాటి సీఐడీ డీఐజీగా ఉన్న సునీల్‌నాయక్ ఆ తర్వాత తన సొంత క్యాడర్ రాష్ట్రమైన బిహార్‌కు వెళ్లిపోయారు. ఈ ఏడాది మార్చిలో ఆయనకూ పోలీసులు నోటీసులు జారీచేయగా.. ఆయన అక్కడి కోర్టు నుంచి మినహాయింపు ఆదేశాలు పొందారు.

సజ్జల జైలుకు వెళ్లడం ఖాయం!

- వైసీపీ పతనానికి ఆయనే కారణం: బుద్దా వెంకన్న



విజయవాడ(వన్ టౌన్), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ పతనానికి సజ్జల రామకృష్ణారెడ్డి కారణమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న చెప్పారు. సజ్జల పగటి కలలు కనడం మానుకోవాలన్నారు. చంద్రబాబుపై సజ్జల చేసిన వ్యాఖ్యల పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు త్వరలో కేఏ పాల్ పార్టీలోకి, సజ్జల జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. విజయసాయిరెడ్డి వైసీపీకి రాజీనామా చేస్తూ ఆ పార్టీ నాశనమైందని ఎందుకు వ్యాఖ్యానించాడో ఇపుడు అర్థమవుతోందన్నారు. చంద్రబాబుపై అన్యాయంగా కేసులు పెట్టినందునే జగన్‌ను ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. జగన్ హయాంలో రైతులకు ఏం మేలు జరిగిందో మొసలి కన్నీరు కారు స్తున్న సజ్జల చెప్పాలని డిమాండ్‌చేశారు. వైసీపీ ఇక అధికారంలోకి రావడం కలేనని చెప్పారు. పార్టీ నాశనానికి సజ్జలే కారణమని ఆ పార్టీనాయకులే చెబుతున్నారని, ఈ అంశాన్ని జగన్ గ్రహించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. సజ్జల చేసిన ఘోరాలు, పాపాలు బయటపడుతున్నాయని, త్వరలోనే జైలుకు వెళతాడని బుద్దా వెంకన్న తెలిపారు.

తొలిరోజు గంటే విచారణ

- జోగి బ్రదర్స్‌ను నెల్లూరు నుంచి తేవడంలో జాప్యం

విజయవాడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు రాము విచారణ తొలిరోజు గంట మాత్రమే సాగింది. వారిని నెల్లూరులోని కేంద్ర కారాగారం నుంచి విజయవాడకు తీసుకురావడం, వైద్య పరీక్షలు చేయించడానికే ఎక్కువ సమయం పట్టడంతో బుధవారం సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు మాత్రమే ఎక్సైజ్ అధికారులు విచారించారు. ఈ కేసులో జోగి బ్రదర్స్‌ను న్యాయస్థానం బుధవారం నుంచి నాలుగు రోజులపాటు ఎక్సైజ్ కస్టడీకి ఇచ్చిన విషయం తెలిసిందే. వైద్య పరీక్షల అనంతరం వారిద్దరినీ విజయవాడలోని గురునానక్ కాలనీలో ఉన్న ఎక్సైజ్ తూర్పు స్టేషన్‌కు తరలించారు. జోగి బ్రదర్స్‌ను వేర్వేరుగా విచారించారు. ఇద్దరికి 20-25 చొప్పున ప్రశ్నలు సంధించారు. అద్దేపల్లి బ్రదర్స్‌తో జోగి బ్రదర్స్‌కు మధ్య ఏర్పడిన బంధం గురించే ప్రశ్నించినట్టు తెలిసింది. ఇప్పటికే పలుమార్లు వాటి గురించి మాట్లాడిన జోగి రమేశ్.. తిరిగి అవే సమాధానాలు ఇచ్చినట్టు సమాచారం. విచారణ సమయం ముగిసిపోవడంతో వైద్య పరీక్షలు చేయించి వారిని జిల్లా జైలులో అప్పగించారు. కాగా, ఈ కేసులో నిందితులు అంతాదాస్, మిథున్‌దాస్, బాదల్ దాస్, అల్లాబక్షు, చెక్కా రమేశ్‌కు చెందిన సెల్‌ఫోన్లను సైబర్ విశ్లేషణ కోసం ఎఫ్ఎస్ఎల్‌కు పంపారు. ఆ నివేదిక బుధవారం సిట్ అధికారులకు చేరింది.


బుధవారం వ్యవసాయశాఖ సమీక్షలో చంద్రబాబు

అన్ని పంటలకూ 'మద్దతు'

- అడ్డంకులు లేకుండా కొనుగోళ్లు, చెల్లింపులు
- గోనె సంచుల సరఫరాలో లోపాలు ఉండొద్దు
- పత్తి కొనుగోళ్లలో ఇబ్బందులపై కేంద్రంతో సంప్రదింపులు
- అరటి, జొన్న ధరలపై సమస్యలను అధిగమించాలి
- ధాన్యం కొనుగోళ్లపై రైస్ మిల్లర్లతో మాట్లాడండి
- వ్యవసాయ, పౌరసరఫరాల సమీక్షలో చంద్రబాబు

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులు పండిస్తున్న అన్ని పంటలకు మద్దతు ధర దక్కాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ధాన్యం కొనుగోళ్లు, మద్దతు ధర చెల్లింపుల్లో ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలపై సమీక్ష నిర్వహించారు. పత్తి, అరటి, జొన్న వంటి పంటల సాగులో రైతులు ఇబ్బందులను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రబీ సీజన్‌లో 50.75 లక్షల టన్నుల మేర ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకోసం రూ.13,451 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. 'చెల్లింపుల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలి. కొనుగోలు చేశాక రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన చెల్లింపుల ప్రక్రియను పూర్తి చేయాలి. భారీ వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మేరకు గోనె సంచులను అందించాలి' అని ఆదేశించారు.

సమీక్ష నుంచే కేంద్ర కార్యదర్శికి ఫోన్

పత్తి కొనుగోళ్లలో సీసీఐ తెచ్చిన కొత్త విధానాల వల్ల ఇబ్బందులు వస్తున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు సీఎం దృష్టికి తెచ్చారు. దీంతో సమీక్ష సమావేశం నుంచే కేంద్ర టెక్స్‌టైల్స్ కార్యదర్శి నీలం రావుతో చంద్రబాబు మాట్లాడారు. పత్తి కొనుగోళ్ల విషయంలో ఎదురవుతున్న సమస్యను వివరించారు. కొత్తగా తెచ్చిన విధానాల వల్ల రాష్ట్రంలో పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాల హెచ్చరికలు ఉన్నందున సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. అనంతరం అధికారులకు ముఖ్యమంత్రి కొన్ని సూచనలు చేశారు. 'పత్తి కొనుగోళ్ల అంశంలో ఎదురవుతున్న ఇబ్బందులపై నిత్యం కేంద్రంతో సంప్రదింపులు జరపాలి. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు ఈ బాధ్యతలు అప్పగించాలి. అరటి, జొన్న ధరలపై సమస్యలను అధిగమించాలి. స్థానిక ట్రేడర్లు, ఎగుమతిదారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించాలి. ధాన్యం కొనుగోళ్లపైనా రైస్ మిల్లర్లతో సంప్రదింపులు జరపాలి. భారీ వర్షాలు వచ్చే అవకాశముంటే రైతులను అలర్ట్ చేయడంతోపాటు పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి' అని దిశానిర్దేశం చేశారు.

గుంతలు పడ్డ రోడ్లు.. ప్రశ్నిస్తే కేసులు

- గత ప్రభుత్వం అంటే గుర్తొచ్చేవి ఇవే: పవన్
- కోనసీమ జిల్లా శివకోడులో పల్లె పండగ 2.0కు శ్రీకారం

అమలాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అంటే.. గుంతలు పడ్డ రోడ్లు, మరమ్మతులకు నోచుకోని కాల్వలు, పాలనపై ప్రశ్నిస్తే పెట్టిన అక్రమ కేసులే గుర్తుకు వస్తాయని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. గత ప్రభుత్వం నుంచి కూటమి ప్రభుత్వానికి అప్పులు, సమస్యలు మాత్రమే వారసత్వంగా లభించాయని తెలిపారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోడు గ్రామంలో బుధవారం పవన్ కల్యాణ్ పల్లె పండగ 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అక్కడ ఉన్నవారిని ఉద్దేశించి ప్రసంగించారు. వైసీపీకి అనుకూలంగా ఉండే కొన్ని పత్రికలు కూటమి ప్రభుత్వం 16 నెలల కాలంలో ఏం చేసిందని ప్రశ్నిస్తున్నాయని, గత ప్రభుత్వంలా దోచుకోవడం లేదని మాత్రం తాను చెప్పగలనన్నారు. అప్పటిలా ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం లేదని, సంక్షేమం పేరుతో అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడం లేదని, ఉద్యోగులకు సకాలంలోనే జీతాలు ఇస్తున్నామని, అభివృద్ధికి వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని, పెన్షన్లు గత ప్రభుత్వం కంటే బాగా ఇస్తున్నామని సమాధానం ఇవ్వగలనన్నారు. ప్రజలు బుద్ధి చెప్పినా వైసీపీ నాయకుల్లో మార్పు రాలేదని, వాళ్ల బుద్ధి మారడం లేదన్నారు. "రాజోలు గడ్డ నుంచి చెబుతున్నా.. 2029లో మీరు రారు. అలాంటి ఆశలు పెట్టుకోకండి. అది జరగదు." అని వైసీపీ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కొబ్బరిచెట్టు వేసి పెంచితే 15ఏళ్లకు గానీ కాపు కాయదని, అలాగే మీరు ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించి 15ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోనే ఉంచాలని యువతను కోరారు. "కోనసీమలో కొబ్బరిచెట్టును ఇంటికి పెద్దకొడుకులా చూసుకుంటారు. కూటమి ప్రభుత్వాన్ని మీరు పెద్దకొడుకులా కాపాడితే ఆ పెద్దకొడుకే మీకు భవిష్యత్తు ఇస్తాడు" అని తెలిపారు. జన్-జీ యువత ఆలోచనలో చాలా మార్పు వచ్చిందని, అబద్ధపు హామీలతో వారిని మోసం చేయలేమని పేర్కొన్నారు. అందువల్లే బిహార్ ఎన్నికల్లో లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఆశ చూపినా ఆర్జేడీని చిత్తుగా ఓడించారన్నారు. నిధులు లేకపోయినా, ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా, వేల కిలోమీటర్ల మేర రోడ్లు వేస్తున్నామనీ, పల్లెల రూపురేఖలు మారుస్తున్నామని తెలిపారు. కోనసీమ కేరళ స్థాయి సత్తా ఉన్న ప్రాంతమని, ఇక్కడ బ్యాక్ వాటర్‌తో కేరళ తరహా టూరిజాన్ని అభివృద్ధి చేయవచ్చునని, మన దర్శక, నిర్మాతలు షూటింగుల కోసం కోనసీమను ఎన్నుకుంటే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలోని గ్రామాల ముఖ చిత్రాన్ని సంపూర్ణంగా మార్చివేసే లక్ష్యంతో పల్లె పండగ 2.0 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం తొలిదశలో 4వేల కిలోమీటర్ల రోడ్డు వేశామని, ఇప్పుడు 2.0లో రెండింతల అభివృద్ధికి శ్రీకారం చుట్టనున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలోని 13,326 పంచాయతీల్లో రూ.6,787 కోట్ల వ్యయంతో 53,382 అభివృద్ధి పనులను చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు ప్రకటించారు.


రాజోలు మండలం శివకోడులో పల్లెపండుగ 2.0 పైలాన్‌ను ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం పవన్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్


కేశనపల్లిలో నిర్జీవమైన కొబ్బరిచెట్లను చూస్తున్న పవన్

కొబ్బరి బోర్డు ఏర్పాటుకు కోరతా..

పర్యటనలో భాగంగా డిప్యూటీ సీఎం మలికిపురం మండలం కేశనపల్లి, చింతలమోరి, శంకరగుప్తం గ్రామాల ప్రజలను కలిశారు. అక్కడ డ్రెయిన్ల నుంచి సముద్రపునీరు ఎగదన్నడం వల్ల నిర్జీవంగా మారిన కొబ్బరిచెట్లను పరిశీలించారు. 13 గ్రామాల కొబ్బరి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. కొబ్బరి రైతుల సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరతానని హామీ ఇచ్చారు.

అత్యవసరంగా లొంగిపోనక్కర్లేదు!

- నిందితులు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పలకు సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ మద్యం కుంభకోణం కేసులో నిందితులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పలకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం వారు (నవంబరు 26న) సరెండర్ కావాల్సిన అవసరం లేదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. చార్జిషీటు దాఖలుకు ఆలస్యం అవుతున్న కారణంగా గతంలో ట్రయల్ కోర్టు ఈ ముగ్గురికి 'డీఫాల్ట్ బెయిల్' మంజూరు చేసింది. దానిని రాష్ట్రప్రభుత్వం సవాల్ చేయగా.. ఏపీ హైకోర్టు బెయిల్‌ను రద్దు చేసింది. నవంబరు 26లోగా ట్రయల్ కోర్టులో లొంగిపోవాలని, రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆ ముగ్గురూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌ను బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు సి. ఆర్యమాన్ సుందరం, నిరంజన్‌రెడ్డి, సిద్ధార్థ దవే వాదనలు వినిపించారు. చార్జిషీటు అసంపూర్తిగా ఉన్నందునే డీఫాల్ట్ బెయిల్ వచ్చిందని, నిందితులు ఇప్పటికే 108 రోజులు కస్టడీలో ఉన్నారని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం, సిట్ తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ.. ఇది సాధారణ కేసు కాదని, మద్యం కుంభకోణంతో నిందితులు రాష్ట్రాన్ని లూటీ చేశారని, ఖజానాకు భారీగా గండి కొట్టారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆగస్టు 23నే చార్జిషీటు దాఖలు చేశామని, ఆ తర్వాత మరో 2సప్లిమెంటరీ చార్జిషీట్లు వేశామన్నారు. నిందితులకు వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ కేసులో దాదాపుగా 400 మంది సాక్షులు ఉన్నారని, వీరిలో 200 మందిని విచారించామని తెలిపారు. నిందితులు పలుకుబడి కలిగిన వ్యక్తులని, సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదముందన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. 'ఈ కేసులో మిగిలిన 200 మంది సాక్షులను విచారించడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉంది కదా! అప్పటి వరకు వీరిని జైలులో ఉంచడం సరికాదు. సాక్షులను ప్రభావితం చేస్తారన్న ఆందోళన ఉంటే.. కఠిన షరతులు విధించి బెయిల్ ఇవ్వొచ్చు. డీఫాల్ట్ బెయిల్‌పై గతంలోనే సుప్రీంకోర్టు భిన్న తీర్పులు ఇచ్చిందని.. స్పష్టత కోసం 'మన్‌ప్రీత్ తల్వార్' కేసును విస్తృత ధర్మాసనానికి బదిలీ చేశామని.. ఆ కేసులో తీర్పు వచ్చేంత వరకు లేదా ఈ కేసులో తదుపరి విచారణ జరిగేంతవరకు నిందితుల స్వేచ్ఛను హరించడం సరికాదు' అని అభిప్రాయపడింది. రాష్ట్రప్రభుత్వంతోపాటు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను డిసెంబరు 15కి వాయిదా వేసింది.

గ్రూప్-1 మెయిన్స్ అక్రమాలపై స్వతంత్ర కమిటీ

- హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్ నేతృత్వంలో ఏర్పాటు

అమరావతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష అక్రమాలను తేల్చే విషయంలో హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్ నేతృత్వంలో స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేసింది. జస్టిస్ కేజీ శంకర్‌ను చైర్మన్‌గా, బార్ కౌన్సిల్ మాజీ చైర్మన్ గంటా రామారావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్‌ను సభ్యులుగా నియమించింది. హాయ్‌ల్యాండ్‌లో జవాబుపత్రాల మూల్యాంకనం జరిగిందా? ఓఎంఆర్ షీట్లపై మార్కులు నమోదు చేశారా? లేదా అనే విషయం పై వాస్తవాలు నిర్ధారించేందుకు కమిటీ సమక్షంలో జవాబుపత్రాలు, ఓఎంఆర్ షీట్లు పరిశీలించేందుకు ఇరువైపుల న్యాయవాదులను అనుమతించింది. ప్రస్తుతం హైకోర్టు ఆధీనంలో ఉన్న జవాబుపత్రాలను పరిశీలించే సమయంలో రిజిస్ట్రార్ జ్యుడీషియల్, అడ్వొకేట్ జనరల్ లేదా ఆయన తరఫు ప్రతినిధి, ఏపీపీఎస్సీ అధికారులు ఉండాలని స్పష్టం చేసింది. అభ్యర్థుల తరఫు సీనియర్ న్యాయవాదులు లేదా వారి ప్రతినిధులు జవాబుపత్రాలను పరిశీలించేందుకు వెసులుబాటు ఇచ్చింది. డిసెంబర్ 4న జవాబుపత్రాలు, ఓంఎంఆర్ షీట్ల పరిశీలించవచ్చని స్పష్టత ఇచ్చింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. 2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష జవాబుపత్రాల మూల్యాంకనంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని నిర్ధారిస్తూ 2022 మే 26న ఏపీపీఎస్సీ ఇచ్చిన అర్హుల జాబితాను హైకోర్టు సింగిల్ జడ్జి రద్దు చేశారు. తాజాగా మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని, ఎంపిక ప్రక్రియను ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశిస్తూ 2024 మార్చి 13న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ, నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన కొందరు ఉద్యోగులు హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై ధర్మాసనం తుది విచారణ ప్రారంభించిన విషయం తెలిసిందే.

సొంత ఖర్చుతోనే లోకేశ్ పర్యటనలు

- ప్రభుత్వం నుంచి ఒక్కపైసా తీసుకోవడం లేదు
- ఆయన విమాన ప్రయాణాలపై తప్పుడు ప్రచారం
- జగన్ పత్రికపై టీడీపీ శ్రేణుల ఆగ్రహం

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ తన పర్యటనలకు సంబంధించిన విమాన చార్జీలకు సొంత సొమ్ము వెచ్చిస్తున్నారని టీడీపీ నేతలు స్పష్టం చేశారు. కొంతమంది సమాచార హక్కు కార్యకర్తలు ఇప్పటికే ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. కానీ అబద్ధాల పునాదులపై పుట్టిన జగన్ పత్రిక మాత్రం లోకేశ్ పర్యటనలపై అసత్య కథనాలు వండి వారుస్తోందని విమర్శించారు. జగన్ మీడియా, వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకేశ్ 77 సార్లు హైదరాబాద్‌కు విమానంలో వెళ్లారని, ప్రభుత్వ సొమ్మును విమాన చార్జీలకు దుర్వినియోగం చేస్తున్నారని జగన్ పత్రికలో పేర్కొన్నారని, కానీ ప్రతి పర్యటనకు ఆయన తన సొంత సొమ్ము చెల్లిస్తున్నారని తెలిపారు. చివరికి ప్రభుత్వ అధికారిక పర్యటనలు, పెట్టుబడుల సాధనకు వెళ్లిన పర్యటనలకు సైతం సొంత సొమ్మునే వెచ్చిస్తున్నారన్నారు. చినబాబు చిరుతిండి అని గతంలోనూ జగన్ పత్రిక తప్పుడు వార్తలు రాస్తే లోకేశ్ పరువు నష్టం కేసు వేశారని, అయినా వారి దొంగ బుద్ధి మారలేదని విమర్శించారు. జగన్ మాదిరిగా ఇంట్లో ఎలుకలు పట్టడానికి ప్రభుత్వ సొమ్ము దోచేయలేదని, తాడేపల్లి ప్యాలెస్ నుంచి 15 కిమీ దూరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయనలా ప్రభుత్వ సొమ్ముతో ప్రత్యేక విమానంలో వెళ్లలేదని అన్నారు. ఎంత తీరికలేని కార్యక్రమాలున్నా ఏడాదిన్నరలో లోకేశ్ 75 ప్రజాదర్బార్లు నిర్వహించి వేల మంది సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చారని తెలిపారు. వారానికోసారి హైదరాబాద్ వెళ్తున్నారని అక్కసు వెళ్లగక్కిన జగన్ పత్రికకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా తెలంగాణలో పార్టీ వ్యవహారాలు చూసే బాధ్యత కూడా ఆయనకుందన తెలియదా అని ప్రశ్నించారు. గత ఏడాది ఆగస్టు 31న బుడమేరు వరద విజయవాడను ముంచెత్తిన సమయంలో లోకేశ్ హైదరాబాద్, ఢిల్లీలో సేదతీరారని జగన్ పత్రికలో రాశారని, కానీ ఆయన బుడమేరు కట్ట గండిపూడ్చే పనిని జలవనరుల మంత్రి రామానాయుడితో కలిసి పర్యవేక్షించిన సంగతి మరచిపోయారని మండిపడ్డారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.